సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 200

శుక్రవారం 11-10-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALORE | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'అభివృద్ధి ఎంత ముఖ్యమో... సంక్షేమమూ అంతే ముఖ్యం'



**మయాంక్ సెంచరీ**

దక్షిణాఫ్రికాతో రెండో టెస్టులో తొలి రోజు భారత్ 273/3 –స్పోర్ట్స్‌లో



**చరిత్ర సృష్టించిన మేరీ కోమ్**

ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో ఎనిమిదో పతకం –స్పోర్ట్స్‌లో

## సంయుక్త ప్రకటనలు, ఒప్పందాలు ఉండవ్

- నేడు భారత్‌కు రానున్న చైనా అధ్యక్షుడు
- మహాబలిపురంలో జిన్‌పింగ్, మోదీ భేటీ

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, భారత ప్రధాని నరేంద్రమోదీల మధ్య సమావేశానికి సన్నాహాలు పూర్తయ్యాయి. అక్టోబర్ 11, 12వ తేదీల్లో చెన్నై సమీపంలోని మహాబలిపురం వేదికగా ఇరుదేశాల నేతల సమావేశం జరుగుతుందని భారత్, చైనా విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలు ప్రకటించాయి. - వివరాలు 14లో





చెన్నై పర్యటనకు జిన్‌పింగ్ వస్తున్న నేపథ్యంలో గురువారం చెన్నైలోని ఓ స్కూలు విద్యార్థులు మాండరిన్ భాషలో జిన్‌పింగ్ అక్షరాల ఆకారంలో ఇలా కూర్చొని వినూత్నంగా స్వాగతం పలికారు



గురువారం హైదరాబాద్‌లోని జలవిహార్‌లో హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ దత్తాత్రేయ కుమార్తె ఆధ్వర్యంలో నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమంలో అంబలి సేవిస్తున్న రాష్ట్ర గవర్నర్ తమిళిసై దంపతులు, దత్తాత్రేయ దంపతులు. చిత్రంలో కె.లక్ష్మణ్, మురళీధర్, వీహెచ్, గుత్తా, విద్యాసాగర్‌రావు -5లో

# ప్లాస్టిక్ పనిపడదాం

**రాష్ట్రంలో ప్లాస్టిక్ ఉత్పత్తి, విక్రయాలపై నిషేధం • ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం**



**ఒక్కో కలెక్టర్‌కు రూ. 2 కోట్ల ప్రత్యేక నిధి**

**గ్రామాభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణ లాంటి పనుల్లో చురుకైన పాత్ర పోషించి కేంద్ర ప్రభుత్వం నుంచి అవార్డులు అందుకున్న పెద్దపల్లి కలెక్టర్ దేవసేన, సంగారెడ్డి కలెక్టర్ హనుమంతరావు, భూపాలపల్లి కలెక్టర్ వెంకటేశ్వర్లును సీఎం ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి జిల్లా కలెక్టర్‌కు రూ. 2 కోట్ల ప్రత్యేక నిధులు ఇవ్వనున్నామన్నారు. ఈ మేరకు 32 జిల్లాలకు రూ. 64 కోట్ల నిధుల విడుదల ఉత్తర్వులు వెలువడ్డాయి.**

- **త్వరలో జరిగే కేబినెట్ భేటీలో ఉత్తర్వులు**
- **ఎస్.కె. డే పేరిట పంచాయతీ సిబ్బందికి రూ. 2 లక్షల జీవిత బీమా**
- **ఇకపై ఏటా మూడుసార్లు పల్లె ప్రగతి**
- **ఇళ్లను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఉత్తమ గృహం అవార్డు**
- **20 రోజులపాటు పట్టణ ప్రగతి కార్యక్రమం నిర్వహణ**
- **పల్లె ప్రగతిపై మంత్రులు, కలెక్టర్లతో సుదీర్ఘ సమావేశం**
- **కార్యక్రమం దిగ్విజయంగా అమలైందని కితాబు**

సాక్షి, హైదరాబాద్: పర్యావరణాన్ని విపరీతంగా దెబ్బతీస్తూ జీవకోటి మనుగడకే ముప్పుగా మారిన ప్లాస్టిక్ ఉత్పత్తి, విక్రయాలను రాష్ట్రంలో నిషేధించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. త్వరలోనే మంత్రివర్గ సమావేశంలో చర్చించి ఉత్తర్వులు జారీ చేస్తామన్నారు. దీనికి సంబంధించిన విధానాలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో పచ్చదనం–పరిశుభ్రత పెంపు లక్ష్యంగా నిర్వహించిన 30 రోజుల ప్రత్యేక కార్యాచరణ (పల్లె ప్రగతి) అమలు జరిగిన తీరుపై సీఎం కేసీఆర్ గురువారం ప్రగతి భవన్‌లో మంత్రులు, కలెక్టర్లు, డీపీఓలు, డీఎల్పీఓలు, ముఖ్య కార్యదర్శులతో సుదీర్ఘంగా సమావేశమయ్యారు. ఉదయం 10 గంటలు మొదలైన ఈ భేటీ రాత్రి 9 గంటలకు ముగిసింది. ఈ భేటీలో ప్లాస్టిక్‌పై నిషేధం, గ్రామ పంచాయతీల సిబ్బందికి రూ. 2 లక్షల జీవిత బీమా, ఏటా మూడుసార్లు పల్లె ప్రగతి, అదే స్ఫూర్తితో పట్టణ ప్రగతి నిర్వహణ, ప్రతి జిల్లా కలెక్టర్‌కు రూ. 2 కోట్ల ప్రత్యేక నిధులకు సంబంధించిన నిర్ణయాలను ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి, పీసీసీఎఫ్ శోభ, డిస్కంల సీఎండీలు రఘుమారెడ్డి, గోపాలరావు తదితరులు పాల్గొన్న ఈ సమావేశంలో ప్రతి జిల్లా కలెక్టర్ 30 రోజుల కార్యక్రమం అమలులో వారి అనుభవాలను వివరించారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు

మిగతా 2వ పేజీలో ▶

## మరింత ఉధృతంగా ఆర్టీసీ సమ్మె

**ఆర్టీసీ జేఏసీ స్పష్టీకరణ... రెండ్రోజుల ప్రణాళిక విడుదల**

- ఆర్టీసీ సమ్మెకు అన్ని పక్షాల మద్దతు కోరుతున్న నేతలు
- నేడు ప్రజాప్రతినిధులకు వినతిపత్రాల సమర్పణ
- రేపు గాంధీ, జయశంకర్ విగ్రహాల వద్ద మౌన దీక్ష

**19న రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చే యోచన**

సాక్షి, హైదరాబాద్

తమ డిమాండ్ల సాధన కోసం ఉధృతంగా ఉద్యమించనున్నట్లు ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) స్పష్టం చేసింది. గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు సమ్మెపై ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి, హైకోర్టులో కేసు విచారణకు సంబంధించిన అంశాలపై చర్చించాయి. కార్మికుల సమ్మెకు తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశాయి. ఉద్యమ కార్యాచరణ రూపొందించి సమ్మెను తీవ్రతరం చేయాల్సిందిగా అభిప్రాయపడ్డాయి. ఆరు రోజులపాటు కార్మికులంతా ఏకతాటిపైకి వచ్చి సమ్మె చేయడం ఐక్యతకు నిదర్శనమని, ఇదే స్ఫూర్తితో డిమాండ్లను సాధించుకోవాలని సూచించాయి. ఆర్టీసీ సమ్మెకు అన్ని వర్గాల మద్దతు కూడగడితే సమ్మె తీవ్రత పెరుగుతుందని పలువురు అభిప్రాయపడ్డారు. సమ్మెను తీవ్రతరం చేసే

మిగతా 2వ పేజీలో ▶

**రైళ్ల ప్రైవేటీకరణకు కమిటీ** - వివరాలు 14లో

సాక్షి సెలబ్రేషన్ ఆఫర్
చదవండి... గెలవండి
59
కూపన్

LIC HFL
Home Loan @ 8.35% Onwards
Full processing fee refund on disbursement
log on to www.lichousing.com or place a missed call on 8422832132

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE
Vencobb FRESH CHICKEN
సూచించిన నేటి గుడ్లు & చికెన్ హైదరాబాద్ జోన్ ధరలు
గుడ్ల రిటైల్ ధర ₹ 55 డజన్
ఫారం దగ్గర లైవ్ బర్డ్ 80 కిలో
రిటైల్ లైవ్ బర్డ్ 102 కిలో
డ్రెస్డ్ స్కిన్‌తో 148 కిలో
స్కిన్‌లెస్ 168 కిలో
Conditions Apply
వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

## విద్యుత్ ఉద్యోగుల ఆందోళన బాట

- ఆర్టిజన్లకు ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ అమలుకు డిమాండ్
- నేడు ట్రాన్స్‌కో జేఎండీతో చర్చలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో ఆర్టిజన్లుగా విలీనమైన కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డు (ఏపీఎస్ఈబీ) సర్వీసు రూల్స్‌ను వర్తింపజేయాలనే ప్రధాన డిమాండ్‌తో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ట్రేడ్ యూనియన్స్ ఫ్రంట్ (టీఈటీయూఎఫ్) ఆందోళన బాటపట్టింది. 23 వేల మందికిపైగా ఉన్న ఆర్టిజన్లకు స్టాండింగ్ ఆర్డర్ల పేరుతో ప్రత్యేక సర్వీసు నిబంధనలను అమలు చేసేందుకు యాజమాన్యాలు చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలంటూ ఆందోళన కార్యక్రమాలు చేపట్టింది. ఈ నెల 4న పాల్వంచలోని కేటీపీఎస్ విద్యుత్ ప్లాంట్ వద్ద భారీ ఆందోళన నిర్వహించగా శుక్రవారం హన్మకొండలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని ప్రకటించింది. తమ 24 డిమాండ్లను పరిష్కరించని పక్షంలో ఏ క్షణంలోనైనా మెరుపు సమ్మెకు దిగుతామని ఫ్రంట్ చైర్మన్, కన్వీనర్‌లు ఎన్.పద్మారెడ్డి, ఇ.శ్రీధర్ ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో ట్రాన్స్‌కో యాజమాన్యం టీఈయూటీఎఫ్ నాయకత్వంతో చర్చలు జరపాలని నిర్ణయించింది. ట్రాన్స్‌కో జేఎండీ సి. శ్రీనివాసరావు శుక్రవారం విద్యుత్ సౌధలో చర్చలు నిర్వహించనున్నారు.

**టీఈటీయూఎఫ్ కీలక డిమాండ్లు ఇవీ..**

- 1999 ఫిబ్రవరి 1 తర్వాత సర్వీసులో చేరిన ఉద్యోగులందరికీ ఈపీఎఫ్‌కు బదులు జీపీఎఫ్ అమలు చేయాలి
- ఆర్టిజన్లకు పీఆర్సీ, తెలంగాణ ఇంక్రిమెంట్, 24X7 ఇంక్రిమెంట్ వర్తింపజేయాలి
- పీస్ రేటు విధానంలో పనిచేస్తున్న కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించాలి.
- ఖాళీలను భర్తీ చేయడంతోపాటు కొత్త కార్యాలయాలకు పోస్టులను మంజూరు చేయాలి, పదోన్నతులు కల్పించాలి

## దశలవారీగా సమస్యల పరిష్కారం

- ఉప ఎన్నిక కోడ్ ముగిశాక చర్చలు
- ఉద్యోగ సంఘాలకు సీఎం కేసీఆర్ హామీ
- పీఆర్సీ, డీఏ, రిటైర్మెంట్ వయసు పెంపు హామీలపై చర్చిస్తాం

సాక్షి, హైదరాబాద్: హుజూర్‌నగర్ ఉప ఎన్నిక ప్రవర్తనా నియమావళి ఈ నెల 21తో ముగియనుందని, అనంతరం ఉద్యోగ సంఘాల నేతలతో చర్చలు జరిపి దశల వారీగా సమస్యలను పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు హామీనిచ్చారు. పీఆర్సీ, డీఏ, ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంపు తదితర హామీలపై చర్చిస్తామన్నారు. మంత్రి శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ మమత, టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్, టీజీఓల ప్రధాన కార్యదర్శి ఎ.సత్యనారాయణ, జ్ఞానేశ్వర్‌ల బృందం గురువారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసింది. 30 రోజుల పల్లె ప్రణాళికను దిగ్విజయంగా అమలు చేసినందుకుగాను సీఎం కేసీఆర్ ఉద్యోగులకు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.

### హండ్కే, ఓల్గాలకు సాహితీ నోబెల్



- గతంలో సాహిత్య రంగంలో నోబెల్‌ను నిషేధించాలన్న హండ్కే
- రచయిత్రి ఓల్గా టోర్కార్ క్‌జుక్‌కు 2018 సంవత్సర పురస్కారం
- 'ద బుక్ ఆఫ్ జాకోబ్' నవలకు అందుకోనున్న పోలండ్ రచయిత్రి

- వివరాలు 14లో

### 'మహా' తెలంగాణ పాట!



- రాష్ట్రంతో మహారాష్ట్ర వాసుల అనుబంధం..
- నిజాం పాలనలో హైదరాబాద్ సంస్థానంలోనే..
- పథకాలకు ఆకర్షితులవుతున్న సరిహద్దు గ్రామాల వాసులు..
- తెలంగాణలో విలీనం చేయాలంటూ విజ్ఞప్తులు..
- దెగ్లూర్–బిలోలి తాలూకా గ్రామాలవాసుల మనోగతం

3లో

### మాజీ ఎమ్మెల్సీ కె.ఆర్.ఆమోస్ కన్నుమూత



- గుండెనొప్పితో కుప్పకూలిన తెలంగాణ ఉద్యమ నేత
- తెలంగాణ ఉద్యమ కాలంలో డిస్మిస్ అయిన తొలి వ్యక్తిగా గుర్తింపు -13లో





అలా కనిపిస్తుందంటే కచ్చితంగా 'కంటి వెలుగు'లో పరీక్ష చేయించుకోమంటున్నార్సార్!!

# 'రియల్' నేలచూపులు..!

**స్థిరాస్తి రంగంలో అనిశ్చితి.. ఆర్థిక మాంద్యమే ప్రధాన కారణం**

**భారీగా పడిపోయిన క్రయ విక్రయాలు..**

**నిర్మాణ రంగంలోనూ ఇదే పరిస్థితి**



సాక్షి, హైదరాబాద్:

స్థిరాస్తి రంగంలో స్తబ్ధత నెలకొంది. ఆర్థిక మాంద్యం.. నింగినంటిన ధరలతో రియల్టీ నేల చూపులు చూస్తోంది. అక్కడక్కడా లావాదేవీలు జరుగుతున్నా.. గతంలో చేసుకున్న ఒప్పందాలే తప్ప.. కొత్త కొనుగోళ్లు దాదాపు నిలిచిపోయాయి. దేశవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక మాంద్యం ప్రభావం రియల్ ఎస్టేట్ వ్యాపారంపై తీవ్ర ప్రభావం చూపింది. అసాధారణంగా పెరిగిన ధరలు కూడా కొనుగోలుదారులు వెనక్కి తగ్గేలా చేశాయి. మరోవైపు ప్రతిపాదిత రీజనల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్)పై నీలినీడలు కమ్ముకున్నట్లు వార్తలు రావడంతో రియల్ రంగం పతనానికి కారణమైంది. ఈ రహదారి నిర్మాణంతో మహర్దశ పడుతుందని ఆశించిన సామాన్య, మధ్యతరగతి ప్రజలతో పాటు ఆర్థికంగా నిలదొక్కుకున్న వారు హైదరాబాద్‌కు 100 కిలోమీటర్ల దూరంలో ప్లాట్లు, వ్యవసాయ భూములపై పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపారు. దీంతో మహబూబ్‌నగర్, ఆలంపూర్, అచ్చంపేట, కల్వకుర్తి, దేవరకొండ, మిర్యాలగూడ, నకిరేకల్, కామారెడ్డి, సిద్దిపేట, జనగామ, జహీరాబాద్, తాండూరు తదితర ప్రాంతాల్లో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్ ఖరారు కాకముందే బ్రోకర్ల మాయాజాలంతో ధరలు ఆకాశాన్నంటాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఏకాభిప్రాయం కుదరనందున ప్రతిపాదిత రహదారి అటకెక్కినట్లే నన్న ప్రచారం.. రియల్ మార్కెట్ భారీ కుదుపునకు గురిచేసింది. దీంతో అప్పటివరకు దూకుడు మీద ఉన్న వ్యాపారం చతికిలపడింది. అగ్రిమెంట్లు చేసుకొని అమ్ముకుందామనే దశలో కొనుగోలుదారులు ముందుకు రాకపోవడంతో ఆర్థికంగా బాగా నష్టపోతున్నారు.

**ఆర్థిక మాంద్యంతో కుదేలు!**

ఆర్థిక మాంద్యం స్థిరాస్తి రంగాన్ని కుదేలు చేస్తోంది. ప్రచార, ప్రసార మాధ్యమాల్లో ఈ మాంద్యం ప్రభావం తీవ్రంగా ఉండనుందనే ప్రచారం కూడా దీనికి తోడు కావడంతో ఇళ్ల స్థలాలు, భూముల కొనుగోళ్లు దాదాపు నిలిచిపోయాయి. అటు నిర్మాణ రంగంలోనూ ఈ ప్రభావం కన్పిస్తోంది. నిర్మాణ ఖర్చులు పెరిగిపోవడంతో విల్లాలు, ఫ్లాట్‌ల ధరలు అనూహ్యంగా పెరిగాయి. ధరలకు అనుగుణంగా కొనుగోళ్లు లేకపోవడంతో

మిగతా 2వ పేజీలో ▶

### ఎడాపెడా పెట్టుబడులు!

**స్థిరాస్తి రంగం కాసులు కురిపిస్తుండటంతో బడాబాబులు, సంపన్నవర్గాల పెట్టుబడులకు ఇది కేంద్రబిందువుగా మారింది. దీనికితోడు కేంద్రం బ్యాంకు లావాదేవీలపై నియంత్రణ విధించడంతో నల్లధనం కూడా వెల్లువలా వచ్చింది. దీంతో భూముల విలువ అమాంతం చుక్కలను తాకాయి. తాజాగా నెలకొన్న పరిస్థితులతో పెట్టుబడులపై సంపన్న వర్గాలు కూడా ఆచితూచి అడుగేస్తుండటం కూడా రియల్ రంగం ఒడిదుడుకులకు కారణంగా చెబుతున్నారు.**

## టమాటాలతో వీర్యవృద్ధి!

టమాటాలు ఎర్రగా ఉండేందుకు కారణమైన రసాయనం లైకోపీన్‌తో వీర్యవృద్ధి సాధ్యమంటున్నారు షెఫీల్డ్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు. బ్రిటన్‌లోని కొంతమంది యువకులపై 12 వారాల పాటు జరిపిన పరిశోధనల ద్వారా తాము ఈ విషయాన్ని తెలుసుకోగలిగామని ప్రొఫెసర్ అలన్ పేసీ తెలిపారు. 19 నుంచి 30 ఏళ్ల మధ్య వయసున్న వారిలో కొంతమందికి లాక్టోలైకోపీన్‌తో కూడిన మాత్రలు.. ఇతరులకు ఉత్తుత్తి మాత్రలు అందించారు. పన్నెండు వారాల తర్వాత పరీక్షలు జరిపినప్పుడు లైకోపీన్ మాత్రలు తీసుకున్న వారి వీర్యంలో చురుకుగా కదులుతున్న కణాలు 40 శాతం వరకు వృద్ధి చెందినట్లు తేలింది. అంతేకాకుండా వీర్యకణాల ఆకారం, పరిమాణం కూడా ఎక్కువైనట్లు గుర్తించారు. లైకోపీన్‌తో ఆరోగ్యానికి ఎన్నో లాభాలుంటాయని తెలిసినప్పటికీ వీర్యవృద్ధికి కూడా ఉపయోగపడుతుందన్నది తాము ఊహించలేదని అలన్ అన్నారు. తప్పుల్లేకుండా ఉండేందుకు పరిశోధనలకు సంబంధించిన అన్ని లెక్కలను కంప్యూటర్ సాయంతో పూర్తి చేశామని వివరించారు. అయితే ప్రస్తుతం తాము చేసిన ప్రయోగం చాలా చిన్నదని.. వంధ్యత్వ సమస్య



లతో బాధపడుతున్న వారితో విస్తృత స్థాయి పరిశోధనకు ఇప్పుడు సిద్ధమవుతున్నామన్నారు. అందులోనూ ఫలితాలు పునరావృతమైతే అత్యంత శక్తిమంతమైన యాంటీఆక్సిడెంట్‌గా గుర్తింపు పొందిన లైకోపీన్‌కు ఇంకో ఉపయోగం దొరికినట్లేనని చెప్పారు.

## డయాబెటిక్ పాదానికి రక్ష!

మధుమేహం ఉన్న వారు తమ పాదాలను గుండె కంటే జాగ్రత్తగా చూసుకోవాలని అంటుంటారు. ఎందుకంటే నొప్పి తెలిసే అవకాశం ఉండదు కాబట్టి.. పాదాలపై గాయాలు కాస్తా ముదిరి పుండుగా మారకుండా ఉండేందుకు ఈ జాగ్రత్త. చాలామంది వీటిపై దృష్టి పెట్టని కారణంగా పుండ్లు పెద్దవై కాలిలో ఓ భాగాన్నే తీసేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంటుంది. ఇదంతా ఎందుకు చెప్పాల్సి వస్తోందంటే.. అమెరికాలోని స్టీవెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఈ సమస్యను అధిగమించేందుకు ఓ వినూత్న ఆవిష్కరణ చేసింది. మన కాలి సాక్సుల అడుగుభాగంలో ఓ పరికరాన్ని బిగించి పాదాలను పరీక్షించే ఏర్పాటుచేశారు. లిన్ లీ అనే శాస్త్రవేత్త ఆవిష్కరించిన ఈ పరికరం గ్రాఫీన్ ఆధారిత సెన్సార్లతో పనిచేస్తుంది. చర్మం తాలూకూ ఒత్తిడి మారినా, ఉష్ణోగ్రత పెరిగినా ఈ సెన్సార్లు గుర్తిస్తాయి. అందిన సమాచారాన్ని బట్టి పాదంపై పుండు లేదా గాయమేర్పడేందుకు అవకాశముందని గుర్తిస్తుంది. ఆ వెంటనే బ్లూటూత్ టెక్నాలజీ సాయంతో సాక్సులు తొడుక్కున్న వ్యక్తి స్మార్ట్‌ఫోన్‌కు సమాచారం పంపడంతోపాటు ఏ రకమైన చర్యలు తీసుకోవాలో కూడా తెలుపుతుంది ఈ పరికరం. దీని బ్యాటరీ 4 నెలలు పనిచేయడం



విశేషం. వచ్చే ఏడాది చివరికల్లా వాణిజ్య స్థాయిలో అందుబాటులోకి రానుంది. హీబ్రూ వర్సిటీతోపాటు జర్మనీలోని ఫ్రాన్‌హోఫర్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ సిలికేట్ రీసెర్చ్‌లు కూడా మధుమేహుల పాదాలపై నిఘా ఉంచేందుకు ప్రత్యేకమైన కాలితొడుగులు ఇప్పటికే సిద్ధం చేశాయి.

## ప్లాస్టిక్‌ను తినే బ్యాక్టీరియా

న్యూఢిల్లీ: ప్లాస్టిక్ భూతాన్ని నాశనం చేసే సరికొత్త అస్త్రాలను భారతీయ శాస్త్రవేత్తలు సిద్ధం చేశారు. గ్రేటర్ నోయిడాలోని శివ్ నాడార్ వర్సిటీ శాస్త్రవేత్తలు చిత్తడి నేలల్లో ప్లాస్టిక్‌ను తినేయగల 2 రకాల బ్యాక్టీరియాలను గుర్తించారు. ఒకసారి మాత్రమే వాడగల ప్లాస్టిక్‌లో కీలక పదార్థమైన పాలిస్టిరీన్‌ను ఈ బ్యాక్టీరియా నాశనం చేయగలవంటున్నారు. డిస్పోజబుల్ కప్పులు, స్పూన్లు, ప్యాకేజింగ్ పదార్థాల్లో కనిపించే పాలిస్టిరీన్ చాలా దృఢంగా ఉండటం వల్ల తొందరగా నశించదు. దీంతో పర్యావరణానికి నష్టం ఎక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలో తాము సూక్ష్మజీవుల వైవిధ్యత ఎక్కువగా ఉండే చిత్తడి నేలల్లో పరిశోధనలు చేపట్టి ఈ కొత్త బ్యాక్టీరియాను గుర్తించామని శాస్త్రవేత్త రిచా ప్రియదర్శిని తెలిపారు. ఈ బ్యాక్టీరియా పాలిస్టిరీన్‌ను తన కర్బన అవసరాలను తీర్చుకునేందుకు ఉపయోగించుకుంటుందని వాటిపై ఓ పొరలాంటి నిర్మాణాన్ని ఏర్పాటు చేయడంతో అవి నాశనమవడం మొదలవుతుందని వివరించారు. ప్లాస్టిక్‌ను తినే బ్యాక్టీరియాతోపాటు తాము కొన్ని వైవిధ్యభరితమైన ఇతర బ్యాక్టీరియాను కూడా యూనివర్సిటీలోనే ఉన్న చిత్తడి నేలల్లో గుర్తించామని వైస్ చాన్స్‌లర్ రూపమంజరి ఘోష్ తెలిపారు. దేశంలో ఏటా



దాదాపు కోటీ అరవై ఐదు లక్షల టన్నుల ప్లాస్టిక్ వినియోగం జరుగుతుండగా, కోటీ నలభై లక్షల టన్నుల పాలిస్టిరీన్ ఉత్పత్తి జరుగుతోందని అంచనా. రీసైక్లింగ్ వ్యవస్థలు లేకపోవడం వల్ల ప్లాస్టిక్ అటు జలచరాలకు ఇటు భూ ఉపరితల జీవజాలానికీ చేటు తెచ్చేలా పరిణమించింది.

## క్లుప్తంగా...

### నేడు పలు చోట్ల వర్షాలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో శుక్రవారం అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఒకటి, రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. శని, ఆదివారాల్లోకొన్ని చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. కోస్తాంధ్ర, దాని పరిసర ప్రాంతాల్లో 2.1 కి.మీ. ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని, కొమోరిన్ ప్రాంతం నుంచి కోస్తాంధ్ర వరకు తమిళనాడు, రాయలసీమ మీదుగా 0.9 కి.మీ. ఎత్తు వద్ద ఉపరితల ద్రోణి కొనసాగుతోందని వెల్లడించింది.

### లాజిస్టిక్ హబ్ సిద్ధం

**నేడు ప్రారంభించనున్న కేటీఆర్**

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఇబ్రహీంపట్నం మండలం మంగళ్‌పల్లిలో లాజిస్టిక్ హబ్ (వస్తు నిల్వ కేంద్రం) సిద్ధమైంది. ఇప్పటివరకు 60 శాతం పనులు పూర్తికావడంతో కమర్షియల్ ఆపరేషన్ ప్రారంభించేందుకు ముహూర్తం ఖరారు చేశారు. మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా శుక్రవారం దీనిని ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నగరంలో వాహనాల రద్దీని నియంత్రించడం, వాయు కాలుష్యం తగ్గించడం కోసం హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) ఆధ్వర్యంలో దీనిని ఏర్పాటు చేశారు. 22 ఎకరాల విస్తీర్ణంలో రూ.20 కోట్ల వ్యయంతో పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) విధానంలో దీన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నారు.

### సికింద్రాబాద్-కాకినాడ ప్రత్యేక రైలు

సాక్షి, హైదరాబాద్: రద్దీ దృష్ట్యా సికింద్రాబాద్-కాకినాడ (07461/07462) ప్రత్యేక రైలు నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో రాకేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రైలు ఈ నెల 12వ తేదీ రాత్రి 8.45కి సికింద్రాబాద్ నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు కాకినాడ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 13వ తేదీ రాత్రి 8.45కు కాకినాడ నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.55కు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

### ఓఎంసీ కేసును బదిలీ చేయొద్దు!

**స్వరం మార్చిన సీబీఐ**

సాక్షి, హైదరాబాద్: ఓబుళాపురం గనుల కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) స్వరం మార్చింది. ఓఎంసీ కేసును విశాఖపట్నానికి బదిలీ చేయాలని గతంలో కోరిన సీబీఐ.. ప్రస్తుతం బదిలీ చేయవద్దని సీబీఐ కోర్టును కోరింది. ఈ మేరకు కోర్టులో మెమో దాఖలు చేసింది. విశాఖకు బదిలీ చేస్తే విచారణ ఆలస్యమవుతుందని పేర్కొంది. నేరం జరిగినప్పుడు నిందితుల్లో ఎక్కువమంది హైదరాబాద్ వాసులుగా ఉన్నారని, ఇక్కడి అధికారులు, సంస్థలు హైదరాబాద్‌లోనే నేరానికి పాల్పడినట్లుగా అభియోగాలు ఉన్నందున ఇక్కడే విచారణ కొనసాగించాలని మెమోలో కోర్టును కోరింది. రాష్ట్ర విభజన జరగకముందే ఓఎంసీ కేసులో ఛార్జిషీట్లు దాఖలయ్యాయని తెలిపింది. దీంతో కేసు బదిలీపై సీబీఐ కోర్టు విచారణ 18కి వాయిదా పడింది.

### ఇదే స్ఫూర్తి కొనసాగించండి



**అధికారులకు ట్రాన్స్‌కో సీఎండీ పిలుపు**

సాక్షి, హైదరాబాద్: పల్లె ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో అన్ని శాఖల్లోకెల్లా విద్యుత్ శాఖ అద్భుతంగా సేవలందించి తొలి స్థానంలో నిలవడం పట్ల ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్ రావు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సిబ్బంది రేయింబవళ్లూ పనిచేసి, విద్యుత్ సంబంధిత పనులు చేశారని అభినందించారు. విద్యుత్ సిబ్బంది సేవలను గుర్తించిన సీఎం కేసీఆర్‌కు ప్రభాకర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించి, భవిష్యత్తులో కూడా విద్యుత్ సంబంధిత సమస్యలను వెంటనే పరిష్కరించడానికి కృషి చేయాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి అనేక రకాల సేవలు అందిస్తూ అటు ప్రభుత్వం, ఇటు ప్రజల నుంచి అభినందనలు అందుకోవడం వెనుక విద్యుత్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది శ్రమ ఫలితం, సీఎం కేసీఆర్ మార్గనిర్దేశం కారణమన్నారు.



గురువారం ప్రగతి భవన్‌లో కలెక్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రులు, సీఎస్ జోషి తదితరులు

# ప్లాస్టిక్ పనిపడదాం

▶ మొదటి పేజీ తరువాయి

సమష్టి ప్రణాళిక, కార్యాచరణ, అభివృద్ధి ఆశయాలతో కార్యక్రమం నిర్వహించినట్లు వెల్లడించారు.

**పల్లె ప్రగతి దిగ్విజయం...**

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పల్లె ప్రగతి కార్యక్రమం దిగ్విజయమైందని సీఎం కేసీఆర్ తెలిపారు. అన్ని గ్రామాల్లో పవర్ వీక్ నిర్వహించి విద్యుత్ సమస్యలు పరిష్కరించడంలో విద్యుత్‌శాఖ అద్భుతంగా పనిచేసి అన్ని శాఖల్లోకెల్లా నంబర్ వన్‌గా నిలిచిందని కొనియాడారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మంత్రులు, కలెక్టర్లు, డీపీఓలు, డీఎల్పీఓలు, ఎంపీఓలు, గ్రామ కార్యదర్శులు, సర్పంచులకు అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. గ్రామాల అభివృద్ధికి నెలకు రూ. 339 కోట్లు విడుదల చేయాలనే నిర్ణయానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

**పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన...**

పల్లె ప్రగతి కార్యక్రమంతో మంచి ఫలితం వచ్చిందని, మన ఊరిని మనమే పరిశుభ్రంగా ఉంచుకోవాలనే అవగాహన ప్రజల్లో వచ్చిందని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ స్ఫూర్తిని కొనసాగించడానికి భవిష్యత్తులోనూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించారు. గ్రామాలు బాగుపడాలనే ఉద్దేశంతో గ్రామ కార్యదర్శి నుంచి జిల్లా పంచాయతీ అధికారి వరకు అన్ని ఖాళీలను భర్తీ చేసినట్లు వెల్లడించారు. గ్రామ పంచాయతీలకు ఎట్టిపరిస్థితుల్లోనూ నిధుల కొరత రానివ్వబోమన్నారు. ప్రతి నెలా గ్రామ పంచాయతీలకు రూ. 339 కోట్ల ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం విడుదల చేస్తోందని, ఇది క్రమం తప్పకుండా కొనసాగుతుందని స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీలకు సమకూరే సొంత ఆదాయానికి ఇది అదనమన్నారు. మొక్కల పెంపకం, చెత్త ఎత్తివేసే పనులకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (నరేగా) నిధులను వాడుకోవాలని సీఎం సూచించారు.

**విద్యుత్ సిబ్బంది పనితీరు భేష్...**

విద్యుత్ సిబ్బంది 30 రోజుల కార్యాచరణ ముగిసినప్పటికీ ఇంకా గ్రామాల్లో పనులు చేస్తున్నారని (గ్రామాల్లో వీధిలైట్ల నిర్వహణకు 6,834 కిలోమీటర్ల మేర కొత్త వైరు వేస్తున్నారు. వీధిలైట్లకు బిగించిన 7,527 కరెంటు మీటర్లు పాడైపోయినందున వాటి స్థానంలో కొత్త మీటర్లు బిగిస్తున్నారు. వీధిలైట్ల కోసం కొత్తగా 2,54,424 కరెంటు మీటర్లు బిగిస్తున్నారు) సీఎం కేసీఆర్ అభినందించారు. తాను 1985 నుంచి ఎమ్మెల్యేగా ఉన్నా గ్రామాల్లో విద్యుత్ సంబంధ సమస్యల పరిష్కారానికి ఇప్పటిదాకా ఇంత పెద్ద ప్రయత్నం జరగలేదన్నారు. నిర్దేశించిన పనుల్లో ఇప్పటికే 60 శాతానికిపైగా పూర్తయ్యాయన్నారు. ఏజెన్సీ ప్రాంతాలు, ఎస్టీ తండాలు, గూడేల్లో త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. ఈ ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించడానికి సీనియర్ ఐఏఎస్‌లు సోమేశ్‌కుమార్, రఘునందన్‌రావు, అజయ్ మిశ్రాలతో కమిటీ వేశారు.

**అడవులు తక్కువ ఉన్న చోట ప్రత్యేక శ్రద్ధ**

హరితహారం కార్యక్రమాన్ని మరింత వ్యూహాత్మకంగా ముందుకు తీసుకెళ్లాలని సీఎం కేసీఆర్ సూచించారు. అడవులు తక్కువగా ఉన్న కరీంనగర్, జనగామ, యాదాద్రి, సూర్యాపేట, వరంగల్ అర్బన్, గద్వాల్, నారాయణపేట తదితర జిల్లాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

**పంచాయతీ సిబ్బందికి బీమా**

గ్రామ పంచాయతీ సిబ్బందికి పూర్తి ప్రభుత్వ ఖర్చుతో ఎస్‌కే డే జీవిత బీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. గ్రామ పంచాయతీ ఉద్యోగులు ఎవరైనా మరణిస్తే వారి కుటుంబానికి రూ. 2 లక్షల బీమా సొమ్ము అందేలా పథకం ఉంటుందని వివరించారు. రైతుల కోసం అమలు చేస్తున్న రైతు బీమా మాదిరిగానే ఎస్.కె.డే బీమా కూడా ఉంటుందని వెల్లడించారు. దేశంలో పంచాయతీరాజ్ ఉద్యమానికి ఆద్యుడైన ఎస్.కె.డేకు నివాళిగా జీవిత బీమాకు ఆయన పేరు పెడుతున్నామన్నారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో ప్రతి ఇంట్లో నరేగా నిధులతో సోక్ పిట్స్ నిర్మించాలని ఆదేశించారు. సోక్ పిట్స్ వల్ల ఏ ఇంటిలోని



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్లు, ఉన్నతాధికారులు

వ్యర్థం, మురికినీరు అక్కడే అంతర్ధానమై, గ్రామంలో దోమలు, ఈగలు వ్యాపించకుండా ఉంటాయన్నారు. అంటువ్యాధులు ప్రబలే అవకాశాలు తగ్గుతాయన్నారు. సిద్దిపేట, పెద్దపల్లి జిల్లాలను ఆదర్శంగా తీసుకొని సోక్ పిట్స్ నిర్మించాలని కోరారు. సోక్ పిట్స్ నిర్మాణం కోసం అవసరమయ్యే నిధులను విడుదల చేయాలని కోరారు.

**మూడుసార్లు పల్లెప్రగతి.. 20 రోజులు పట్టణ ప్రగతి**

ఇకపై పల్లె ప్రగతి కార్యక్రమాన్ని ప్రతీ ఏటా మూడు సార్లు నిర్వహించాలని నిర్ణయించామని సీఎం కేసీఆర్ తెలిపారు. ఏటా జూన్, సెప్టెంబర్, జనవరిలలో 10 రోజుల చొప్పున పల్లె ప్రగతి నిర్వహించాలన్నారు. పల్లె ప్రగతి మాదిరిగానే 20 రోజులపాటు పట్టణ ప్రగతి కార్యక్రమం నిర్వహించాలని, దీనికోసం మార్గదర్శకాలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు.

**ముఖ్యమంత్రి చెప్పిన మరిన్ని విషయాలు ఆయన మాటల్లోనే...**

- ఈ ఏడాది 75 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది. పౌర సరఫరాలశాఖ ద్వారా ధాన్యాన్ని సేకరించాలి. ఇందుకోసం అవసరమైనన్ని సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి కలెక్టర్లకు పూర్తి అధికారం ఉంది. అందరూ ఒకేసారి సరుకును మార్కెట్‌కు తేకుండా నియంత్రిత పద్ధతిలో సేకరణ జరగాలి.
- గ్రామ కంఠంలోని ఆస్తులు, స్థలాలు, ఇళ్లు ఏదో ఒక పద్ధతి ప్రకారం రికార్డు కావాలి. ఏదో ఒక రకమైన టైటిల్ ఆస్తి సొంతదారులకు ఉండాలి. దీనికి ఏం చేయాల్నో ఆలోచన జరగాలి. ఇతర రాష్ట్రాల్లో, ఇతర దేశాల్లో ఉన్న అత్యుత్తమ విధానాలను అధ్యయనం చేయాలి. పంచాయతీరాజ్ కార్యదర్శి ఈ అధ్యయనం చేయాలి. మనం తీసుకున్న నిర్ణయం దేశానికే ఒక మోడల్ కావాలి.
- గ్రామాల్లో లే ఔట్ ఎలా ఉండాలి, ఏం చేయాలి అనే దాన్ని గురించి పంచాయతీరాజ్ శాఖ మంత్రి అధ్యక్షతన నియమించిన క్యాబినెట్ సబ్ కమిటీ నిర్ణయం తీసుకొని ప్రభుత్వానికి తెలియజేయాలి.
- రాష్ట్రంలోని మొత్తం లంబాడీ తండాల్లో అటవీ భూముల్లో ఎన్ని, అటవీయేతర భూముల్లో ఎన్ని ఉన్నాయో గుర్తించాలి. ఉన్న తండాలు, గోండు గూడేలు, కోయ గూడేలు, సొంత జాగాలు ఎన్ని ఉన్నాయో కలెక్టర్లు లెక్కలు తీయాలి.
- గ్రామ పంచాయతీలో నిర్ణయాలు, నిధుల వినియోగం ఏకస్వామ్యంగా ఉండకూడదు. గ్రామ పంచాయతీలో సమష్టిగా నిర్ణయాలు జరగాలి.
- గ్రామాల్లో ఏర్పాటు చేసే డంప్ యార్డుల పై షెడ్లు ఏర్పాటు చేయాలి. షెడ్లు లేకుంటే వర్షపు నీరు చేరి, కాలుష్యం వ్యాప్తిచెందే ప్రమాదముంది.
- గ్రామాల్లో నిర్వహించిన పల్లె ప్రగతి మాదిరిగానే త్వరలోనే పట్టణ ప్రగతి కార్యక్రమం నిర్వహించాలి. గ్రామాలకు ఇచ్చినట్లే మున్సిపల్ ఎన్నికల తర్వాత పట్టణాలకూ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేస్తాం.
- పట్టణ పరిపాలనను మరింత పటిష్ట పరిచేవిధంగా సెంటర్ ఆఫ్ అర్బన్ ఎక్స్ లెన్సీ ప్రారంభించాలి.
- గ్రామాల అభివృద్ధికి అవసరమైన విధానాల రూపకల్పనకు, అమలుకు, పర్యవేక్షణ, శిక్షణ కోసం తెలంగాణ స్టేట్ అకాడమీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్‌ను బలోపేతం చేయాలి.
- గ్రామాలు, పట్టణాల్లో స్మృతి వనాలు ఏర్పాటు చేయాలి. ఎవరైనా పుడితే వారి పేరుమీద మొక్కను నాటాలి. ఎవరైనా చనిపోతే వారి జ్ఞాపకం కోసం చెట్టు పెట్టాలి.
- గ్రామాల్లో వీధిలైట్ల కోసం మీటర్ల బిగింపు వందశాతం పూర్తయిన వెంటనే, మీటరు రీడింగుకు అనుగుణంగా ప్రతినెలా విద్యుత్ బిల్లులను విధిగా చెల్లించాలి.
- మంకీ ఫుడ్ కోర్టుల కోసం అవసరమైన పండ్ల మొక్కలను అటవీశాఖ సరఫరా చేయాలి. అటవీ భూములు ఎక్కువగా లేనిచోట నదులు, ఉపనదులు, కాలువలు, వాగులు, చెరువుల ఒడ్డున కోతులు తినడానికి ఉపయోగపడే పండ్ల చెట్లు పెంచాలి.

### పల్లెల్లో బీఆర్ఎస్, ఎల్ఆర్ఎస్ అమలుపై పరిశీలన..

పచ్చదనం–పరిశుభ్రత పెంచే కార్యక్రమంలో భాగంగా తన ఇంటిని, పరిసరాలను పచ్చగా, శుభ్రంగా ఉంచుకొనే వారి ఇళ్లకు ఉత్తమ గృహం అవార్డు ఇవ్వనున్నట్లు సీఎం ప్రకటించారు. గ్రామాల్లో బిల్డింగ్ రెగ్యులరైజేషన్ స్కీమ్, ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ అమలు సాధ్యాసాధ్యాలను పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి నాయకత్వంలోని కమిటీ పరిశీలించాలన్నారు. కమిటీ నివేదిక ఇచ్చాక బీఆర్ఎస్, ఎల్ఆర్ఎస్‌పై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ప్రతి గ్రామం సరిహద్దులను నిర్ణయిస్తూ, గ్రామ కంఠాన్ని ఖరారు చేయాలని ఆదేశించారు. గ్రామంలోని రహదారులను గ్రామ పంచాయతీ పేర రిజిష్టర్ చేయాలన్నారు.

# గ్రేటర్ రోడ్లు ప్రైవేటుకు!

- **విధివిధానాలు రూపొందించేందుకు కమిటీ ఏర్పాటు**
- **తొలిదశలో 687 కి.మీ.లు అప్పగించే అవకాశం**

సాక్షి, హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్‌లో రోడ్ల నిర్వహణ బాధ్యతల్ని పేరెన్నికగన్న జాతీయ, అంతర్జాతీయ సంస్థలు చేపట్టనున్నాయి. భారీ ఫ్లైఓవర్లు, ఇరిగేషన్ ప్రాజెక్టులతోసహా వివిధ ఇంజనీరింగ్ పనుల్లో పేరుగాంచిన సంస్థలు ఇకపై నగర రోడ్ల నిర్వహణ పనులు చేయనున్నాయి. జీహెచ్ఎంసీ పరిధిలో 9వేల కిలోమీటర్లకు పైగా రోడ్లుండగా, ప్రధాన మార్గాల్లో దాదాపు 3 వేల కిలోమీటర్లు ఉన్నాయి. వీటి మరమ్మతులు, రీకార్పెటింగ్, తదితర పనుల కోసం జీహెచ్ఎంసీ ఏటా రూ. 500– 600 కోట్లు ఖర్చు చేస్తోంది. అయినప్పటికీ రోడ్లు ఎప్పుడూ గుంతల మయమే. అధ్వాన్నపు రోడ్లతో ప్రజలకు అవస్థలేకాకుండా, సామాజిక మాధ్యమాల్లో నిత్యం ప్రభుత్వంపై విమర్శలు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో రోడ్ల నిర్వహణను పూర్తిగా ప్రైవేట్ సంస్థలకివ్వాలని మునిసిపల్ మంత్రి కేటీఆర్ నిర్ణయించారు. విధివిధానాలు రూపొందించేందుకు జీహెచ్ఎంసీలోని ముగ్గురు చీఫ్ ఇంజనీర్లతోపాటు, పబ్లిక్ హెల్త్ మాజీ ఈఎన్‌సీని కమిటీ సభ్యులుగా నియమించారు. దీనికి సంబంధించిన టెండర్లు పిలిచేందుకు ముందుగా పేరెన్నికగన్న పలు కంపెనీలతో కమిటీ సమావేశం నిర్వహించింది. వందలు, వేల కోట్ల భారీ ప్రాజెక్టులు చేసే పెద్ద కంపెనీలు రోడ్ల నిర్వహణకు ఒప్పుకుంటాయా అనే అనుమానాలున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో రోడ్లను పరిశీలించేందుకు అంగీకరించాయి. ఆయా సంస్థలు రోడ్లను పరిశీలించాక, మరోమారు జరిగే సమావేశంలో టెండర్లలో పొందుపరిచే అంశాలు, నిబంధనలు, నిర్వహణ వ్యయం తదితర అంశాలపై స్పష్టత వచ్చే అవకాశముంది. అది పూర్తయ్యాక టెండర్లను ఆహ్వానించనున్నారు. ఆ తర్వాత అర్హత పొందే కంపెనీకి రోడ్ల నిర్వహణ బాధ్యతలు అప్పగించనున్నారు.

**సాఫీ ప్రయాణమే లక్ష్యం..**

రోడ్ల నిర్వహణ, మరమ్మతులకు సిమెంట్ కాంక్రీట్ వేస్తారా లేక బీటీనా అన్న విషయంతో సంబంధం లేకుండా ఇరవై నాలుగు గంటలపాటు రోడ్లు సవ్యంగా, ప్రయాణానికి సాఫీగా ఉండేలా నిర్వహించడం నిర్వహణ చేపట్టే సంస్థ పని. వర్షాలు తదితర కారణాల వల్ల పెద్ద గుంతలు ఏర్పడ్డా, ఇతరత్రా దెబ్బతిన్నా, నిర్ణీత వ్యవధిలోగా 24 నుంచి 48 గంటల్లో మరమ్మతులు పూర్తిచేయాలి. వివిధ సంస్థల అవసరాల కనుగుణంగా రోడ్ కటింగ్‌లకు అనుమతులిచ్చే అధికారం, ఆ తర్వాత త్వరితంగా తిరిగి పూడ్చటం వంటివాటిపై కాంట్రాక్టు సంస్థకే అధికారం ఉంటుంది.

**తొలిదశలో 687 కి.మీ.లు**

తొలిదశలో జోన్ల వారీగా ఎక్కువ వాహనరద్దీ ఉండే ప్రధాన మార్గాలను గుర్తించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో 687.43 కి.మీ.ల రద్దీ రోడ్లు ఉన్నాయి. జోన్ల వారీగా రోడ్ల నిర్వహణ కోసం యాన్యువల్ మెయింటెనెన్స్ కాంట్రాక్ట్ (ఏఎంసీ) పేరిట వీటికి టెండర్లు ఆహ్వానించనున్నారు. టెండరులో ఎంపికైన సంస్థ ఐదేళ్ల వరకు తన పరిధిలోని రోడ్ల నిర్వహణ చేపడుతుంది.

### 15,29 తేదీల్లో శ్రీవారి ప్రత్యేక దర్శనం

- **వృద్ధులు, దివ్యాంగులకు టోకెన్లు**

తిరుమల: శ్రీవారి దర్శనం కోసం వచ్చే వయోవృద్ధులు, దివ్యాంగులు, 5 సంవత్సరాల లోపు చంటి పిల్లల తల్లిదండ్రులకు టీటీడీ ఏర్పాట్లు చేస్తోంది. ఈనెల 15, 29 తేదీల్లో వయోవృద్ధులు (65 సంవత్సరాలు పైబడినవారు), దివ్యాంగులకు 4 వేల టోకెన్లు జారీ చేయనుంది. ఉదయం 10 గంటల స్లాట్‌కు వెయ్యి, మధ్యాహ్నం 2 గంటలకు 2 వేల టోకెన్లు, 3 గంటల స్లాట్‌కు వెయ్యి టోకెన్లు జారీ చేస్తారు. 5 సంవత్సరాలలోపు చంటి పిల్లలను, వారి తల్లిదండ్రులను ఈనెల 16, 30 తేదీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు సుపథం మార్గం ద్వారా దర్శనానికి అనుమతిస్తారు. సాధారణ రోజుల్లో ఒక సంవత్సరం లోపు చంటిపిల్లలకు, వారి తల్లిదండ్రులకు సుపథం మార్గం ద్వారా ప్రవేశం కల్పిస్తారు.

# ‘రియల్’ నేలచూపులు!

▶ మొదటి పేజీ తరువాయి

గృహాల అమ్మకాల్లో తగ్గుదల కనిపిస్తోంది. ఈ తరుణంలో విల్లాలు, ఫ్లాట్‌ల నిర్వహణ వ్యయం భారీగా ఉండటంతో పాటు ఆర్థిక స్థోమతను దృష్టిలో పెట్టుకొని కొనుగోలుదారులు స్థలాల కొనుగోలుకే మొగ్గు చూపుతున్నారు. దీంతో విలాసవంతమైన గేటెడ్ కమ్యూనిటీ, అపార్ట్‌మెంట్లలోని ఫ్లాట్‌ల అమ్మకాల్లో క్షీణత కనిపిస్తోంది.



**20 శాతం అధిక ఆదాయం..**

ఆషాఢమాసంలో రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ.500 కోట్ల ఆదాయం చేరింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే గతేడాదితో పోలిస్తే 20 శాతం అధికంగా రూ.2,250 కోట్ల వరకు ఆదాయం వచ్చింది. ఇళ్ల కొనుగోలుపై దృష్టి చూపని వారంతా స్థలాలు, వ్యవసాయ భూముల కొనుగోలు వైపు మళ్లుతున్నట్లు అర్థమవుతోంది. కాగా, శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఇబ్రహీంపట్నం(సబ్‌రిజిస్ట్రార్)లో గత మూడు నెలలుగా భూముల క్రయవిక్రయాలు తగ్గుముఖం పట్టినట్లు నమోదైన రిజిస్ట్రేషన్ల సంఖ్యను బట్టి తెలుస్తోంది. టీసీఎస్, లాజిస్టిక్ పార్క్, ఫార్మాసిటీ, బీడీఎల్, ఎన్ఎస్‌జీ, ఆక్టోపస్, కొత్త కలెక్టరేట్‌తో ఇక్కడ కొన్నాళ్లుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగింది. ఆర్థిక మాంద్యం, అమాంతం పెరిగిన ధరలు ఈ ప్రాంతంలోనూ తీవ్ర ప్రభావం చూపినట్లు రిజిస్ట్రేషన్లను బట్టి తెలుస్తోంది. మూడు నెలల్లో ఏకంగా వేయి డాక్యుమెంట్లు తగ్గిపోగా.. రూ.60 లక్షల ఆదాయంలోను తేడా వచ్చింది.

**గత 3 నెలల్లో రిజిస్ట్రేషన్లు, ఆదాయం** (రూ.కోట్లలో)

| నెల | డాక్యుమెంట్లు | ఆదాయం |
|---|---|---|
| జూలై | 3,300 | 2.3 |
| ఆగస్టు | 2,700 | 2 |
| సెప్టెంబర్ | 2,400 | 1.7 |

# మరింత ఉధృతంగా ఆర్టీసీ సమ్మె

▶ మొదటి పేజీ తరువాయి

క్రమంలో రాష్ట్ర బంద్‌కు పిలుపునివ్వడంపైనా ఈ భేటీలో చర్చించారు. ఈ నెల 19న రాష్ట్ర బంద్ నిర్వహించే అంశాన్ని సైతం సమావేశంలో ప్రస్తావించినట్లు తెలిసింది. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలను కూడా ఉద్యమంలో కలుపుకొని వెళ్తే బాగుంటుందన్న భావనను అందరూ వ్యక్తం చేయడంతో ఆ దిశగా కార్యాచరణపై ఆర్టీసీ జేఏసీ సమాలోచనలు చేస్తోంది.

**ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు మద్దతివ్వాలి: అశ్వత్థామరెడ్డి**

ఆరు రోజులుగా కార్మికులంతా సమ్మెలో ఉండి పోరాట పటిమ చాటారని ఆర్టీసీ జేఏసీ నేత అశ్వత్థామరెడ్డి తెలిపారు. రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో అఖిలపక్ష భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ బెదిరింపులు కొత్త కాదని, వాటికి భయపడే ప్రసక్తే లేదన్నారు. ఆర్టీసీ సమ్మెను తీవ్రం చేసేందుకు రెండు రోజుల కార్యాచరణను ఖరారు చేశామన్నారు. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా బస్ డిపోల వద్ద అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. అలాగే శనివారం గాంధీజీ, జయశంకర్ విగ్రహాల వద్ద మౌన దీక్ష చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాల్లో కార్మికులంతా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజా రవాణా సంస్థను కాపాడేందుకు కార్మి కులంతా ఉద్యమిస్తున్నారని, ఈ ఆందోళనలకు మద్దతు ఇవ్వాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ట్రేడ్ యూనియన్లను ఆయన కోరారు. కార్మికులతోపాటు సమ్మెలో పాల్గొంటున్న సూపర్‌వైజర్లకు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.



హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఆర్టీసీ జేఏసీ నేత అశ్వత్థామరెడ్డి

# ‘మహా’ తెలంగాణ పాట..!

- రాష్ట్రంతో మహారాష్ట్ర వాసుల అనుబంధం..
- నిజాం పాలనలో హైదరాబాద్ సంస్థానంలోనే..
- పథకాలకు ఆకర్షితులవుతున్న సరిహద్దు గ్రామాల వాసులు..
- తెలంగాణలో విలీనం చేయాలంటూ విజ్ఞప్తులు..
- దెగ్లూర్–బిలోలి తాలూకా గ్రామాలవాసుల మనోగతం


కార్లా గ్రామస్తులు

మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల నుంచి
పాత బాలప్రసాద్/సాక్షిప్రతినిధి, నిజామాబాద్: సంక్షేమ పథకాల కోసమే కాదు.. మాకు తెలంగాణతో బంధుత్వం.. అనుబంధం పెనవేసుకుంది.. మా ఆడబిడ్డలను తెలంగాణకు ఇచ్చాం.. అక్కడి ఆడపడుచులు మా ఇంటి మహాలక్ష్మిలుగా వచ్చారు.. రెండు రాష్ట్రాల మధ్య భౌగోళిక సరిహద్దులున్నా.. మాలో మాత్రం ఆ భావన లేదు’అని మహారాష్ట్రలోని తెలంగాణ సరిహద్దు గ్రామాల వాసులు అంటున్నారు. ఆ ప్రాంతాన్ని తెలంగాణలో విలీనం చేయాలనే వాదన ఇప్పుడు తెరపైకి వచ్చింది. ఈ నేపథ్యంలో ‘సాక్షి’మహారాష్ట్రలోని దెగ్లూర్ నియోజకవర్గం పరిధిలో ఉన్న తెలంగాణ సరిహద్దు గ్రామాల్లో పర్యటించి.. అక్కడి ప్రజల మనోభావాలను తెలుసుకునే ప్రయత్నం చేసింది.

**హైదరాబాద్ సంస్థానం పరిధిలోనే..**

గతంలో మహారాష్ట్రలోని బిలోలి–దెగ్లూర్ తాలూకా మొత్తం హైదరాబాద్ సంస్థానం పరిధిలోనే ఉండేది. రైతులు తమ భూమి శిస్తు నిజాం రాజుకే చెల్లించేవారు. నిజాం పాలన తర్వాత మంజీర నది సరిహద్దుగా రెండు రాష్ట్రాలు విభజించారు. నదికి అవతలి వైపు మహారాష్ట్ర కాగా, ఇటువైపు తెలంగాణ (ఆంధ్రప్రదేశ్)గా విభజించారు. రెండు రాష్ట్రాల మధ్య సరిహద్దులు ఏర్పడినా అనుబంధం మాత్రం తెలంగాణతోనే ఉంది.

**ఆపదొస్తే హైదరాబాద్‌కే..**

దెగ్లూర్ తాలూకావాసులు చాలా మంది అత్యవసర వైద్యం కోసం తెలంగాణనే ఆశ్రయిస్తుంటారు. మంచి వైద్యం కోసం ముంబై గానీ, పుణే గానీ వెళ్లాలంటే 650 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. దీంతో ఈ ప్రాంతవాసులంతా మెరుగైన వైద్యం కోసం ఎక్కువగా 200 కిలోమీటర్ల దూరంలోనే ఉన్న హైదరాబాద్‌కే వస్తుంటారు.

తమ ప్రాంతం తెలంగాణలో ఉంటే ఆరోగ్యశ్రీ వంటి పథకం పొందే వారమని.. అలాంటి పథకం తమ వద్ద లేదని వాపోయారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు తమ నిధుల నుంచి కొంత మొత్తాన్ని నిరుపేదల వైద్యం కోసం వెచ్చించే అవకాశం ఉంది. కానీ ఈ ప్రజాప్రతినిధుల నుంచి అందే సహాయం తమ లాంటి పేదల వరకు రాదని కార్లా గ్రామవాసీ కాలప్ప అనే వ్యక్తి వాపోతున్నారు. నిత్యావసరాలు, ఇతర వ్యాపారాల కోసం., పంటలను విక్రయించేందుకు ఇలా అనేక పనుల కోసం నిజామాబాద్ జిల్లా బోధన్‌కు వస్తుంటారు.

**తెలంగాణంపై ‘మహా’సర్కారు అప్రమత్తం..**

తెలంగాణ సరిహద్దు నియోజకవర్గాల వాసులు తెలంగాణాన్ని ఆలపిస్తుండటంతో మహారాష్ట్ర సర్కారు అప్రమత్తమైంది. ఈ అంశం ఎందుకు తెరపైకి వచ్చిందనే దానిపై ఆరా తీసింది. ఇందుకు అధికారుల బృందాన్ని సరిహద్దు గ్రామాలకు పంపింది. ఈ ప్రాంతవాసులు ఏం కోరుకుంటున్నారనే దానిపై నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ప్రజల అభిప్రాయాలను సేకరించింది. ప్రస్తుతానికి తమ తాలూకాకు రూ.50 కోట్లు మంజూరు చేసినట్లు నేతలు చెబుతున్నారని కార్ల పునరావాస గ్రామానికి చెందిన సుగురే ప్రకాష్ ‘సాక్షి’తో పేర్కొన్నారు.

**సాట్‌సాల్ పింఛను..**

మహారాష్ట్రలో ప్రస్తుతం సాట్‌సాల్ పింఛను పథకం అమలవుతోంది. 60 ఏళ్లు నిండిన వృద్ధులకు, వితంతువులకు నెలకు రూ.700 చొప్పున పింఛను ఇస్తున్నారు. ఈ పింఛన్లు కూడా గ్రామంలో కొద్ది మందికి మాత్రమే అందుతున్నాయి. తెలంగాణలో రూ.2 వేల పింఛన్ వస్తున్న విషయాన్ని బంధువుల ద్వారా తెలుసుకున్నట్లు సరిహద్దు గ్రామాలవారు చెబుతున్నారు. ‘మేం తెలంగాణలో విలీనమైతే మాకు కూడా ఈ రూ.2 వేల పింఛన్ వచ్చేది కదా..’అని పేర్కొంటున్నారు కార్లా గ్రామానికి చెందిన పుండలిక్.

**రైతుల పరిస్థితి దయనీయం..!**

మహారాష్ట్రలో రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. తెలంగాణలో వరి, మొక్కజొన్న, సోయా, పప్పుదినుసులు ఇలా దాదాపు అన్ని పంటలను ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుంటే మహారాష్ట్రలో మాత్రం పత్తి, కంది, శనగ మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. అవి కూడా కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ సీసీఐ పత్తిని, నాఫెడ్ పప్పు దినుసులను సేకరిస్తోందని అక్కడి రైతులు చెబుతున్నారు. దీనికి తోడు పంటల సాగు కోసం ఇచ్చే రుణం (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్) కూడా నామమాత్రంగా ఉంటోందని వాపోతున్నారు. సోయాకు ఎకరానికి రూ.9 వేలు మాత్రమే చెల్లిస్తోందని రైతు సుభాష్ పేర్కొన్నారు. విత్తనాలను వ్యాపారుల వద్ద కొనుగోలు చేయాల్సి వస్తోందని గంజ్‌గాంకు చెందిన రైతు శంకర్‌పటేల్ పేర్కొంటున్నారు.

### శిస్తు కోసం గాంధారి తహసీల్దార్ వచ్చేవారు



నిజాం సర్కారులో ఉన్నప్పుడు మా ప్రాంతం గాంధారి (కామారెడ్డి జిల్లా) తహసీల్దార్ పరిధిలో ఉండేది.. మా తండ్రి ఈర్లే రామన్న గాంధారికి వెళ్లి భూమి శిస్తు కట్టి వచ్చేవారు.. శిస్తు వసూళ్ల కోసం తహసీల్దార్లు మా గ్రామానికి కూడా వచ్చేవారు.

–ఈర్లే లక్ష్మణ్



ఈ ఫొటోలో ఉన్న రైతు పేరు బస్వంత్ పాంఢ్రే. దేగ్లూర్ తాలూకా పరిధిలోని కార్లా గ్రామంలో తన ఇల్లు కూలిపోతే తెలంగాణలోని సాలూర (బోధన్ మండలం)లో ఇల్లు నిర్మించుకున్నాడు. తన భార్యా పిల్లలతో కలసి ఇక్కడే ఉంటున్నారు. తన భూమి సాగు చేసుకునేందుకు నిత్యం కార్లాకు వెళ్లి వస్తుంటాడు. తన భూమి తెలంగాణలో ఉంటే రైతు బంధు పథకం ఆర్థిక సాయం వచ్చేదని బస్వంత్ చెబుతున్నారు.

### మౌలిక సదుపాయాల కొరత..



మరాఠీ భాషలో రాసిన ఈ బోర్డును చూశారా.. ప్రస్తుతం మహారాష్ట్రలో జరుగుతున్న విధానసభ ఎన్నికలను బహిష్కరిస్తున్నామని గంజ్‌గాం గ్రామస్తులు దీన్ని ఏర్పాటు చేశారు. ఏళ్లు గడుస్తున్నా.. తమ గ్రామానికి వెళ్లే దారిలో రెండు వైపుల వాగుకు బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోవడంపై నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నామని.. ఎమ్మెల్యే అభ్యర్థులెవరూ తమ గ్రామంలోకి రావొద్దని దాని సారాంశం. దీన్ని బట్టి చూస్తే అక్కడి మౌలిక సదుపాయాలకు ఈ చిత్రం అద్దం పడుతోంది.

### బంధువుల పేర్లతో అమ్ముకునే వారము



మాకు తెలంగాణలో బంధువులు న్నారు. వరి, సోయా వంటి పంటలకు తెలంగాణలో ఎక్కువ ధర వస్తుండటంతో బోధన్‌లో ఉన్న మా బంధువుల పేర్లతో పంటను విక్రయించుకునే వారం. ఇప్పుడు నడుస్తలేదు. తెలంగాణలో ఉన్న సొసైటీలు ఈ పంటలను కొనుగోలు చేస్తున్నాయి. మా సొసైటీల్లో కొనుగోళ్లు లేవు.

–బిస్రే మానిక్‌రావు, కొండల్‌వాడీ సొసైటీ డైరెక్టర్

### గ్రామస్తులు ఏర్పాటు చేసుకున్న తాగునీటి ప్లాంట్లు

మహారాష్ట్రవాసులు మౌలిక వసతులకు కూడా సరిగ్గా నోచుకోవట్లేదు. సరైన రోడ్డు వసతి లేక ఇబ్బందులు పడుతున్నారు. అనేక గ్రామాల్లో మురికి కాల్వల్లేవు. విద్యుత్ సౌకర్యం అంతంత మాత్రంగానే ఉంటోంది. తెలంగాణలో ఒక్క గంట కూడా విద్యుత్ సరఫరా అంతరాయం కలగదని.. ఇక్కడ కరెంట్ పోతే ఐదారు గంటలైనా పట్టించుకునే వారే ఉండరని గ్రామస్తులు వాపోతున్నారు. గంజ్‌గాం గ్రామస్తులు తలా కొంత మొత్తాన్ని పోగేసి తమ గ్రామంలో నీటిని శుద్ధి చేసే ప్లాంటు ఏర్పాటు చేసుకున్నారు.



### అంగన్‌వాడీల పనితీరు అంతంతే

మహారాష్ట్రలో అంగన్‌వాడీల పనితీరు కూడా అంతంత మాత్రంగానే ఉంది. అక్కడ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు గుడ్డు, పాలు, పౌష్టికాహారంతో కూడిన భోజనం పెట్టట్లేదు. కేవలం 50 రోజులకు సరిపడా 1,400 గ్రాముల గోధుమల ప్యాకెట్లు రెండు, శిరి శనగపప్పు, నూనె, ఇతర వస్తువులు ఇంటికే పంపిణీ చేస్తారు. దీంతో ఈ ఆహారం లబ్ధిదారుల కంటే కుటుంబసభ్యులకే ఎక్కువ అందుతోంది. కాగా, బొబ్బర్లు, గుడాలు వంటి వాటిని వండి ఇస్తామని అంగన్‌వాడీ కార్యకర్త అరుణా మట్‌పతి ‘సాక్షి’తో పేర్కొన్నారు.





మోకాళ్లలోతు గుంతలతో ఉన్న ఈ రోడ్డు దేగ్లూర్ తాలుకా పరిధిలోని కార్లా, గంజ్‌గాం, నాచ్‌నూర్, నాగిని వంటి సుమారు 7 గ్రామాలకు అనుసంధానమై ఉంది. బోధన్‌-దేగ్లూర్ రోడ్డు నుంచి ఈ గ్రామలకు వెళ్లాలంటే నరకం కనిపిస్తుంది.

### క్లుప్తంగా...

### నల్లగొండ కలెక్టర్ బదిలీ

సాక్షి, హైదరాబాద్: నల్లగొండ జిల్లా కలెక్టర్ గౌరవ్ ఉప్పల్‌ను ఢిల్లీలోని తెలంగాణభవన్ రెసిడెంట్ కమిషనర్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది. నల్లగొండ జిల్లా జాయింట్ కలెక్టర్ వి.చంద్రశేఖర్ (నాన్ కేడర్)ను తదుపరి ఆదేశాలు జారీచేసే వరకు జిల్లా కలెక్టర్‌గా అదనపు బాధ్యతలు చేపట్టాలని ఆదేశించింది. ఈ మేరకు సీఎస్ ఎస్‌కే జోషి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణభవన్ రెసిడెంట్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న సహాయ రెసిడెంట్ కమిషనర్ వేదాంతం రవిని ఆ బాధ్యతల నుంచి తప్పించినట్లు ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### ఆరుగురు డీసీసీ అధ్యక్షుల నియామకం

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలోని ఆరు జిల్లాలకు జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులను నియమిస్తూ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కె.విశ్వప్రసాదరావు (ఆసిఫాబాద్), ఐత ప్రకాశ్‌రెడ్డి (జయశంకర్ భూపాలపల్లి), టి.రామ్మోహన్‌రెడ్డి (వికారాబాద్), ఎన్.కుమారస్వామి (ములుగు), శివకుమార్‌రెడ్డి (నారాయణ్‌పేట), కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి (యాదాద్రి భువనగిరి)లను డీసీసీ అధ్యక్షులుగా నియమిస్తున్నట్లు పేర్కొన్నారు.

### పీఆర్‌టీయూ సమావేశాలు

సాక్షి, హైదరాబాద్: పీఆర్‌టీయూ–తెలంగాణ 33వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను ఈనెల 11, 12 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, కమలాకర్‌రావు తెలిపారు. హన్మకొండలోని విష్ణుప్రియ గార్డెన్స్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు సమావేశాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

### రాష్ట్రంలో మిగతా ఉద్యోగ సంఘాల్లేవా: టీపీఆర్టీయూ

సాక్షి, హైదరాబాద్: టీజీవో, టీఎన్జీవో నేతలు ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎందుకు కలిశారో చెప్పాలని, సీఎం వారిని మాత్రమే ఎందుకు పిలిచారో చెప్పాలని టీపీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని మిగతా ఉద్యోగ సంఘాలను ఎందుకు పిలవలేదని ప్రశ్నించారు. సమ్మె చేస్తున్న కార్మికులను పిలవకుండా, టీజీవో, టీఎన్జీవోలను ఎందుకు పిలిచారని అడిగారు.

## ఓయూ అధ్యాపకుడు జగన్ ఇంట్లో సోదాలు..

- తార్నాకలోని ఇంట్లో ఎస్‌ఐబీ పోలీసుల తనిఖీలు
- జగన్‌ను అరెస్ట్ చేశారంటున్న విరసం నేతలు
- ధ్రువీకరించని పోలీసులు

సాక్షి, హైదరాబాద్: విరసం కార్యవర్గ సభ్యుడు జగన్ ఇంట్లో గద్వాల ఎస్‌ఐబీ పోలీసులు గురువారం సోదాలు నిర్వహించారు. ఉపా కేసులో జగన్‌ను అరెస్టు చేసిన గద్వాల పోలీసులు గురువారం హైదరాబాద్ తార్నాకలోని ఆయన ఇంట్లో సోదాలు జరిపినట్లు సమాచారం. ల్యాప్‌టాప్‌తో పాటు పలు పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. స్టూడెంట్ మార్చ్ మాస పత్రిక సంపాదకుడిగా ఉన్న జగన్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి అర్థశాస్త్రంలో డాక్టరేట్ పొందారు. ప్రస్తుతం ఓయూ అనుబంధ పీజీ కళాశాలలో ఎకనామిక్స్ పార్ట్‌టైమ్ అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. జగన్ ఇంటిపై పోలీసులు సోదాలు జరిపి అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు విప్లవ రచయితల సంఘం కార్యదర్శి పాణి, కార్యవర్గ సభ్యులు గీతాంజలి, వరలక్ష్మి, కాసీం, రాంకీ, సీనియర్ సభ్యులు కల్యాణరావు, రత్నమాల ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో చీకటిపాలన కొనసాగుతోందని ఆరోపించారు. కవులు, రచయితలపై దాడులు అనాగరికమని దుయ్యబట్టారు.

**నడిగడ్డలో విస్తృత తనిఖీలు**

గద్వాల జిల్లా నడిగడ్డలో ఎస్‌ఐబీ అధికారులు వారం రోజుల నుంచి విస్తృత తనిఖీలు చేపట్టారు. మావోయిస్టులతో సంబంధం ఉన్నాయన్న ఆరోపణలతో ఇప్పటికే ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు. తెలంగాణ విద్యార్థి వేదిక సంఘాన్ని నడుపుతున్న వ్యక్తులే మావోయిస్టులతో సంబంధాలు పెట్టుకొని, ప్రభుత్వ, జిల్లాలో జరుగుతున్న పలు సమస్యలపై మావోలకు సమాచారం అందిస్తున్నట్లు తెలుసుకున్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర అధ్యక్షుడు మద్దిలేటిపై హైదరాబాద్‌లోని నల్లకుంట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. గద్వాల జిల్లాకు చెందిన నాగన్న, బలరాంను సైతం అదుపులోకి తీసుకున్నారు. గద్వాల జిల్లా నుంచి 6 నుంచి 8 మంది విప్లవ బాట పట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

## నంబర్‌వన్‌గా రాష్ట్ర హజ్ కమిటీ

**హజ్‌యాత్ర ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణను ప్రారంభించిన మహమూద్ అలీ**


హజ్‌యాత్ర ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభిస్తున్న హోంమంత్రి మహమూద్ అలీ

సాక్షి హైదరాబాద్: దేశంలోనే తెలంగాణ హజ్ కమిటీ నంబర్ వన్‌గా ఉందని, ఈ కమిటీ ద్వారా హజ్‌యాత్రకు వెళ్లేవారికి ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తోందని రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. రాష్ట్ర హజ్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం హజ్ యాత్ర–2020కు ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియను హోంమంత్రి ప్రారంభించారు. అనంతరం మహమూద్ అలీ మాట్లాడుతూ..మైనార్టీలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. కేవలం ముస్లింలకే కాకుండా రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందేందుకు సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాల్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ మసీవుల్లాఖాన్ మాట్లాడుతూ.. హజ్‌యాత్ర–2020 షెడ్యూల్‌ను కేంద్ర హజ్ కమిటీ విడుదల చేసిందని, యాత్రికులు ఈ నెల 10 నుంచి హజ్ కమిటీ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. నాంపల్లి హజ్ హౌస్‌లోనే ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ డిసెంబరు 10 వరకు ఉంటుందన్నారు. 2021 జనవరి 20 వరకు పాస్‌పోర్టు వ్యాలిడిటీ ఉండాలన్నారు. డ్రా పద్ధతిలో హజ్‌యాత్రకు ఎంపిక చేస్తారని, డిసెంబర్ చివరి వారంలో డ్రాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తుతో పాటుగా ఎస్‌బీఐ ద్వారా రూ.300 చెల్లించాలన్నారు. సందేహాలకు 040–23298793 నంబర్ లేదా కేంద్ర హజ్ కమిటీ వెబ్‌సైట్ http://www.hajcommittee.gov.in సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ప్రభాకర్, టీఆర్‌ఎస్ నేత బద్రుద్దీన్, రాష్ట్ర హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ అధికారి షఫీవుల్లా పాల్గొన్నారు.

### సహస్ర చండీయాగానికి రండి

**సీఎంను ఆహ్వానించిన పొంగులేటి**


సీఎం కేసీఆర్‌కు ఆహ్వాన పత్రం ఇస్తున్న పొంగులేటి. చిత్రంలో మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్‌ను మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రగతి భవన్‌లో గురువారం కలిశారు. అక్టోబర్ 13 నుంచి 17 వరకు నారాయణపురంలోని తన స్వగృహంలో నిర్వహించే సహస్ర చండీయాగంలో పాల్గొనాల్సిందిగా కేసీఆర్‌ను ఆహ్వానించారు.

## వైద్యంకోసం పేదలు కన్నీళ్లు పెట్టకూడదు

**ప్రజలకు మెరుగైన వైద్య సేవలు కల్పించడమే మా ప్రభుత్వ లక్ష్యం: మంత్రి ఈటల**


ఢిల్లీలో సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ సమావేశంలో మాట్లాడుతున్న ఈటల

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో పేదలు వైద్య చికిత్సలకోసం డబ్బులు చెల్లించుకోలేక కన్నీళ్లు పెట్టుకొనే పరిస్థితులు రాకుండా చేయడమే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. మెరుగైన వైద్య సేవలు కల్పించడమే లక్ష్యంగా బడ్జెట్‌లో పేదల వైద్యానికి భారీగా నిధులు కేటాయిస్తున్నామని ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవల కల్పన, పేదలకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడంపై చర్చించేందుకు గురువారం ఢిల్లీలో సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ సమావేశం జరిగింది. కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హర్షవర్ధన్ చైర్మన్‌గా, సహాయ మంత్రి అశ్విన్‌కుమార్ వైస్ చైర్మన్‌గా, ఈటల రాజేందర్ కో చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఈ కమిటీ సమావేశంలో అన్ని రాష్ట్రాల ఆరోగ్య శాఖ మంత్రులు పాల్గొన్నారు. సమావేశ వివరాలను సాయంత్రం తెలంగాణ భవన్‌లో ఈటల మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ, భిన్న పరిస్థితుల కారణంగా వైద్య సేవల కల్పనలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తుంటాయని, అలాంటి వాటికి కేంద్రం సహకరించాలని కోరారు.

**‘ఆయుష్మాన్’ కంటే ఆరోగ్యశ్రీ బెస్ట్..**

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన అయుష్మాన్ భారత్ యోజన పథకం కంటే తెలంగాణలో అమలవుతున్న ఆరోగ్య శ్రీ పథకం చాలా మెరుగైనదని ఈటల మరోసారి స్పష్టం చేశారు. ఆయుష్మాన్ పథకం వల్ల తెలంగాణ రాష్ట్రంలో కేవలం 24 లక్షల మందికి మాత్రమే లబ్ధి చేకూరుతుందని, అదే ఆరోగ్యశ్రీ వల్ల 85 లక్షల మందికి ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా అత్యధికంగా రూ. 5 లక్షలు వరకు మాత్రమే లబ్ధిపొందే అవకాశం ఉండగా, ఆరోగ్యశ్రీతో మూత్రపిండాలు, గుండె మార్పిడి లాంటి శస్త్రచికిత్సలు కూడా చేస్తున్నామని, దీనికి రూ.13 లక్షల వరకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. గర్భిణీలు, పాలిచ్చే తల్లులకు పోషకాహారాలు అందించడం, మూడు విడతల్లో రూ. 13 వేలు ఆర్థిక సాయం, కేసీఆర్ కిట్ అందిస్తున్నామని తెలిపారు. బాల్య వివాహాలను నియంత్రించడానికి కల్యాణలక్ష్మి, షాదీ ముబాకర్ పథకాల ద్వారా 18 ఏళ్లు నిండిన తరువాత వివాహం జరిగేలా ఆర్థిక సాయం అందిస్తున్నామని వివరించారు. వర్షాకాలంలో గిరిజన ప్రాంతాల్లో ప్రజలు ఆనారోగ్యం బారిన పడకుండా 20 వేల గ్రామాల్లో రక్షిత మంచినీటిని సరఫరా చేస్తున్నామని వివరించారు. జిల్లా కేంద్రాల్లో ఆస్పత్రుల అప్‌గ్రేడ్, ఐసీయూ సెంటర్లు, డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రైవేటు మెడికల్ కాలేజీల్లోని అన్ని బెడ్‌లను ప్రజాఆరోగ్య సేవలు అందించేందుకు వినియోగించాలని, నేషనల్ హెల్త్ స్కీం కింద రాష్ట్రంలో పనిచేస్తున్న సిబ్బందికి జీతభత్యాలు ఇవ్వాలని కేంద్రాన్ని కోరినట్టు మంత్రి తెలిపారు. ఈఎస్‌ఐ లాంటి స్కాంలు పునరావృత్తం కాకుండా చూస్తామని ఒక ప్రశ్నకు మంత్రి ఈటల బదులిచ్చారు.



# పోషకాహారంతోనే పిల్లల్లో ఆరోగ్యం

**'అలయ్-బలయ్'లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్**


అలయ్-బలయ్ కార్యక్రమంలో డోలు వాయిస్తున్న హిమాచల్ గవర్నర్ దత్తాత్రేయ. చిత్రంలో దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి

**సాక్షి, హైదరాబాద్:** సంప్రదాయ వంటకాలతో పాటు, పోషకాహారాన్ని పిల్లలకు ఇవ్వడం ద్వారా వారిని ఆరోగ్యసౌభాగ్యవంతులుగా తయారు చేయవచ్చని రాష్ట్రంలోని మాతృమూర్తులకు గవర్నర్ తమిళిసై సౌందర్యరజన్ పిలుపునిచ్చారు. పిల్లల ఆధునిక జీవనశైలి కారణంగా 25% మంది ఊబకాయంతోపాటు, మరో 33 శాతం మం ది పోషకాహర లేమితో బాధపడుతున్నట్టు పత్రికల్లో వచ్చిన కథనాలు చూసి తాను ఆందోళనకు గురైనట్టు చెప్పారు. తాను డాక్టర్‌ను కూడా అయినందున పిల్లలకు బర్గర్లు, చిప్స్‌కు బదులు పోషకవిలువలున్న సంప్రదాయ ఆహారాన్ని ఇవ్వాలని సూచిస్తున్నానని చెప్పారు. గురువారం జలవిహార్‌లో హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె బి.విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా మిలన్ 'అలయ్ బలయ్'లో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై తొలుత తెలుగులో ప్రసంగించి ఆకట్టుకున్నారు. ప్రజల మధ్య సంబంధాలు మరింత మెరుగుపడేందుకు సంప్రదాయబద్ధమైన ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని, 15 ఏళ్లుగా దీన్ని నిర్వహించడం గొప్పవిషయమని గవర్నర్ అన్నారు. తమిళనాడు సంప్రదాయాలు, సంస్కృతి, ఆహారం, వేష, భాషలకు దగ్గరగా ఉన్న తెలంగాణకు గవర్నర్‌గా రావడం తన అదృష్టమని తమిళి సై అన్నారు. ఈ సందర్భంగా కళాకారులు ప్రదర్శించిన చిందు భాగవతం, యక్షగానం, గుస్సాడి, ఇతర సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. వివిధరకాల తెలంగాణ వంటకాలను ఆహూతులు ఆస్వాదించారు.

**హిమాచల్,తెలంగాణల సహకారానికి కృషి : దత్తాత్రేయ**

హిమాచల్‌ప్రదేశ్‌ను తెలంగాణతో అనుసంధానించి, పర్యాటకం,పరిశ్రమలు, తదితర రంగాల్లో పరస్పర సహకరించుకోడానికి ఆ రాష్ట్ర మంత్రులు, అధికారులు ఇక్కడ పర్యటించేలా చర్యలు తీసుకుంటామని ఆ రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ తన ప్రసంగంలో తెలిపారు. అలయ్ బలయ్ స్ఫూర్తితో రాజకీయాలకు అతీతంగా దేశాభివృద్ధికి అందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని కేంద్రహోంశాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. అందరినీ కలుపుకుని వెళ్లేలా దీన్ని నిర్వహించడం అభినందనీయమని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. అందరినీ ఒకచోటకు చేర్చేలా దత్తాత్రేయ ఈ కార్యక్రమం చేపట్టడం గొప్ప విషయమని పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. తెలుగు, తెలంగాణ సంస్కృతి, సాహిత్యాలను భాషను అభివృద్ధి చేసి సాంస్కృతిక విప్లవం తేవాలని మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగరరావు అన్నారు.టీఆర్‌ఎస్ నేత, ఎంపీ కె.కేశవరావు, కాంగ్రెస్‌నేత వీహెచ్,బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి మురళీధర రావు తదితరులు కూడా మాట్లాడారు.

**వివిధ రంగాలవారికి సత్కారం...**

ఈ కార్యక్రమంలో కిన్నెర కళాకారుడు దర్శనం మొగిలయ్య, గజం గోవర్ధన్, అంజయ్య (పోచంపల్లి చేనేత), చింతకింది మల్లేశం (ఆసుయంత్రం), ఏలే లక్ష్మణ్ (చిత్రకారుడు),సాయి దీపక్ (మార్షల్ ఆర్ట్స్),ఓంకార్ యాదవ్ (బాక్సింగ్ కోచ్), గీతా మహాలక్ష్మీ (సర్జికల్ ఆంకాలజిస్ట్), అరుణ (యోగ నిపుణురాలు), నందిని (చదరంగం), తదితరులను దత్తాత్రేయ సన్మానించారు. మేయర్ బొంతు రామ్మోహన్, జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు కె.రాములు, బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్‌రాములు,సభ్యుడు వకుళాభవరణం కృష్ణమోహన్ , ఎంపీ ఎ.రేవంత్‌రెడ్డి, ప్రజాగాయకుడు గోరటి వెంకన్న, బీజేపీ నేతలు కె.లక్ష్మణ్, ఎన్.రామచంద్రరావు, మంత్రి శ్రీనివాస్, నల్లు ఇంద్రసేనారెడ్డి, వన్నాల శ్రీరాములు, బి.జనార్దనరెడ్డి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, ముఠా గోపాల్,రసమయి బాలకిషన్, సీపీఐ కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, టీడీపీ అధ్యక్షుడు ఎల్.రమణ, బీసీ సంఘా ల నేత ఆర్.కృష్ణయ్య, జాజుల శ్రీనివాస్‌గౌడ్, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, యువ తెలంగాణ పార్టీ నేత జిట్టా బాలకృష్ణారెడ్డి, మాజీ మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, నాగం జనార్ధనరెడ్డి, మోత్కుపల్లి నర్సింహులు, బాబూమోహన్, ఇ.పెద్దిరెడ్డి, మాజీ ఎంపీలు మధు యాష్కి, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బూరనర్సయ్యగౌడ్, ఏపీ జితేందర్‌రెడ్డి, కనుమూరి బాపిరాజు, మాజీ ఎమ్మెల్సీ దిలీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి మాదాటి నర్సింహారెడ్డి కన్నుమూత



**హైదరాబాద్:** మాజీ మంత్రి మాదాటి నర్సింహారెడ్డి(88) గురువారం తెల్లవారుజామున 2.30 గంటల ప్రాంతంలో బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఎమ్మెల్యే కాలనీలోని తన నివాసంలో వయోభారంతో కన్నుమూశారు. కరీంనగర్ జిల్లా కమలాపూర్ మండలం గూడూరులో నర్సింహారెడ్డి 1931 సెప్టెంబర్ 29న జన్మించారు. ఆయన 1981–85 మధ్య కాలంలో వరంగల్ జెడ్పీ చైర్మన్‌గా, 1989–94లో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ మంత్రిగా చెన్నారెడ్డి, నేదురుమిల్లి జనార్ధన్‌రెడ్డి, విజయ్‌బాస్కర్‌రెడ్డిల కేబినెట్‌ల్లో పని చేశారు. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు ఆయన అనుంగు శిష్యుడు. నర్సింహారెడ్డి లేరన్న వార్త తెలుసుకున్న పలువురు నేతలు ఆయన నివాసానికి వచ్చి నివాళులు అర్పించారు.మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో పాటు పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆయన భౌతికకాయాన్ని సందర్శించారు. నర్సింహారెడ్డికి కుమారులు ఉపేందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి , కుమార్తె కె. విజయశ్రీ ఉన్నారు. కాగా నర్సింహారెడ్డి అంత్యక్రియలు శుక్రవారం ఉదయం 10 గంటలకు జూబ్లీహిల్స్ సమీపంలోని మహా ప్రస్థానంలో నిర్వహించనున్నట్లు ఆయన కుటుంబీకులు తెలిపారు.

**మాదాటి మృతిపై కేసీఆర్ సంతాపం**

మాజీ మంత్రి మాదాటి నరసింహారెడ్డి మృతిపై సీఎం కేసీఆర్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మంత్రిగా, ఎమ్మెల్యేగా, జెడ్పీ చైర్మన్‌గా నరసింహారెడ్డి సేవలను స్మరించుకున్న కేసీఆర్ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని సీఎస్ ఎస్‌కే జోషిని ఆదేశించారు.

## ఎం.ఫిల్ కోర్సులు రద్దు!

**సాక్షి, హైదరాబాద్:** మాస్టర్ ఆఫ్ ఫిలాసఫీ కోర్సులను రద్దు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. దేశవ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల్లో ఉన్న ఎం.ఫిల్ కోర్సును క్రమంగా రద్దు చేస్తూ వస్తున్నాయి. పీహెచ్‌డీలో ప్రవేశానికి ఎం.ఫిల్‌ను ప్రధాన అర్హతగా తీసుకున్న నేపథ్యంలో ఆ కోర్సును వర్సిటీలు కొనసాగించాయి. ఈ క్రమంలో పీహెచ్‌డీ చేసే వారి సంఖ్య తగ్గిపోతుండటం, మరోవైపు ప్రభుత్వం పీహెచ్‌డీ చేసే వారిని ప్రోత్సహించాలన్న నిర్ణయంతో గతంలో సైన్స్ కోర్సుల్లో ఎం.ఫిల్‌ను వర్సిటీలు రద్దు చేశాయి. ప్రస్తుతం ఆర్ట్స్ కోర్సుల్లో మాత్రమే ఎం.ఫిల్ ప్రవేశాలు కొనసాగుతున్నాయి. న్యూఎడ్యుకేషన్ పాలసీలోనూ ఎం.ఫిల్ కోర్సుల అవసరం లేదని, పీహెచ్‌డీ చేసే వారిని ప్రోత్సహించాలన్న సిఫార్సుల నేపథ్యంలో దానిని రద్దు చేసేందుకు కేంద్రం చర్యలు చేపడుతోంది.

## పెరిగిన న్యాయ విద్యా కోర్సుల ఫీజులు

**సాక్షి, హైదరాబాద్:** న్యాయ విద్యా కోర్సుల ఫీజులు 16 శాతం నుంచి గరిష్టంగా 40 శాతం వరకు పెరిగాయి. ఈ మేరకు పెరిగిన ఫీజుల వివరాలను లాసెట్ ప్రవేశాల వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఇప్పటివరకు కాలేజీని బట్టి రూ.11,500 కనీస ఫీజు, రూ.30 వేల వరకు గరిష్ట ఫీజు ఉంది. వాటిపై కాలేజీని బట్టి 16 శాతం నుంచి 40 శాతం వరకు ఫీజులను పెంచింది. పెంచిన ఫీజుల ప్రకారమే గురువారం నుంచి కౌన్సెలింగ్‌ను ప్రవేశాల కమిటీ ప్రారంభించింది.

## ఓయూ ఎంపీఈడీ ఫలితాలు విడుదల

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఓయూ పరిధిలో జరిగిన ఎంపీఈడీ (వ్యాయామ విద్య) కోర్సు రెగ్యులర్, బ్యాక్‌లాగ్ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను కంట్రోలర్ శ్రీరామ్ వెంకటేష్ విడుదల చేశారు. రెగ్యులర్ పరీక్షల్లో 1, 2, 3, 4 సెమిస్టర్లతో పాటు బ్యాక్‌లాగ్ 4వ సెమిస్టర్ ఫలితాలను గురువారం వెల్లడించారు. ఫలితాలు వెబ్‌సైట్లో ఉంచామని తెలిపారు.

# ఊళ్ల నుంచి వచ్చుడెట్లా..?

- ప్రయాణికులకు ఆర్టీసీ సమ్మె పోటు
- ఊళ్లకు వెళ్లిన వారికి తిరుగు ప్రయాణంలో వెతలు


వనపర్తి బస్టాండ్ వద్ద తాత్కాలిక డ్రైవర్‌ను డ్యూటీ చేయకుండా అడ్డుకుంటున్న కార్మికులు

**సాక్షి, హైదరాబాద్:** దసరా పండుగ నేపథ్యంలో ఊళ్లకు వెళ్లిన వారికి తిరుగు ప్రయాణం దడ పుట్టిస్తోంది. సమ్మె ప్రభావంతో ఆర్టీసీ బస్సులు గ్రామాలకు వెళ్లకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్న వారికి షాక్ కొడుతోంది. సాధారణ బస్సు టికెట్ ధర కంటే ప్రైవేటు వాహనదారులు ఎక్కువ మొత్తంలో వసూళ్లకు తెగబడటంతో ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు.

**పాసులు అనుమతిస్తే నడపలేం..**

ప్రయాణికుల నుంచి అధిక వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని ప్రభుత్వం చేసిన హెచ్చరికను ప్రైవేటు వాహనదారులు పట్టించుకోలేదు. గురువారం చాలాచోట్ల అధిక వసూళ్లు చేసినట్లు విమర్శలు వచ్చాయి. బస్ పాసులు సైతం అనుమతించకపోవడంతో రోజువారీ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్‌పాసులు అనుమతిస్తే బస్సులు నడపలేమని ప్రైవేటు బస్సు యాజమాన్యాలు ఆర్టీసీకి స్పష్టం చేశాయి.

**నోటిఫికేషన్ వస్తే న్యాయపోరాటం**

సమ్మెలో పాల్గొన్న కార్మికులు సెల్ఫ్ డిస్మిస్ అయ్యారని ఆర్టీసీ చెబుతున్నా.. కార్మికులకు మాత్రం ఎలాంటి నోటీసులివ్వలేదు. దీంతో నోటీసులందిన తర్వాతే స్పందించాలనే యోచనలో కార్మికులున్నారు. బస్సుల నిర్వహణలోనూ ప్రభుత్వం కొత్త విధానాన్ని అమలు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇందుకు సంబంధించి మార్గదర్శకాలు ఇచ్చిన వెంటనే న్యాయ పోరాటానికి దిగేందుకు కార్మిక సంఘాలు సిద్ధమయ్యాయి. కాగా, ఉద్యోగాలు పోతాయనే భయంతో ఉప్పల్‌లో ఓ డ్రైవర్ గుండెపోటుతో మృతి చెందాడు. చెంగిచెర్ల డిపోకు చెందిన కొమురయ్య ఉప్పల్ డిపో వద్ద నిర్వహిస్తున్న ర్యాలీలో ఉండగానే.. గుండెపోటు రావడంతో అక్కడిక్కడే మరణించాడు. హకీంపేట డిపోకు చెందిన కండక్టర్ పద్మ భర్త గుండెపోటుతో చనిపోయాడు. హెచ్‌సీయూ డిపోకు చెందిన డ్రైవర్ ఖలీల్ మియా రామచంద్రాపురం ఈఎస్‌ఐ వద్ద గుండెపోటుతో చనిపోయాడు.

# పక్కాగా ప్రత్యామ్నాయం..!

- ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు
- గురువారం రోడ్డెక్కిన 5,580 ఆర్టీసీ బస్సులు
- నియామకాలు, నోటిఫికేషన్లపై నేడు సీఎం సమావేశం!

**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో తీసుకోవాల్సిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ఆర్టీసీ అధికారులు దృష్టి సారించారు. ప్రయాణికులు ఇబ్బంది పడకుండా చేపట్టాల్సిన చర్యలపై సీఎం ఆదేశాలకు అనుగుణంగా కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. సమ్మెలో పాల్గొన్న కార్మికుల తొలగింపు, నూతన నియామకాలు, బస్సుల నిర్వహణకు సంబంధించి ప్రణాళికను రూపొందిస్తున్నారు. కొత్త విధానం ప్రకారం 50 శాతం ఆర్టీసీ బస్సులు, 30 శాతం అద్దె ప్రాతిపదికన, మిగతా 20 శాతం ప్రైవేటుకు బాధ్యతలు ఇవ్వనున్న క్రమంలో ఎంత మంది కార్మికులు అవసరం, వారిని ఎలా నియమించుకోవాలి.. ప్రైవేటుకు రూట్ల కేటాయింపులు ఎలా అనే దానిపై ప్రాథమిక నివేదిక తయారు చేసిన ఆర్టీసీ.. శుక్రవారం సీఎంకు నివేదించనున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో ఆర్టీసీ రూపొందించిన ప్రతిపాదనలపై సీఎం ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి పరిశీలించనున్నారు. ఆయన ఆమోదం తర్వాత నోటిఫికేషన్లు ఇచ్చే అవకాశం ఉంది.

**రోడ్డెక్కిన 5,580 ఆర్టీసీ బస్సులు**

ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఆర్టీసీ తాత్కాలిక కండక్టర్లు, డ్రైవర్లతో బస్సులు నిర్వహిస్తున్నారు. గురువారం రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 5,580 బస్సులను నడిపింది. రద్దీని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్న అధికారులు ఆ మేరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రైవేటు వాహన యజమానులతో చర్చలు జరిపి ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వం ఆదేశించడంతో అధిక వసూళ్లకు పాల్పడకుండా అధికారులు, పోలీసులు బస్సులను మధ్యలో ఆపి తనిఖీ లు నిర్వహిస్తున్నారు. దీంతో ఆర్టీసీ బస్సుల్లో వసూళ్లు నిర్దేశించిన ప్రకారం జరుగుతున్నా.. ప్రైవేటు వాహనాల్లో రెట్టింపు వసూలు చేస్తున్నారు. మరోవైపు అధిక సంఖ్యలో బస్సులు తిప్పాలని ఆర్టీసీ భావిస్తున్నా.. డ్రైవర్ల కొరతతో మెజార్టీ బస్సులు రోడ్డెక్కట్లేదు.

# అధిక చార్జీలు వసూలు చేయనీయకండి

- బస్‌పాస్‌దారుల నుంచి టికెట్ డబ్బులు తీసుకోవద్దు
- ఆర్టీసీ సమ్మె కేసులో ప్రభుత్వానికి హైకోర్టు మౌఖిక ఆదేశం

**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె విరమింపజేయాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంలో హైకోర్టులో సుదీర్ఘ వాదనలు జరిగినా మధ్యంతర ఉత్తర్వులు ఏమీ జారీ కాలేదు. సమ్మె నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా నడుపుతున్న బస్సుల్లో అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని వాట్సాప్ మెసేజ్‌లు వస్తున్నాయని ధర్మాస నం తెలిపింది. అధిక చార్జీలు, బస్ పాసులున్న వారి నుంచి కూడా టికెట్ డబ్బులు వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి మౌఖిక ఆదేశాలిచ్చింది. సమ్మె విరమించేలా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని పిటిషనర్ న్యాయవాది పలుమార్లు కోరితే.. ప్రజలేమీ ఇబ్బందులు పడటం లేదని, సమ్మె నేపథ్యంలో పూర్తిస్థాయిలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని ప్రభుత్వం చెప్పింది. సమ్మె చట్ట విరుద్ధమని, క్రమశిక్షణా చర్యలు తప్పవంటూ ప్రభుత్వం చేసిన వాదనను ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్, ఆర్టీసీ ఉద్యోగుల, కార్మిక సంఘం జేఏసీల తరపు న్యాయవాదులు వ్యతిరేకించారు. మధ్యంతర ఆదేశాల ప్రతిపాదనపై ఏమంటా రని ధర్మాసనం ప్రశ్నిస్తే.. వాయిదా వేయాలని యూనియన్ల తరపు న్యాయవాదులు, మధ్యంతర ఉత్తర్వులు అవసరం లేదని ప్రభుత్వం చెప్పింది. దీంతో ప్రభుత్వం, ఆర్టీసీ, సంఘం, జేఏసీ ఇతర ప్రతివాదులు కౌంటర్ పిటి షన్లు దాఖలు చేయాలని ఆదేశించి విచారణను ఈ నెల 15కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డి, జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిల ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. సమ్మె తర్వాత ఏర్పాట్లపై ప్రభుత్వం సమర్పించిన నివేదిక అసమగ్రంగా ఉందని ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది.

**సమ్మె చట్ట విరుద్ధం..**

ఉస్మానియా విశ్వవిద్యాలయం రీసెర్చ్ స్కాలర్ ఆర్.సుబేందర్‌సింగ్ దాఖలు చేసిన పిల్‌పై గురువారం మరోసారి వాదనలు జరిగాయి. అదనపు ఏజీ జె.రామచంద్రరావు వాదిస్తూ.. ఆర్టీసీ సమ్మె చట్ట విరుద్ధమని, ప్రయాణికుల సమస్యల కోణంలో ఏమాత్రం ఆలోచన చేయకుండా సమ్మెకు దిగారని చెప్పారు. సమ్మె చట్టను విరమింపునకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని పిటిషనర్ తరపు న్యాయవాది పి.వి.కృష్ణయ్య కోరారు. ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి తరపున సీనియర్ న్యాయవాది దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి వాదించారు.


గురువారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసైకి విజ్ఞాపన పత్రం అందజేస్తున్న రాష్ట్ర బీజేపీ నేతలు

## ఆర్టీసీని ప్రైవేటు పరం చేసే కుట్ర

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్**

**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీసీని ప్రైవేటు పరం చేసేందుకు ప్రభుత్వం కుట్రపన్నుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ ఆరోపించారు. గురువారం లక్ష్మణ్ నేతృత్వంలోని బీజేపీ ప్రతినిధుల బృందం గవర్నర్ తమిళిసైను కలిసింది. ఆర్టీసీకి సంబంధించిన పరిస్థితులు, ప్రభుత్వ వైఖరిపై గవర్నర్‌కు విజ్ఞాపన పత్రాన్ని అందజేసింది. అనంతరం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పోరాటం చేస్తుంటే ప్రభు త్వం పట్టించుకోవడం లేదని వాపోయారు. 40 రోజుల కిందటే సమ్మె నోటీసిచ్చినా పట్టించుకోలేదని ఆరోపించా రు. సమ్మెకు మూడ్రోజుల ముందు అధికారులతో కమిటీ వేసి పరిష్కరించకుండానే కమిటీని రద్దు చేశారని మండిపడ్డారు. 50 వేల మంది కార్మికులను విధుల నుంచి తొలగించారన్నారు. ఉద్యోగులను తొలగిస్తామంటే బీజేపీ చేతులు ముడుచుకొని కూర్చోదని స్పష్టం చేశారు. ప్రజలందరినీ ఏకం చేసి కేసీఆర్‌ను గద్దెదించే రోజు త్వరలోనే వస్తుందన్నారు. రాజ్యాంగబద్ధంగా గవర్నర్ జోక్యం చేసుకోవాలని కోరామని పేర్కొన్నారు. రాజ్యాంగ విరుద్ధంగా ఆర్టీసీ ఉద్యోగుల తొలగింపు నిర్ణయం తీసుకున్నారని, వారిని తొలగించకుండా ప్రజాస్వామ్యాన్ని కాపాడే చర్యలు గవర్నర్ చేపట్టాలని కోరారు. గవర్నర్‌ను కలిసిన వారిలో బీజేపీ రాష్ట్ర నేతలు ఇంద్రసేనారెడ్డి, రాంచందర్‌రావు, వివేక్, జితేందర్‌రెడ్డి, చంద్రశేఖర్, సాంబమూర్తి, ప్రేమేందర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, మల్లారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, మోహన్‌రెడ్డి ఉన్నారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

IACE WANTED
An Institute For BANKING, SSC & RAILWAYS
RECRUITMENT IN VIJAYAWADA, HYDERABAD & RAJAHMUNDRY
Teaching Faculty (Full / Part Time) ◆Quantitative Aptitude ◆Reasoning ◆English ◆Pure Maths ◆Current Affairs ◆General Studies ◆General Science
Non Teaching Staff
◆Counselors ◆Office Boys ◆Tele Callers (F)
Contact immediately Ph: 9700077833/844 or mail to hr.iacehyd@gmail.com

WANTED
Sr.Residents/Assistant & Associate Professors for the departments of Radio-Diagnosis, OBG/Gynic, Paediatrics and General Medicine.
CT/MRI/X-Ray Technicians, Centre Managers & Marketing executives for CT/MRI centres
located at Rajahmundry, Vizianagaram, Eluru, Machilipatnam, Tenali, Parvathipuram, Paderu, Proddutur, Nandyal & NRIGH
Send your resumes to nrihr2015@gmail.com
NRI Medical College & General Hospital
CHINAKAKANI, Mangalagiri(M), Guntur Dist.
Ph : 08645 - 230101. visit. www.nrias.net

ADITYA GROUP OF ENGINEERING COLLEGES
SURAMPALEM, NEAR KAKINADA, E.G.Dt., AP.
Ph: 9949876662, 7386740555, 7729993858
WALK-IN INTERVIEW
13/10/2019 (Sunday) @ 9.30 AM
Professors, Assoc. Professors & Asst. Professors
CIVIL / MECHANICAL / ECE / MINING ENGG / CHEMISTRY
1. Qualification and Salary as per AICTE norms.
2. Free Transport, Subsidised Lunch, Medical Insurance and staff quarters are available.
3. If spouse is educated, suitable position will be offered in the campus
4. Fee concession for the children in our International School and other Institutions.
Bus Facility avilable from Kakinada (Aditya Academy, Srinagar) & Rajahmundry (Aditya Junior College, Danavaipeta) @ 8.30 AM
Venue : ADITYA ENGINEERING COLLEGE, Surampalem

మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ
భారత ప్రభుత్వం
అందరికీ విద్య
మెరుగైన విద్య

కేంద్రీయ విద్యాలయం, మిర్యాలగూడ
నల్లగొండ జిల్లా, తెలంగాణ
విద్యాలయ నూతన భవన ప్రారంభ మహోత్సవం
తేది : 11 అక్టోబర్ 2019 మధ్యాహ్నం 12.00 గంటలకు
వేదిక : కేంద్రీయ విద్యాలయం, మిర్యాలగూడ, నల్లగొండ జిల్లా, తెలంగాణ
ప్రాముఖ్యతలు
మొత్తం విస్తీర్ణం : 8.14 ఎకరములు
ప్రాజెక్టు మొత్తం అంచనా వ్యయం : 15.25 కోట్లు
సౌకర్యములు : అన్ని రకాల ఆధునిక వసతులతో కూడిన 45 గదులు
లబ్ధిదార్లు : 1200 మంది విద్యార్థులు
స్థల సహకారం : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
ముఖ్య అతిథి
శ్రీ రమేష్ పోఖ్రియాల్ 'నిశంక్'
గౌరవ మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రివర్యులు
విశిష్ట అతిథులు
శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన మండలి చైర్మన్, తెలంగాణ
శ్రీ నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు, నల్లగొండ
శ్రీ నల్లమోతు భాస్కర్ రావు, శాసనసభ సభ్యులు, మిర్యాలగూడ
శుభారంభం : (వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా)
అందరికీ సాదర ఆహ్వానం


కేంద్రీయ విద్యాలయ సంగఠన్
18, సంస్థాగత్ క్షేత్ర్, షాహీద్ జీత్ సింగ్ మార్గ్, న్యూఢిల్లీ-110016
https://kvsangathan.nic.in/

సాక్షి
శుక్రవారం, అక్టోబర్, 11

# ట్రంప్ 'ఆత్మ విమర్శ'

'**అ**భిశంసన' భూతం వైట్‌హౌస్ తలుపు తడుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అత్యంత కీలకమైన ప్రకటన చేశారు. పశ్చిమాసియా యుద్ధ క్షేత్రాలనుంచి తమ సైన్యాలు నిష్క్రమించడం ఖాయమని ట్విటర్ ద్వారా ఆయన ప్రపంచానికి చాటారు. అయితే తమ అధ్యక్షుడు చేసిన ప్రకటనను అక్కడి విదేశాంగ శాఖ ఎలా తీసుకుంటుందో, రక్షణ శాఖ ప్రధాన కార్యాలయం పెంటగాన్ ఏమంటుందో, ప్రత్యేకించి ట్రంప్‌ను నెత్తిన పెట్టుకుని ఆయన్ను దేశాధ్యక్షుణ్ణి చేసిన రిపబ్లికన్ పార్టీ ఏం చేస్తుందో, అమెరికన్ కాంగ్రెస్ ఎలా స్పందిస్తుందో ఇంకా చూడాల్సి ఉంది. ఆ దేశంలో అంతర్గత పరిణామాలు చివరకు ఎటు పయనిస్తాయన్న సంగతలా ఉంచితే... వరస ట్వీట్ల ద్వారా ట్రంప్ చాలా విషయాలే చెప్పారు. చెప్పారనేకంటే అందరూ దశాబ్దాలుగా చెబుతున్న అంశాలనే ఆయన ధ్రువీకరించారనాలి. జన విధ్వంసక ఆయుధాలున్నాయన్న తప్పుడు అభిప్రాయంతో పశ్చిమాసియాలోకి ప్రవేశించడం దేశ చరిత్రలో అత్యంత దారుణమైన నిర్ణయమని ట్రంప్ అంగీకరించారు. అలాంటి ఆయుధాలు లేవని అనంతరకాలంలో తేలిందని ఆయన గుర్తు చేశారు. ఈ తప్పుడు నిర్ణయం పర్యవసానంగా దేశం 8 లక్షల కోట్ల డాలర్లు నష్టపోయిందని, వేలాదిమంది సైనికులు ప్రాణాలు కోల్పోయారని ఆయన వాపోయారు.

అమెరికాకు జరిగిన నష్టం గురించే ట్రంప్ మాట్లాడుతున్నారు. తాము దురాక్రమించిన, దాడులు చేసిన దేశాల స్థితిగతుల గురించి మౌనంవహిస్తున్నారు. ఆ దేశాల దుస్థితి చూస్తే ఎలాంటి వారికైనా కళ్లు చెమరుస్తాయి. ఇరాక్ నుంచి సిరియా వరకూ అన్ని దేశాలదీ ఒకే వ్యథ. ఆ దేశాలన్నీ దాదాపు వల్లకాళ్లుగా మారాయి. లక్షలాదిమంది ప్రజానీకం బాంబు దాడుల్లో, క్షిపణి దాడుల్లో దుర్మరణం పాలయ్యారు. మరిన్ని లక్షల కుటుంబాలు చిన్నాభిన్నమయ్యాయి. తమ ఆప్తుల్లో అనేకులు మరణించారో... సముద్రాలు దాటి వేరే దేశాల్లో తలదాచుకుంటున్నారో తెలియని అయోమయంలో అనేక కుటుంబాలున్నాయి. ఇంటికి కనీసం ఇద్దరు, ముగ్గురు అంగవికలులయ్యారు. అమెరికా నిర్వాకం వల్ల ఐఎస్ వంటి ఉగ్రవాద భూతాల పాలబడి మహిళలు, బాలికలు ఎదుర్కొన్న హింస చెప్పనలవికానిది. వారు అత్యాచారాలకూ, ఇతర లైంగిక హింసలకూ బలైపోయారు. సర్వస్వం కోల్పోయారు. వారిని నడిరోడ్డుపై సంతలో పశువుల్లా వేలం వేసిన ఉదంతాలు వెల్లడై ప్రపంచం దిగ్భ్రాంతిలో మునిగింది. చిన్న చిన్న పిల్లలు సైతం బలవంతంగా మానవ బాంబులుగా మారి తమ ప్రాణాలు బలిపెట్టారు. భారీ విధ్వంసాలకు కారకులయ్యారు. ఇప్పటికీ ఆ దేశాలు జరిగిన నష్టం నుంచి కోలుకోలేదు. అక్కడ శిథిల గృహాలు, చిన్నాభిన్నమైన జీవనం, మనిషి అన్న ప్రతివాడినీ అనుమానంతో చూసే కళ్లూ దర్శనమిస్తాయి. ఒక్కమాటలో చెప్పాలంటే అమెరికా తీసుకున్న తప్పుడు నిర్ణయం పర్యవసానంగా ఆ దేశాల్లో కనీసం రెండు, మూడు తరాల భవిష్యత్తు సర్వనాశనమైంది. తిండి, బట్ట, విద్య, వైద్యం, తాగునీరు వంటి కనీస అవసరాలకు కూడా దిక్కులేని స్థితి ఏర్పడింది. ఆ దేశాల ప్రజానీకానికి జరిగిన నష్టాలముందు... వారు ఎదుర్కొన్న, ఇప్పటికీ ఎదుర్కొంటున్న కష్టాలముందు అమెరికా కోల్పోయింది లేశమాత్రమే అని చెప్పాలి. ట్రంప్ ప్రకటన ఏమేరకు సాకారమవుతుందన్న సంగతలా ఉంచితే ఆయనే స్వయంగా తమ దేశం చేసినవి తప్పుడు పనులని అంగీకరించారు గనుక పశ్చిమాసియా దేశాల ప్రజలకు క్షమాపణ చెప్పడం, వారికి పరిహారం చెల్లించడం కనీస బాధ్యత. దాన్ని ఆయన గుర్తించకపోతే ఐక్యరాజ్య సమితి ఆ పని చేయించాలి. బోస్నియాలో 1992లో సాగిన నరమేథానికి కారకులైనవారిని 20 ఏళ్ల పాటు విచారించి యుద్ధ నేరస్తులుగా నిర్ధారించి శిక్షలు విధించారు. దశాబ్దంక్రితం శ్రీలంకలో తమిళ టైగర్లను అణిచేపేరిట సాగిన నరమేథాన్ని యుద్ధ నేరంగా పరిగణించాలంటూ భద్రతా మండలిలో అమెరికా, బ్రిటన్‌లు కోరుతున్నాయి. రెండేళ్లలో ఆ దేశం తనకు తానుగానే నిష్పాక్షిక న్యాయవిచారణ నిర్వహించి నేరగాళ్లపై చర్యలు తీసుకోవాలని మండలి గత మార్చిలో గడువు విధించింది. మరి ఇప్పుడు పశ్చిమాసియా విషయంలో అమెరికా, దాని మిత్ర దేశాలపై సమితి ఈ పనిచేయగలదా? దాని తరం కాదన్న భరోసాతోనే ట్రంప్ ఈ మాదిరి ట్వీట్లు చేయగలుగు తున్నారు.

అమెరికా సైన్యం చొరబడినంత సులభం కాదు... వెనక్కి రావడం. ఆ దేశాలన్నీ ఇప్పుడు పరస్పర అవిశ్వాసంతో, ఘర్షణలతో కొట్టుమిట్టాడుతున్నాయి. ఇరుగు పొరుగుతో నిత్యం సంఘర్షిస్తున్నాయి. ఇప్పుడు సిరియా స్థితి అదే. తమ సైన్యాన్ని ఉపసంహరించుకుంటామని ట్రంప్ చెప్పిన కొన్ని గంటలకే సిరియా ఉత్తర ప్రాంతంలోని కుర్దుల ప్రాంతాలపై టర్కీ బాంబుల వర్షం కురిపించడం ప్రారంభించింది. వేలాదిమంది ఇళ్లూ వాకిళ్లూ వదిలి ప్రాణభయంతో పరుగులు పెడుతున్నారు. ఈ విషయంలో తాము జోక్యం చేసుకోబోమని వైట్ హౌస్ చెప్పడంతో టర్కీ అధ్యక్షుడు ఎర్డోగాన్ మరింత విజృంభిస్తున్నారు. ఇన్నాళ్లూ అమెరికాకు అండగా ఉండి, ఇరాక్‌లో సైతం ఐఎస్‌ను అణచడంలో తోడ్పడిన కుర్దులు ఇప్పుడు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఈ పరిణామాలు చూశాక తమ సైన్యాన్ని సిరియా ఉత్తరప్రాంతానికి తరలించాలనుకుంటున్నామని అమెరికా రక్షణ శాఖ ప్రతి నిధి చెబుతున్నారు. దీనికి ట్రంప్ ఆమోదం ఉందో లేదో తెలలేదు. సిరియాలో అంతక్రితం తమ సైనికులు 2,000మంది ఉంటే ఆర్నెల్లక్రితం సగం మందిని వెనక్కు రప్పించారు. ఇప్పుడు మరింత తగ్గిస్తామన్న ప్రకటనను ఆయన నిలబెట్టుకుంటారో లేదో చూడాల్సి ఉంది. ట్రంప్ మాటలు నిజంగా ఆచరణలోకొస్తే ఏం చేయాలన్నది ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ సంస్థలు చర్చించి నిర్ణయించాలి. తదనుగుణంగా అమెరికా, మిత్ర దేశాలు నడుచుకోవాలి. అఫ్ఘానిస్తాన్, లిబియా, సోమాలియా, ఇరాక్ వంటిచోట్ల ఇన్నేళ్లుగా సాగించిన దారుణాలను విచారించడానికి సహకరించాలి. ఇవేమీ చేయకుండా సైన్యాన్ని వెనక్కి తీసుకొచ్చి అమెరికాను ఉద్ధరిస్తానంటే ప్రపంచ ప్రజానీకం సహించదు.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు ఆశ్వయుజ మాసం, తిథి శు.త్రయోదశి రా.9.31 వరకు, తదుపరి చతుర్దశి, నక్షత్రం పూర్వాభాద్ర తె.5.31 వరకు (తెల్లవారితే శనివారం) వర్జ్యం ఉ.10.01 నుంచి 11.45 వరకు, దుర్ముహూర్తం ఉ.8.14 నుంచి 9.01 వరకు, తదుపరి ప.12.11 నుంచి 12.56 వరకు అమృతఘడియలు... రా.8.37 నుంచి 10.22 వరకు.

**సూర్యోదయం :** 5.55
**సూర్యాస్తమయం:** 5.40
**రాహుకాలం :** ఉ.10.30 నుంచి 12.00 వరకు
**యమగండం :** ప.3.00 నుంచి 4.30 వరకు

# ఆచితూచి మాట్లాడండి కామ్రేడ్స్!

విశ్లేషణ



డాక్టర్ ఏపీ విఠల్

**సీపీఎం నేత బృందా కారత్ ఏపీలో ఒక సభలో మాట్లాడుతూ మోదీని ఏమాత్రం విమర్శించలేదంటూ సీఎం జగన్‌పై ఆరోపించారు. కానీ హుజూర్‌నగర్‌లో ఉపఎన్నికలతో సహా పాలకవర్గ పార్టీలతో పొత్తులు పెట్టుకోవడంపై వామపక్షాలు ప్రతి సందర్భంలోనూ వేస్తున్న తప్పటడుగులను, వామపక్షాల అనైక్యతను సరిదిద్దడంలో బృందా కారత్ తన వంతు కృషి చేస్తే బాగుంటుంది. పైగా, ఎన్నడూ లేనివిధంగా ఏపీలో గిరిజనులు, దళితులు, మైనారిటీలు, బీసీలు తదితరుల అభ్యున్నతికి వైఎస్ జగన్ చేపట్టిన సంక్షేమ చర్యల గురించి బృందా తెలుసుకుని ఉంటే బాగుండేది. సామాజిక న్యాయం కోసం పాటుపడుతున్న శక్తులతో శ్రామిక వర్గ పార్టీలు కలిసి పనిచేయడం ఇప్పటి అవసరం.**

**ఇ**టీవల సీపీఎం నేత బృందా కారత్ విశాఖ పట్నంలో అనుకుంటాను.. ఒక సభలో మాట్లాడుతూ, 'జగన్ ఏమన్నా ఫెవికాల్‌తో పెదాలు అంటించుకున్నారా? మోదీని ఏమీ విమర్శించలేదు' అన్నారు. నాకు తెలిసినంతవరకు బృందాకారత్ నిబద్ధత గల నాయకురాలు. పైగా సీపీఎం పార్టీ తరపున ఆదివాసీ గిరిజనుల అభ్యున్నతికై ఏర్పాటు చేసుకున్న ఒక కమిటీ నేత కూడా. గిరిజనుల అభివృద్ధి కోసం గత పాలకులు ఎన్నడూ చేయని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వాన ఎలా కృషి చేస్తున్నదో ఆమెకు సరైన సమాచారం లభించినట్లు లేదు. ఒక గిరిజన మహిళను ఉప ముఖ్యమంత్రిగా చేసిన ఘనత జగన్‌కే దక్కింది. తన మంత్రివర్గంలో 60 శాతం వరకు ఎస్సీ, ఎస్టీ, ఆదివాసీ గిరిజన మైనారిటీ మహిళా ప్రతినిధులకు స్థానం కల్పించారు జగన్. ఇంతవరకు ఈ విధంగా సామాజిక న్యాయాన్ని ఆచరించిన రాజకీయపార్టీ గానీ, ముఖ్యమంత్రి గానీ మరెవరైనా ఉన్నారా? అలాగే ప్రత్యేకంగా శ్రీకాకుళం జిల్లా వెళ్లినప్పుడు ఉత్తరాంధ్ర ప్రజానీకానికి ప్రత్యేకించి ఆదివాసీ గిరిజనుల కోసం వైద్య కళాశాల, విద్యాసంస్థలు, వైద్య సదుపాయం అలాగే ఆ ప్రాంతంలో ఉన్న కిడ్నీ బాధితుల కోసం ప్రత్యేక డయాలసిస్ కేంద్రాలు, రక్తశుద్ధి అవసరమైన వ్యాధిగ్రస్తులకు నెలకు రూ.10 వేల ఆర్థిక సదుపాయం ఇవన్నీ కల్పించే కృషి ప్రస్తుత రాష్ట్ర పాలనలో నిజాయితీగా జరుగుతున్నది కదా. ఆ ప్రాంతంలో బాక్సైట్ తవ్వకాలను నిలిపివేసింది జగన్ ప్రభుత్వమే కదా! అమలు క్రమంలో ఏవైనా లోపాలుంటే సహజంగా ప్రజానుకూల ప్రభుత్వానికి బాధ్యత గల ప్రతిపక్షం తగు సూచనలిచ్చి, నిర్మాణాత్మకంగా వ్యవహరించాలి.

పైగా ప్రతి 50 ఇళ్లకు వలంటీర్లను ఏర్పాటు చేసి, ప్రజల గడపవద్దకు ప్రభుత్వాన్ని తీసుకువెళ్లి, వాళ్లలో అర్హులకు ప్రభుత్వ రేషన్ అందించడం, ఇతరత్రా రేషన్ కార్డులు, పెన్షన్ సదుపాయాలు, కుల ధృవీకరణ పత్రాలు, మొదలగు సమస్యలు తీర్చే వలంటీర్ వ్యవస్థకు జగన్ ఏర్పాటు చేయడం అపూర్వం కాదా! దానిని కూడా గోనెసంచులు మోసినందుకు అయిదువేల జీతం అంటూ అపహాస్యం చేయడం, ఆ గ్రామ వాలంటీర్లను అవమానించడమే కదా! చంద్రబాబు కృష్ణా జిల్లాలో ఆ గ్రామ వలంటీర్ల నియామక పత్రాలనందించే సంఖ్యను చూసి ఉండరు. వారి స్పందన గమనించారా? ఆ సభలో జగన్ ప్రసంగం విన్నారా? ఆ వలంటీర్లలో అత్యధికులు యువతీయువకులు. ఇలా మా గ్రామంలో మా ప్రజలకు జగనన్న కుటుంబంలో పెద్దకొడుకు వలే ఏర్పాటు చేయడం, ఈ వలంటీర్ వ్యవస్థ, దాని ద్వారా మాకు, మా వారికి, మా ఊరికి ప్రజాసేవ చేసే అవకాశం రావడం మా అదృష్టం అని ఆ యువతీయువకులు స్పందించడం.. ఎంత హృద్యమైన దృశ్యమో అనిపించింది. బాబుగారు ప్రతి సభను ఒక ఈవెంటుగా మార్చి, తాను ఆ ఈవెంట్ మేనేజర్‌గా వ్యవహరించడం ఎంత అహంకార ఆడంబర ప్రదర్శనగా ఉండేదో కదా. తద్భిన్నంగా ఏదో పెద్దన్న, చెల్లెళ్లు, తమ్ముళ్లు కలిసి తమ కుటుంబం కోసం ఏం చెయ్యాలి అని చర్చించుకున్నట్లు సాగింది జగన్ సభ. అందుకే బాబు ఉక్రోషం పట్టలేకపోతున్నారు.

ఈ వ్యాసం మొదట్లో బృందాకారత్ జగన్‌ను విమర్శించిన ప్రస్తావన తేవడం ఎందుకంటే, ప్రస్తుతం చంద్రబాబు వ్యవహార శైలి వంటిది కమ్యూనిస్టులకు తగనిదని, తెలియజేసేందుకే! ఇటీవల సీపీఐ నేత నారాయణ కూడా గత స్పీకర్ కోడెల శివప్రసాద్ భౌతిక కాయాన్ని చూడటానికి వెళ్లి జగన్ అక్రమ వేధింపుల వల్లనే కోడెల ఆత్మహత్య చేసుకున్నారని చంద్రబాబు సమక్షంలోనే అన్నారు. ఆ ప్రకటన చూసిన మిత్రుడొకరు సీపీఐ వారు చంద్రబాబుకు దగ్గరవనున్నారా? అని అడిగాడు. 2009లో చంద్రబాబుతో మహాకూటమి కట్టిన తర్వాత, ఇటీవలి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల అనుభవం తర్వాత, చంద్రబాబు గారితో కమ్యూనిస్టులు ఎవరూ చేతులు కలపరనే అనుకుంటున్నానని అన్నాను. కమ్యూనిస్టు పార్టీలకు ప్రజాభ్యుదయం, పురోగామి తత్వం, లౌకిక విధానాలు వంటి శాశ్వత విలువలు ఉంటాయి. బాబు లాంటి వారికి అధికారంలోకి రావడమే ముఖ్యం కాబట్టి వారు కమ్యూనిస్టులతోనైనా ఎన్నికల్లో జతకట్టగలరు. పచ్చి కమ్యూనిస్టు వ్యతిరేక సంస్థ అయిన ఆరెస్సెస్, బీజేపీ వంటి వారితో సైతం పొత్తుకు వెనుకాడరు. కానీ కమ్యూనిస్టులకు మాత్రం బాబులాంటి వారితో పొత్తు ధృతరాష్ట్ర కౌగిలే.




ఈ సందర్భంగా జగన్ ఆచరణను కమ్యూనిస్టులు మర్చిపోకూడదు. పైగా బీజేపీ హిందూ మతతత్వ ఎజెండాను కాదని, మన రాష్ట్రంలో జగన్ పాలన సర్వ మతసమానత్వాన్ని పాటిస్తూ నడుస్తున్న విషయం వాస్తవం కాదా? దాన్ని గుర్తించకుండా, ఇంతకు ముందు బాబు పాలనలో ప్రజలు స్వర్గధామంలో ఉన్నట్లు జగన్‌పై విమర్శలు గుప్పించడం కమ్యూనిస్టులకు కూడని పని.

ప్రధాని మోదీ కార్పొరేట్ సంస్థలకు అత్యధిక లాభాలు లభించే విధంగా ఆర్థిక విధానాలు అవలంబించి, మన దేశ మౌలిక ఆర్థిక పరిస్థితిని క్షీణింప చేస్తున్నారు. కానీ వైఎస్ జగన్ మాత్రం గ్రామీణ ఆర్థిక వ్యవస్థను అక్కడి ప్రజల జీవన ప్రమాణాలను పెంచి వారి కొనుగోలు శక్తిని పెంచి ఆర్థిక పరిపుష్టి సాధించే దిశగా దృఢనిశ్చయంతో పయనిస్తున్నారు. అదే రైతు భరోసా, గ్రామ స్వరాజ్ వివిధ కార్పొరేషన్ల ప్రధాన ఉద్దేశం. ఈ పాలన అందిస్తున్న ప్రత్యామ్నాయ విధానాలను సరిగా బేరీజు చేసుకోకుండా, ప్రతిపక్షపాత్ర పోషించడం అంటే కాళ్లల్లో కట్టె పెట్టడమేనని కమ్యూనిస్టులు భావించడం సరికాదు.

ఈ సందర్భంగానే తప్పులెన్నువారు తమతప్పులెరగరు అన్నట్లు త్వరితగతిని మన ప్రజాభిమాన గ్రాఫ్ పడిపోతున్నప్పుడు తీవ్ర ఆత్మ విమర్శను నిజాయితీగా చేసుకోవాలని కమ్యూనిస్టులతో నాకున్న పేగు సంబంధంతో కోరుతున్నాను. సీపీఎం జాతీయ కార్యదర్శి ఏచూరి, హైదరాబాద్‌లో నిర్వహించిన సీపీఎం తెలంగాణ కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పాదయాత్ర ముగింపు సభలో లాల్ నీల్ నినాదం ఇచ్చారు. దాని అర్థం. వర్గపోరాట శక్తులు అలాగే సామాజిక అణచివేతకు గురవుతున్న వర్ణ(కుల) వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, మహిళలు, ఇతర వెనుక బడిన కులాలతో ఐక్యపోరాటం అవసరం అని భావించాము. దానికి ఆచరణ రూపం ఇస్తూ బహుజన, వామపక్ష సంఘటన (బీఎల్ఎఫ్)పై తెలంగాణ రాష్ట్రకమిటీ తత్సంబంధిత నేతలందరితో సంప్రదించి ఒక సృజనాత్మక మార్గాన్ని చేపట్టింది. అయితే వర్ణ (కుల) వ్యవస్థ నిర్మూలనా పోరాటం అనేది వర్గపోరాటాలకు, వర్గఐక్యతకు భంగం అని భయపడి, భయపెట్టే కామ్రేడ్లు ఆ పార్టీ పొలిట్ బ్యూరో, కేంద్ర కమిటీల్లో మెజారిటీగా ఉన్నారు. వారు ఈ బీఎల్ఎఫ్ ప్రయత్నాన్ని తిరస్కరిస్తూ మెజారిటీకి మైనారిటీ లోబడి ఉండాలనే పార్టీ నిబంధన ఆధారంగా దాన్ని వదిలిపెట్టాలని బలవంతం చేశారు. ఫలితంగా పార్లమెంటు ఎన్నికలో బీఎల్ఎఫ్‌ను విడిచి సీపీఐతో కలిసి ఎన్నికలలో తెలంగాణ సీపీఎం అయిష్టంగా జతకట్టింది.

ఇప్పుడు హుజూర్‌నగర్‌లో శాసనసభకు ఉపఎన్నిక వచ్చింది. పై కమిటీ కామ్రేడ్లు తెలంగాణ సీపీఎం పార్టీకి ఒంటరిగానే పోరాడమని తాఖీదు పంపారు. అక్కడ సీపీఐ టీఆర్ఎస్‌తో కలిసి పోటీ చేస్తోంది. గతంలో సీపీఎం నిర్మించిన బీఎల్ఎఫ్‌లోనే బాధ్యతలు నిర్వహించిన, మరో కమ్యూనిస్టు పార్టీ ఎంసీపీఐ (యూ), కంచ ఐలయ్య, కాకి మాధవరావు, తదితర సామాజిక న్యాయపోరాట సంస్థల నేతలు కొందరు కలిసి బీఎల్ఎఫ్ పేరుతో ఒక అభ్యర్థిని పెట్టింది. ఈ స్థితిలో సీపీఎం అభ్యర్థి నామినేషన్ సాంకేతిక కారణాలతో తిరస్కరణకు గురైంది. ఇప్పుడైనా తమ అభ్యర్థి రంగంలో లేడు గనుక తామే నిర్మించిన బీఎల్ఎఫ్ అభ్యర్థిని బలపరచడం సీపీఎం కర్తవ్యం. తెలంగాణ సీపీఎం విషయంలో కేంద్రీకృత ప్రజాస్వామ్యం పేరిట కేంద్రీకృత నియంతృత్వాన్ని అమలు జరిపి, ఆ పార్టీ పైకమిటీ ఏం ఆదేశిస్తుందో చూడాలి. ఒకవేళ సీపీఎం, తాను బీఎల్ఎఫ్‌ని బలపర్చడం లేదని ప్రకటిస్తే, తెలంగాణలో ప్రత్యేకించి, దేశవ్యాప్తంగాను సీపీఎం ప్రతిష్ట దిగజారుతుంది. విస్తృత ప్రజా సమీకరణ చేయాల్సిన మౌలిక లక్ష్యానికి సీపీఎం దూరమవుతుంది. కానీ ఆ తప్పు నిర్ణయాన్ని సీపీఎం చేయదని ఆశిద్దాం. అణగారిన ప్రజల, కష్టజీవుల విస్తృత ఐక్య పోరాటమే మార్క్సిజాన్ని మన దేశ ప్రత్యేకతకు అన్వయించడం!

వ్యాసకర్త మార్క్సిస్టు విశ్లేషకులు । మొబైల్ : 98480 69720

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### బలగాలు



"**అం**తా సాధారణంగానే ఉంటే, తొమ్మిది లక్షల బలగాలు కశ్మీర్‌లో ఎందుకున్నట్టు? వాళ్లున్నది పాకిస్తాన్ హఠాత్తుగా చేసే దాడులను ఎదుర్కోవడానికి కాదు, నిరసనలను అణచివేయడానికే. సైన్యం ప్రధాన కర్తవ్యం సరిహద్దులను కాపాడటమేకానీ, అసమ్మతిని అణగదొక్కడం కాదు. బీజేపీ జవాన్ల పేరు చెప్పుకుని వారి త్యాగాల ద్వారా ఓట్లు దండుకుంటోంది. కశ్మీర్‌లో అశాంతికి బలగాలను పావులుగా వాడుకుంటున్నారు. కశ్మీరీలపట్లగానీ, సైన్యంపట్ల గానీ అధికార పార్టీకి ఎటువంటి బాధ్యత లేదు. కేవలం ఎన్నికల్లో గెలవడమే దాని లక్ష్యం"

– మహబూబా ముఫ్తీ, పీడీపీ అధ్యక్షురాలు

### 20



"**వ**న్డే క్రికెట్‌లో 20 ఏళ్లు పూర్తి చేస్తుకున్న మిథాలీరాజ్‌కు బిగ్ థంమ్స్ అప్. స్ఫూర్తివంతమైన ఆమె ప్రయాణంగా మరింత బలంగా ముందుకు సాగాలని ఆశిస్తున్నా"

– హర్షాభోగ్లే, క్రికెట్ విశ్లేషకుడు

### కష్టం



"పెద్ద నేరాలను, దుర్మార్గులను ఎదుర్కోవడం ఇప్పుడు పెద్ద సవాల్‌గా మారింది"

– హిల్లరీ క్లింటన్,

### మనీ



"**2**20 మంది ఎగవేతదారులకు చెందిన రూ.76,600కోట్ల అప్పును ఎస్‌బిఐ రద్దు చేసినట్టు ఒక ఆర్టీఐ పిటిషన్ ద్వారా వెల్లడయ్యింది. తాము జీవిత కాలం కష్టించి దాచుకున్న డబ్బు తీసుకోవడానికి సామాన్యులకు మాత్రం పరిమితులు విధిస్తున్నారు. కానీ, ధనవంతులు ప్రజల సొమ్మును సులువుగా దోచుకుపోతున్నారు. ప్రజలకు హామీ ఇచ్చిన అచ్చే దిన్ ఇదేనా?"

– షమా మహమ్మద్, కాంగ్రెస్ నేత

### భయం



"**ఓ**ట్ల కోసం మా ఇంటికి వచ్చిన బీజేపీ ప్రచారకులకు నేనేంటో చూపించా. తల్లిదండ్రులు షాక్ తిన్నారు. మా ఇంట్లో కుక్క కూడా భయపడిపోయి లోపలికి పరుగు తీసింది. వచ్చిన వాళ్లు కూడా ఆశ్చర్యంతో నోరు వెళ్లబెట్టి వెళ్లిపోయారు. కానీ, నాకిప్పుడు కొంచెం భయంగా ఉంది. ఈ ప్రభుత్వానికి మద్దతు పలికే కుటుంబ సభ్యులు, స్నేహితులతో అన్ని సంబంధాలు తెంచేసుకున్నా"

– ఆపేక్ష, ఫిజియోథెరపిస్ట్

### కిరాతకం



"**బెం**గాల్‌లోని ఆర్ఎస్ఎస్‌తో సంబంధాలున్నాయన్న ఆరోపణతో బంధన్ ప్రకాష్ అనే వ్యక్తినీ, గర్భవతి అయిన ఆయన భార్యనీ, ఎనిమిదేళ్ల కుమారుడినీ కిరాతకంగా చంపేశారు. వాళ్లు ముస్లింలు అత్యధికంగా ఉండే ప్రాంతంలో నివసిస్తున్నారు. వాళ్ల పేర్ల చివర ఖాన్, ఖురేషీ వంటి తోకలు లేకపోవడంతో వారి హత్యలపట్ల ఆందోళన కరువయ్యింది. హత్యకు గురైనది ముస్లింలే అయితే, వారి మరణాలు ప్రపంచ చరిత్రకు ఎక్కేవి"

– మధుపూర్ణిమ కిష్వార్, ప్రొఫెసర్

ఇన్‌బాక్స్

## బంగారు తల్లుల్ని బతకనిద్దాం

**ఒ**కప్పుడు ఆడపిల్ల పుడితే మహాలక్ష్మి పుట్టిందనుకునేవారు. ఇప్పుడు 'అయ్యో! ఆడపిల్ల పుట్టిందా?' అని విచారిస్తున్నారు. పుట్టకముందు నుండే వివక్ష చూపుతున్నారు. పుట్టాక ఆడుగడుగునా ఆంక్షలు విధిస్తున్నారు. కొన్ని కన్నీళ్లు, ఇంకొన్ని శారీరక హింసలు. మరి కొన్ని గృహ హింసలు. బలం పట్టాల్సిన బాల్యం గునపం పడితే.. పలక పట్టాల్సిన చేతులు కలప మోస్తే.. బడికి వెళ్లాల్సిన ఈడు మడిలో నానితే... ప్రపంచం స్పందించింది.. పిడికిలి బిగించింది.. ఏకమైంది!! బాల్యాన్ని కోల్పోతున్న బాలకల తరపున పోరాటానికి సమాయత్తమైంది. బాలురతో సమానంగా వారికి అన్ని హక్కులూ ఉన్నాయని ఉద్ఘాటించింది. ఈ క్రమంలో పురుడుపోసుకున్నదే ప్రపంచ బాలికా దినోత్సవం. బాలురతో లింగ సమానత్వం సాధించే లక్ష్యంతో ప్రతి సంవత్సరం అక్టోబర్ 11 వ తేదిన అంతర్జాతీయ బాలికా దినోత్సవంగా నిర్వహించాలని ఐక్యరాజ్య సమితి నిర్ధారించింది. అప్పటి నుంచి బాలికల సంరక్షణకై ప్రతి సంవత్సరం ఒక్కొక్క లక్ష్యాన్ని తీసుకొని దాని నేపథ్యంలో అనేక కార్యక్రమాలను చేపడుతున్నారు. మన దేశంలో 'బేటీ బచావ్' ప్రోత్సహిస్తున్నారు. ఒకప్పుడు ఆడపిల్ల పుడితే ఇల్లంతా సంతోష వాతావరణం వెల్లివిరిసేది. ఇవ్వాళ తల్లి గర్భంలో పెరుగుతున్నది ఆడపిల్ల అని తెలిస్తే, ఆడపిల్లని భూమి మీదకి రాకుండా భ్రూణ హత్యలకి పాల్పడుతున్న పరిస్థితి.

ప్రభుత్వాలు చట్టాలు చేసి తమ బాధ్యత తీరిపోయిందని చేతులు ముడుచుకొని ఉండడం వల్ల ఆసుపత్రులు స్కానింగ్ సెంటర్‌లు, ఇష్టానుసారం వ్యవహరిస్తూ భ్రూణ హత్యలకు కారణమౌతున్నాయి. దీనిపై ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించి ఆడ పిల్లల వెచ్చదనం నిలుపు చేయాలి. అంతేకాక స్వచ్ఛంద సంస్థలు ప్రజలను చైతన్యవంతం చేయాలి అప్పుడే బంగారు తల్లులు బతుకుతారు. ఆడప్లిని పుట్టనిద్దాం, బతకనిద్దాం, చదివిద్దాం.

(నేడు అంతర్జాతీయ బాలికా దినోత్సవం)

డా॥యస్ బాబురావు,
స్వతంత్ర జర్నలిస్టు, కావలి
మొబైల్ : 9573011844

# ప్రశ్నను చంపేవాడే దేశద్రోహి

విశ్లేషణ



మాడభూషి శ్రీధర్

**హ**త్యకన్నా ప్రజాస్వామ్యాన్ని చంపడం. రేప్ కన్నా ప్రజలను భజనపరులుగా మార్చడం, లించింగ్ అనే మూకుమ్మడిహత్యల కన్నా ప్రశ్నించే తత్వాన్ని హత్య చేయడం తీవ్రమైన నేరాలు. పరస్పర ద్వేషాలను రగిలించే విధానాలు అనుసరిస్తూ లించింగ్ సరైనదే అని పరోక్షంగా నేర్పే రాజకీయులు, రాజకీయాలే అసలైన నేరగాళ్లు. రాజకీయ పార్టీలను ప్రశ్నించడం ప్రజాస్వామిక బాధ్యత. కాళోజీ అన్నట్టు అప్పుడే అతను పౌరుడవుతాడు లేకపోతే పోరడు. కానీ అదే అడిగితే? అడిగిన వాడిపై దాడి చేయడం, వేటాడడం, దొంగకేసులు పెట్టడం, పాతకేసులు తవ్వడం, లేదా చెత్తకేసుల్లో ఇరికించడం దారుణాలు. కనిపించని హంతకులు చేసే అదృశ్య హత్యలు ఇవి. న్యాయంగా కేసులు నిర్ధారించిన జడ్జీలను కూడా వేధించడం, విభేదించిన వాడిని బాధించడం, నేర విచారణ అధికారులమీదే నేరాలు బనాయించడం, కిందిస్థాయి అవినీతి పరులను కలుపుకుని తిరుగుబాట్లు చేయించి, వ్యవస్థలను ధ్వంసం చేయడం, మూకుమ్మడి అత్యాచారాలే.

కాకతీయ యూనివర్సిటీలో ప్రజాకవి పద్మభూషణ్ కాళోజీ నారాయణరావు ఎండోమెంట్ ప్రసంగం చేయాలని పిలిచారు. కాళోజీ వ్యక్తిత్వానికి సరిపోయే చర్చనీయాంశం ఏదంటే 'ప్రజాస్వామ్యం, ప్రశ్నించే తత్వం' కాక మరేది. 'ప్రజలను చంపే అధికారం ఎవరిచ్చార్రా వెంగళ్రావ్' అంటూ నినదించిన గొంతు ఆయనది. అదీ ఎక్కడ.. వెంగళరావు సీఎం హోదాలో సత్తుపల్లిలో అసెంబ్లీ స్థానానికి పోటీ చేస్తున్న చోట. ముఖ్యమంత్రిగా కొనసాగడం కోసం వెంగళ్రావ్ పోటీ చేస్తే, కాళోజీ కేవలం ప్రశ్నించడం కోసం పోటీచేసినాడు. గెలిచింది సీఎంయే కానీ ప్రజాప్రతినిధి కావలసిన వ్యక్తి కాదు. ఓడింది ప్రజాస్వామ్యమేగాని కాళోజీ కాదు. బూటకపు ఎన్‌కౌంటర్లు జరిపించిన తొలి ఎమర్జెన్సీ సీఎం అని గొంతెత్తి చెప్పడమే విజయం. తిడితే తిట్టనీ, అడిగితే అడగనీ అని జలగం వెంగళరావు అడిగేవాడిని అడగనిచ్చాడు. జవాబు ఇవ్వలేకపోయినా. పోటీచేస్తే చేయనీ, అని పోటీ చేయనిచ్చాడు. రాజును రోజూ తిడుతున్నా రాజద్రోహం కేసు పెట్టించలేదు. జలగం ఎంత గొప్పవాడు? కాళోజీ ఇప్పుడు బతికి ఉంటే, అప్పుడెప్పుడో సత్తుపల్లిలో ప్రశ్న వేసినందుకు 2019లో రాజద్రోహం కేసు కింద అరెస్టయి పుణే ఎరవాడ జైల్లో వరవరరావుతోపాటు ఉండేవాడేమో?.

కాళోజీ వంటి సెలబ్రిటీ వ్యక్తులు 49 మంది ఈమధ్య చేసిన నేరం ఏమంటే ప్రశ్నించడం. గుంపు హత్యలు ఈ దేశ పరువును ప్రతిష్ఠను ధ్వంసం చేస్తున్నాయని వారు విమర్శించారు. లించింగలు జరగకుండా చూడలేరా అని అడిగితే దేశ ద్రోహం ఏ విధంగా అవుతుందో చెప్పగలరా ఎవరైనా? గతవారం ముజఫ్ఫర్ పూర్ చీఫ్ జుడిషియల్ మేజిస్ట్రేట్ సూర్యకాంత్ తివారీ గారికి 49 మంది కళాకారులు మేధావులు ప్రధానికి రాసిన ఈ లేఖలో దేశద్రోహపు రంగులు, కాంతులు, పొగలు, పగలు కనిపించడం ఆశ్చర్యకరం. దేశద్రోహం కేసు రిజిస్టర్ చేయాలని ఆదేశించిన ఆ న్యాయాధికారిగారి దృక్పథం ఇదా అని దేశం మ్రాన్పడిపోయింది. మరో 185 మంది సమాజశ్రేయోభిలాషులు అక్టోబర్ 8న ఆ ఉత్తరాన్ని సమర్థిస్తూ మరోలేఖ వ్రాసారు. వారిమీద కూడా దేశద్రోహం కేసు పెడతారా?

అయితే ఈ అవివేకపు కారు చీకటిలోనూ కొంత వెలుగు కనిపించింది. బిహార్ స్పెషల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ మనోజ్ కుమార్ దేశద్రోహపు ఆరోపణ చేసే ఈ ఫిర్యాదును బుట్టదాఖలు చేయాల్సిందే అని నిర్ణయించడంలో వివేకం విజ్ఞత ఇంకా బతికున్నాయనే ఆశాభావం కన్నుతెరిచింది. న్యాయాధికారి చూడలేకుండాపోయిన నిజాలు పోలీసు అధికారికి సులువుగా కనిపించాయి. ఇది దురుద్దేశపూరితంగా చేసిన తప్పుడు ఫిర్యాదు, దేశద్రోహం ఆరోపణ పైన విచారించడానికి అణుమాత్రం ఆధారంకూడా లేదు అని మనోజ్ కుమార్ వివరించారు. ఈ ఫిర్యాదు చేసిన ఓఝూ అనే వ్యక్తి పిటిషన్ పైన జడ్జిగారు జారీ చేసిన ఆదేశం మేరకు కేసు రిజిస్టర్ చేయవలసి వచ్చిందని మరో ఉన్నతాధికారి చెప్పాడు. ''ఒరేయ్ ప్రశ్నించేవానికి, ప్రశ్నకు కూడా ద్రోహం చేస్తావ్ రా ఎన్ని గుండెలు నీకు? అయితే నువ్వేరా దేశద్రోహివి, ఇది తెలిసినోడేరా అసలైన దేశభక్తుడు'' అని కాళోజీ ఇప్పుడు ఉంటే అనేవాడేమో.

వ్యాసకర్త బెన్నెట్ యూనివర్సిటీ ప్రొఫెసర్,
కేంద్ర సమాచార మాజీ కమిషనర్
madabhushi.sridhar@gmail.com

# కోరికలు

**మా**నవజన్మ ఎత్తిన వారికి కోరికలు కలగడం సహజం. స్వప్రయోజనమా, పరహితమా అనేది ఆలోచనా స్థాయి నిర్ణయిస్తుంది. ఆహారం, కామం, నిద్ర, ప్రేమ, మోహం, భద్రత వంటి కోరికలు స్వార్థపరమైనవి. మహానుభావులు మాత్రమే పరహితార్థం పరితపిస్తారు. భారతీయులకు అన్నవస్త్రాలకై వివేకానందుడు, బీదల అభ్యున్నతికై మదర్ థెరీసా, భరతమాత స్వేచ్ఛకై గాంధీజీల ప్రార్థనలు లోకానికి ఆదర్శం. అనుసరణీయం. 'దుఃఖానికి మూలం కోరికలేనన్న గౌతమ బుద్ధుని సందేశం' మరచిన మానవుడు కోరికలు కోరుతూ, తీరని రోజున కలత చెందుతున్నాడు. తీరని కోరికలే దుఃఖహేతువులన్న జ్ఞానం విస్మరిస్తున్నాడు. కూడు, గూడు, గుడ్డ ఆశించడం అవసరమేనని, సహజసిద్ధమైనవి, జీవన గమన అభివృద్ధికి దారితీసే విధంగా ఉండే కోరికలైతే లోకం సహకరిస్తుందని గ్రహించాలి. కొన్ని కోరికలు పురోగతికి, మరికొన్ని అధోగతికి కారణమవుతాయని చరిత్ర చెప్పింది. సింహఘడ్ కోటను వశం చేసుకోమని కోరిన జిజియాబాయి కోరిక శివాజీకి విజయాన్నిచ్చినా, సింహం లాంటి తానాజీని దూరం చేసింది. అనైతిక కోరికలు పతనానికి దారితీస్తాయని రావణుడు, కీచకుడు, సైంధవుల రూపంలో రుజువిచ్చాయి పురాణాలు.



జ్యోతిర్మయం

స్వార్థపరమైన కోరికలకు పురాణ పురుషులూ అతీతులు కారని పురాణాలు బోధించాయి. బంగారు లేడిని కోరిన సీతాదేవి అనేక కష్టనష్టాలకు, రావణ యుద్ధానికి కారణమయిన వృత్తాంతాన్ని రామాయణం, పారిజాతపుష్పం కోరిన సత్యభామ కోరిక దేవేంద్రుడితో యుద్ధానికి దారి తీసిందని భాగవతం వివరించాయి. ఇందుకు విరుద్ధంగా వెయ్యి దళాల పద్మం కలిగిన సౌగంధ వృక్షం కావాలన్న ద్రౌపది కోరిక, భీముడికి హనుమంతుడి దర్శనాన్ని, రెండు వరాలను అందించినట్టు భారతం తెలిపింది. 'ఐహిక సుఖాల వ్యామోహం వలన జనించిన కోరికలు తీరనప్పుడు క్రోధం, క్రోధం వలన వ్యామోహం, తద్వారా జ్ఞానశక్తి నశించుట, మానవ పతనం సంభవిస్తాయన్న' గీతాకారుడి బోధనలు మననం చేసుకుంటూ, స్వార్థపూరిత కోరికలను త్యజించాలి. మనసుకు తృప్తిని అలవాటు చేస్తూ, సంతృప్తిగా జీవించడం నేర్చుకోవాలి. మనసును ఆధీనంలో ఉంచుకుని కోరికలకు కళ్లెం బిగించాలి.

– నారంశెట్టి ఉమామహేశ్వరరావు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 270 1083



క్రికెటర్లు

# డాడీల పుత్రికోత్సాహం



రణ్‌వీర్, ధోనీ కూతుళ్ల కళ్లద్దాలు

హఠాత్తుగా ఈ రెండు మూడు రోజుల్లో క్రికెటర్లు ధోనీ, గౌతమ్ గంభీర్, అజింక్యా రహానే సోషల్ మీడియాలో 'ఫామ్'లోకి వచ్చారు! వాళ్లతో పాటు సచిన్ టెండూల్కర్ కూడా!! అజింక్యా రహానేకు శనివారం కూతురు పుట్టింది. ఆ టైమ్‌కి అజింక్యా వైజాగ్‌లో టెస్ట్ మ్యాచ్ ఆడుతున్నాడు. ఆట అయ్యాక భార్యతో, బేబీ గర్ల్‌తో ఒక ఫొటో దిగి, ట్విట్టర్‌లో పెట్టాడు. అది చూసి సచిన్ టెండూల్కర్ ట్విట్టర్‌లోనే అజింక్యాను, అతడి భార్య రాధికను కంగ్రాచ్యులేట్ చేశాడు. అక్కడితో ఆగలేదు. 'తొలి బిడ్డ పుట్టుక ఇచ్చే



భార్య, కూతురుతో అజింక్యా

సంతోషం దేనికీ సరితూగనిది' అన్నాడు. అక్కడితోనూ ఆగలేదు. 'డైపర్స్ మారుస్తూ నైట్ వాచ్‌మన్‌గా కొత్త పాత్రను పోషించడంలోని ఆనందాన్ని అనుభవించు' అని అజింక్యాను ఆహ్లాదపరిచాడు.

ధోనీ తండ్రి మనసు కూడా అతడిని ట్విట్టర్‌లోకి నడిపించింది. ధోనీ కూతురు జివా వయసు నాలుగున్నరేళ్లు. బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్‌కి, జివాకు ఒకేలాంటి ఫ్యాషనబుల్ కళ్లద్దాలు ఉన్నాయి. ఏదో ఫొటోలో రణ్‌వీర్‌ను ఆ కళ్లద్దాలతో చూసింది జివా. వెంటనే, ''నా కళ్లద్దాలను ఈయన ఎందుకు పెట్టుకున్నాడు?'' అని తండ్రిని అడిగింది. ఆ వెంటనే పై గదిలో పెట్టిన తన కళ్లద్దాలు అక్కడ ఉన్నాయో లేవో చూసుకోవడానికి వెళ్లింది. అవి అక్కడే ఉండడం చూసి, ''నావి నా దగ్గరే ఉన్నాయి'' అని చెప్పింది. ఇకనేం తండ్రి హృదయం ఉప్పొంగింది! ఆ వయసులో నాకు అంత తెలివి ఉండేది కాదు అని రణ్‌వీర్ ఫొటోను, కూతురు ఫొటోను కలిపి ట్విట్టర్‌లో షేర్ చేశాడు. ఆ ఫొటోను చూసి రణ్‌వీర్.. ''హహహా ఫ్యాషనిస్టా జివా'' అని కామెంట్ పెట్టాడు.



కూతుళ్లతో గౌతమ్ గంభీర్

అష్టమి రోజు గౌతమ్ గంభీర్ తన కూతుళ్ల కాళ్లు కడిగి తలపై చల్లుకున్నాడు. కాళ్లు కడుగుతున్నప్పటి ఫొటోను ట్విట్టర్‌లో అప్‌లోడ్ చేశాడు. "ఇద్దరు ఆడపిల్లల తండ్రిగా నేను పెడిక్యూర్ (పాదాలకు బ్యూటీ ట్రీట్‌మెంట్)లో ప్రావీణ్యం సాధించాను అని మురిపెంగా కామెంట్ పెట్టుకున్నాడు.

## ప్రేమ
రెండేళ్ల క్రితం అర్జున్‌రెడ్డి

## పోరాటం
రెండ్రోజుల క్రితం జార్జిరెడ్డి

# వైరల్ ట్రైలర్స్

"ప్రైవేటైజేషన్ ఈజ్ టేకింగోవర్. పూర్ స్టేయింగ్ పూర్ అండ్ రిచ్ బికమింగ్ రిచర్".

జార్జిరెడ్డి మాట్లాడుతున్నాడు.

".. బీయింగ్ అగైనెస్ట్ దిస్, వి హ్యావ్ రైజ్‌డ్ అవర్ వాయిస్ టు ప్రొటెస్ట్.. బట్ అవర్ ప్రొటెస్ట్ హ్యాజ్ రిమెయిన్డ్ అన్‌హర్డ్.."

(పేదోడు పేదోడిగానే ఉండిపోతున్నాడు. ఉన్నోడు ఇంకా ఇంకా ఉన్నోడు అయిపోతున్నాడు. దీనిపై మేము గళం విప్పాం. పిడికిలి బిగించాం).

* * *

ఉస్మానియా విశ్వవిద్యాలయం 1967.

హాస్టల్ డైనింగ్ హాల్.

''మనం తిన్న ప్లేట్లల్ల ఉప్పేసి కడుగుతరు ఈ నా కొడుకులు. తినండ్రా మీరు తిన్నంక అదే ప్లేట్లల్లో ఉచ్చ పోసి కడుగుత..''

అన్నం పరబ్రహ్మ స్వరూపం.

వర్ణం? మనుధర్మ వికృతరూపం.

తింటున్న ప్లేట్లు గాల్లోకి లేచాయి.

''రేయ్.. ఏం కూశావ్‌రా'' అగ్రవర్ణం పైకి లేచింది.

జార్జిరెడ్డి కూడా పైకి లేచాడు. తనది ఏ వర్ణమో అతడు చూసుకోలేదు. 'ఉచ్చపోసి కడుగుతా' అని అరిచిన 'అధమ' వర్ణం వైపు నిలబడ్డాడు!

'అర్జున్‌రెడ్డి' సినిమాలో అమిత్‌గాడి హాస్టల్‌కి వెళ్లి మరీ వాడి ముక్కూమూతి పగలగొట్టినట్లు.. 'ఏం కూశావ్‌రా..' అని అధమ వర్ణంపైకి లేచిన అగ్రవర్ణం ముక్కు బద్దలు కొట్టాడు జార్జిరెడ్డి.

* * *

''ఈ దేశంలో పుట్టి, ఈ దేశం గాలి పీల్చి, ఈ దేశం కోసం పోరాడుతున్న విద్యార్థులారా.. యుద్ధానికి సిద్ధం కండి. భారత్ మాతాకీ జై.''

క్యాంపస్‌లోకి అవుట్ సైడర్స్! టార్గెట్ జార్జిరెడ్డి!

''ఎవరు వాడు?''.. పోలీస్ ఇన్‌స్పెక్టర్ అడిగాడు.

''ఎవడో కొత్త కుర్రోడు సార్. పేరు జార్జిరెడ్డి''.. ముఖం పచ్చడైన భరతమాత ముద్దుబిడ్డ ఒకడు చేతులు కట్టుకుని చెబుతున్నాడు.

* * *

''ఎనీ బడి కెన్ సాల్వ్ దిస్?''.. ఫిజిక్స్ క్లాస్ రూమ్‌లో లెక్చరర్ అడిగాడు.

జార్జిరెడ్డి చెయ్యెత్తాడు.

క్లాసయ్యాక క్లాస్‌మేట్ అడిగాడు.. ''నిజం చెప్పు డబుల్ ఎమ్మెస్సీ కదా!''

జార్జిరెడ్డి నవ్వలేదు. నవ్వీ నవ్వనట్లు చూశాడు.

క్యాంపస్‌లోకి మళ్లీ ఔట్ సైడర్స్. మళ్లీ జార్జిరెడ్డే టార్గెట్. వీడిని ఇలాగే వదిలేస్తే క్యాంపస్ చేజారిపోతుంది. ''పోతేపోయింది.. ఆ నా కొడుకుల చేతిలోకి పోతుంది''.

కత్తులు, కర్రలు.. ఉస్మానియాలో ఉద్రిక్తత. కారణం.. మళ్లీ జార్జిరెడ్డి!

''వన్ ఇయర్ రస్టికేట్ లెటర్ టైప్ చెయ్యండి''.. వైస్ చాన్స్‌లర్ ఆర్డర్.

ఇంటికొచ్చాడు జార్జిరెడ్డి.

''నేను అనుకున్న క్యాంపస్ ఇది కాదమ్మా..'' తల్లితో అన్నాడు.

కానీ క్యాంపస్ అనుకున్న హీరో మాత్రం జార్జిరెడ్డే.

రష్యన్ రివల్యూషన్ పుస్తకాన్ని కొడుకు చేతికిచ్చింది తల్లి. జార్జిరెడ్డి రీచార్జ్‌రెడ్డి అయ్యాడు.

* * *

''జార్జిరెడ్డి దాదా అయిండన్నా.. ఔటర్స్ లోపలికి రావాలంటేనే భయపడుతున్నారు. అంతే కాదు.. అప్పర్ క్యాస్ట్ అంటే.. అసలు ఆలోచించకుండా కొడుతున్నాడు''

''అసలు ఈడెవడు భయ్యా. నిన్నగాక మొన్నొచ్చాడు''

వచ్చింది నిన్నగాక మొన్ననే. ఉండబోతున్నది ఉస్మానియా క్యాంపస్ ఉన్నంతకాలం.

### విద్యార్థి ఉద్యమ నిర్మాత

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 1970వ దశాబ్దారంభంలో ప్రగతిశీల విద్యార్థి ఉద్యమ నిర్మాణానికి జార్జిరెడ్డి రాజకీయ పునాదులు వేశాడు. ఆ క్రమంలోనే 1972లో 25 ఏళ్ల వయసులో క్యాంపస్‌లోని ఇంజినీరింగ్ కాలేజ్ హాస్టల్ బయట ప్రత్యర్థి శక్తుల చేతుల్లో హత్యకు గురయ్యాడు. ఓయూ క్యాంపస్‌లో సామాజికంగా అట్టడుగు విద్యార్థులను చైతన్య పరచిన చరిత్ర జార్జిరెడ్డిది.



చే గువెరా యూనిఫాంలో జార్జిరెడ్డి (పైన), జార్జిరెడ్డి పాత్రలో సందీప్ మాధవ్



రియల్ హీరో
జార్జిరెడ్డి



రీల్ హీరో
సందీప్ మాధవ్

''స్కాలర్‌షిప్పులు రాకుండా చేసినా, ఏం చేసినా సరే.. గల్లా పట్టుకుని ప్రశ్నించండి.. రైజ్ యువర్ వాయిస్''.. జార్జిరెడ్డి స్పీచ్‌కి క్యాంపస్‌లోని చెట్టు కూడా తలలు ఊపుతున్నాయి.

* * *

''ఈ కాలేజేమైనా వాళ్ల అయ్యదా? తాతదా? ఎవరికి ఆయాసమొచ్చినా ఉరికొస్తుండు''

''ఎవరో కనుక్కోండి''

జార్జిరెడ్డి. మ్యాన్ ఆఫ్ యాక్షన్.

''టుడే వాట్ వియ్ లెఫ్ట్ విత్ అజ్ ఈజ్ ఆర్గనైజింగ్ దిస్ అండ్ మీట్ వయొలెన్స్ విత్ వయొలెన్స్''

జార్జిరెడ్డి మాట్లాడుతున్నాడు.

''రైజ్ యువర్ వాయిస్. బిఫోర్ ద ట్రూత్ డైస్''.

జార్జిరెడ్డి కొట్లాడుతున్నాడు.

''జీనా హైతో మర్‌నా సీకో.. కదమ్ కదమ్ పర్ లడ్‌నా సీకో''.

బతకాలంటే చావడం ఎలాగో నేర్చుకో.

ప్రతి అడుగులోనూ పోరాడటం నేర్చుకో.

* * *

రెండేళ్ల క్రితం 'అర్జున్‌రెడ్డి' సినిమా ట్రైలర్ ఎంత వైరల్ అయిందో.. ఇప్పుడు 'జార్జిరెడ్డి' ట్రైలర్ అలాగే యూత్‌ని ఊపేస్తోంది. అర్జున్‌రెడ్డి లవ్ స్టోరీ. జార్జిరెడ్డి వార్ స్టోరీ. పేదరికంపై వార్. ప్రైవేటీకరణపై వార్. అగ్రవర్ణ ఆధిపత్యంపై వార్. ఉత్తమాటలపై వార్. చెత్త రాజకీయాలపై వార్. సమసమాజ స్థాపనే ధ్యేయంగా జీవించి, పోరాడి, అమరుడైన విద్యార్థి ఉద్యమ నాయకుడు జార్జిరెడ్డిపై ఈ సినిమాను తీస్తున్నది జీవన్‌రెడ్డి ('దళం'ఫేమ్). జార్జిరెడ్డిగా నటిస్తున్నది సందీప్ మాధవ్ ('వంగవీటి' ఫేమ్).

ఇది హిట్ కొట్టేలా కనిపిస్తోంది. కొట్టాలి.

కిచెన్ గార్డెనింగ్



# పెంచడం ఎలా?

పెరటితోట.. నగర జీవితాల్లో దాదాపుగా అంతరించిపోయిందనే చెప్పాలి. ఇంటి నిర్మాణం కొలతలు అడుగుల్లోకి వచ్చిన తర్వాత ఇంటి ముందు పూలమొక్కలు, ఇంటి వెనుక కూరగాయల మొక్కలు అనే ఆశ అందని ద్రాక్షగానే మిగిలింది. అయినప్పటికీ మనసుంటే మార్గమూ ఉంటుంది. నేలలో జానెడు జాగా కూడా లేకపోయినా సరే... బాల్కనీలు, ఇంటి పైకప్పు మీద అన్ని రకాల మొక్కలనూ నాటుకోవచ్చు.

**ఇరవై రోజుల్లో కోతకు!**

పెరటితోటను ఆకుకూరలతో మొదలు పెడితే బాగుంటుంది. గింజలు చల్లిన ఇరవై ఐదు రోజుల నుంచి కోసుకోవచ్చు. మొదటిసారి కోసిన తర్వాత పది నుంచి పదిహేను రోజుల్లో రెండవ కోత కోసుకోవచ్చు. తోటకూర, పాలకూర, మెంతికూర... ఇలా ఏదైనా సరే మూడు నుంచి నాలుగు కోతలు వస్తాయి.

**ఎలా నాటుకోవాలి?**

టెర్రస్ మీద ఇటుకలతో మడిని తయారు చేసుకోవాలి. ఇటుకలను రెండు వరుసలుగా ఒకదాని మీద ఒకటి పేర్చి ఆపైన పాలిథిన్ షీట్ పరవాలి. షీట్ మీద ఆరు నుంచి తొమ్మిది అంగుళాల మందాన మట్టిని చదునుగా సర్దాలి. ఆ తర్వాత గింజలు చల్లాలి. గింజలను మరీ లోతుగా చల్లకూడదు, గింజ మందానికి రెండింతల లోతు ఉండాలి. గింజలు చల్లిన తర్వాత రోజూ ఒకటి లేదా రెండు సార్లు నీటిని చల్లాలి. మొలక వచ్చే వరకు పై పొర తేమగా ఉండాలి. తడి ఆరిపోయి మట్టి పై పొర బిగుసుకుపోతే మొలక పైకి చొచ్చుకుని రాలేదు. టెర్రస్ మీద సాధ్యం కాకపోతే ఆకు కూరలను కుండీల్లో కూడా పెంచుకోవచ్చు.

ఈ రౌండ్‌లో మట్టి పోసి, గింజ ఎంత మందం ఉందో అంతకు రెండింతల లోతులో గింజలు నాటాలి.



స్త్రీ శక్తి

# డైనమిక్ డాక్టరమ్మ

**గర్భిణి ప్రసవ వేదనతో హాస్పిటల్‌కు వస్తే "డాక్టర్‌లు సమ్మె చేస్తున్నారు. ప్రైవేట్ హాస్పిటల్‌కి తీసుకెళ్లండి" అని పేషెంట్‌ని నిర్దాక్షిణ్యంగా పంపించేసిన ఉదంతాలనే చదువుతుంటాం. అయితే ఇందుకు పూర్తి భిన్నంగా స్పందించారు మేఘాలయలోని డాక్టర్ బాల్‌నామ్‌చి సంగ్మా. అంబులెన్స్ నడిపేందుకు డ్రైవర్ అందుబాటులో లేకపోవడంతో పెద్దాసుపత్రివరకు తనే బండి నడిపి గర్భిణి ప్రాణాలు కాపాడారు.**

మేఘాలయలోని వెస్ట్ గారో హిల్స్‌లో గారోబదా ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో డాక్టర్ ఆమె. తమ హాస్పిటల్‌కి వచ్చిన పేషెంట్‌కి నొప్పులు మొదలయ్యాయి. ఆమెకు స్కానింగ్ టెస్ట్‌లో అంచనా వేసిన తేదీ కంటే ముందుగానే కాన్పు నొప్పులు మొదలయ్యాయి. ఆమెను తురా పట్టణంలోని మెటర్నిటీ అండ్ చైల్డ్ హాస్పిటల్‌కు చేర్చాల్సిన అవసరాన్ని గుర్తించారు డాక్టర్‌లు. పేషెంట్ బంధువులకు అదే మాట చెప్పారు. అయితే పేషెంట్‌ను పెద్దాసుపత్రికి చేర్చే నాథుడు లేడు. అత్యవసర వైద్య సేవలు అందించాల్సిన 108 సర్వీస్ ఉద్యోగులు సమ్మెలో ఉన్నారు. ఆ హాస్పిటల్‌కి ఒక అంబులెన్స్ కూడా ఉంది. కానీ ఆ డ్రైవర్ ఆ రోజు సెలవులో ఉన్నాడు. వాహనం ఉంది కానీ నడిపే వాళ్లు లేరు. ''ప్రైవేట్ వాహనం తెచ్చుకుని పేషెంట్‌ని తీసుకెళ్లండి'' అని చెప్పడానికి డాక్టర్ సంగ్మాకి నోరు రాలేదు. వాళ్లు అంత ఖర్చును భరించలేరని వాళ్లను చూస్తేనే తెలుస్తోంది. అలాంటప్పుడు అంబులెన్స్ అందుబాటులో ఉండి, తనకు డ్రైవింగ్ వచ్చి ఉండి, లైసెన్స్ కూడా చేతిలో ఉండి... వాళ్లనలా వదిలించుకోవడానికి మనసొప్పలేదామెకి. అందుకే స్టెత్‌ని కోటు జేబులో పెట్టి, కోటును పక్క సీటుకు తగిలించి, డ్రైవింగ్ సీట్లో కూర్చున్నారామె. అంబులెన్స్ ప్రయాణం తురా పట్టణం వైపు మొదలైంది.



నొప్పులు పడుతున్న మహిళను కాన్పు కోసం పెద్దాసుపత్రికి తీసుకెళ్లేందుకు అంబులెన్స్‌ను నడుపుతున్న ప్రాథమిక వైద్య కేంద్రం డాక్టర్ బాల్‌నామ్‌చి సంగ్మా

**ఫోన్‌లో ఫొటోలు**

డాక్టర్ సంగ్మా ప్రయాణిస్తున్న దారిలో రోడ్ల మీద ఉన్న జనం దృష్టి ఆ అంబులెన్స్ మీద పడనే పడింది. వెంటనే చాలా మంది చేతిలో ఉన్న స్మార్ట్ ఫోన్‌లతో ఆ దృశ్యాన్ని క్యాప్చర్ చేశారు. అయితే వాళ్లకు విచిత్రంగా అనిపించిన సంగతి డాక్టర్ అంబులెన్స్ డ్రైవ్ చేస్తోందన్న విషయం కాదు. నిజానికి వాళ్లకెవరికీ ఆ సంగతి తెలియదు కూడా. స్థానికులను ఆశ్చర్యపరిచిన సంగతి.... అంబులెన్స్‌ని ఒక మహిళ నడుపుతోంది అని.

అంబులెన్స్ తురా చేరింది, గర్భిణికి సుఖ ప్రసవం అయింది. తల్లీ బిడ్డా క్షేమంగా ఉన్నారు. ఆలస్యం చేయకుండా సమయానికి తీసుకురావడంతో కాంప్లికేషన్‌లు ఏమీ తలెత్తలేదని చెప్పారు డెలివరీ చేసిన డాక్టర్లు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అయింది కూడా. సంగ్మా మాత్రం ''ఆ సమయానికి అవసరమైన పని చేశానంతే'' అంటున్నారు. ఈ నెల ఒకటో తేదీన జరిగిన ఈ సంఘటన ఈశాన్య రాష్ట్రం నుంచి దేశం నాలుగు మూలలకూ చేరడానికి నాలుగురోజులు పట్టింది.

– మను

మాష్ అప్

# చిత్రసీమ



చార్ల్స్ బ్రిటో



ఎమ్‌జీఆర్



కేఆర్ విజయ



సిల్క్ స్మిత

సృజన.. సృష్టిలో చిత్రాలన్నిటినీ పోగేసేదాకా ఊరుకోదు. కన్వాస్, బ్రష్ రెస్ట్ తీసుకుంటే కంప్యూటర్, ఫొటోషాప్ వర్క్ మోడ్‌లోకి వెళ్తాయి. సాంస్కృతిక పునరుజ్జీవన కాలానికి, 'పెరియారుమ్ పెరుమాళ్' సినిమా పోస్టర్‌కు ముడి పెడ్తాయి. విన్‌సెంట్ వాంగో ప్రపంచ ప్రఖ్యాత పెయింటింగ్ ''వీట్ ఫీల్డ్ విత్ సైప్రెసెస్'లో అమాయకమైన చిరునవ్వుతో సిల్క్ స్మిత ప్రత్యక్షమవుతుంది. ఎడ్వర్డ్ మూంక్ 'ది స్క్రీమ్'కి 'అధే కంగళ్' సినిమా జతకూడుతుంది. కత్సుషిక హొకుసై వేసిన 'ది గ్రేట్ వేవ్ ఆఫ్ కనగవా''లోకి 'ఉలగమ్ సుట్రుమ్ వాలిబన్' హీరో ఎమ్‌జీ రాంచంద్రన్ దూరిపోతాడు. ఎడ్వర్డ్ హోపర్ 'ఆటోమాట్' ముందు వెటరన్ నటి కేఆర్ విజయ ప్రత్యక్షమవుతారు చేతిలో టీ కప్పుతో.

ఇలా ఆ కాలం చిత్రాలతో బయోస్కోప్ బొమ్మలను జత చేసి విచిత్రాలు చేస్తున్న ఆ ఆర్టిస్ట్ పేరు చార్ల్స్ బ్రిటో. చైన్నై కుర్రాడు. ఇంజనీరింగ్ చదివాడు. సినిమా ఫీల్డ్‌లో కెరీర్ వెదుక్కున్నాడు.



పెరియారుమ్ పెరుమాళ్

'రెవలేషన్స్' అనే ఇండీ, తమిళ్ సినిమాతోపాటు కొన్ని షార్ట్ ఫిల్మ్స్‌కీ పనిచేశాడు. ఆర్ట్ మీదున్న ఆసక్తితో తర్వాత జేఎన్‌యూలోని ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ ఈస్తటిక్స్‌లో మాస్టర్స్ చేశాడు. ఓ వైపు సినిమాలకు పనిచేస్తూనే ఇలా మాష్ అప్ ఆర్ట్‌తో మ్యాజిక్స్ చేస్తున్నాడు. ''మాష్ అప్‌కి నేనేం కొత్తకాదు. హాలీవుడ్, బాలీవుడ్ సినిమాలతో చాలా మంది ఆర్టిస్ట్‌లు మాష్ అప్ చేస్తున్నారు. నేనైతే 'తబ్రేజ్' వర్క్స్‌తో ఇన్‌స్పైర్ అయ్యా. ఈ విషయాన్ని ట్విట్టర్‌లో పోస్ట్ చేశాను కూడా. తబ్రేజ్ వర్క్స్‌ని బయట కొనుక్కుంటున్నారు కూడా. నాకూ అలాంటి రిక్వెస్ట్‌లు వస్తున్నాయి. వాళ్ల పర్సనల్ ఫొటోగ్రాఫ్స్‌ని ఇలా వరల్డ్ ఫేమస్ పెయింటింగ్స్‌తో మాష్ అప్ చేసి ఇవ్వమని. సో.. నేను కూడా ఆ దిశగా ఆలోచిస్తున్నాను'' అంటున్నాడు చార్ల్స్ . ఒక దర్శకుడైతే ఏకంగా మూడువందల మాష్ అప్స్ చేసివ్వమని అడిగాడట. ''నా మాష్ అప్స్‌కి వచ్చిన డిమాండ్ నాకే ఆశ్చర్యంగా ఉంది. అందుకని ఎఫ్‌బీ, ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్స్ కూడా తెరిచా. ఫొటోగ్రాఫర్స్, సినిమా డైరెక్టర్స్ నుంచి ఒకటే కాల్స్ వస్తున్నాయి'' అని చెప్పాడు చార్ల్స్ బ్రిటో. చెప్పినట్టుగానే సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఈ మాష్ అప్స్ అన్నీ వైరల్ అవుతున్నాయట.

సాక్షి ఫ్యామిలీ
సినిమా
నల్లగొండ శుక్రవారం
11-10-2019



● నాగచైతన్య

## నాన్‌స్టాప్ ఎక్స్‌ప్రెస్

బ్రేక్ లేకుండా నెల పాటు షూటింగ్ చేయనున్నారట నాగచైతన్య. సాయిపల్లవితో కలిసి హైదరాబాద్ పరిసరాలను చుట్టేయనున్నారట. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో నాగచైతన్య, సాయి పల్లవి జంటగా ఓ సినిమా రూపొందనుంది. ప్రేమకథగా తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని ఏషియన్ సినిమాస్ సునీల్ నారంగ్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ఈ నెల 14నుంచి ప్రారంభం కానుంది. వరుసగా 30 రోజులపైనే ఓ షెడ్యూల్‌ను ప్లాన్ చేశారట చిత్రబృందం. ఈ షెడ్యూల్ మొత్తం హైదరాబాద్‌లోనే జరగనుందని తెలిసింది. మధ్యతరగతి ప్రేమకథగా ఈ చిత్ర కథాంశం ఉంటుందని సమాచారం.



● వెంకటేశ్వరరావు, సురేందర్‌రెడ్డి, తమన్నా, రామ్‌చరణ్, సుబ్బిరామి రెడ్డి, మురళీమోహన్, చిరంజీవి, 'దిల్' రాజు, బ్రహ్మాజీ, సాయిమాధవ్

# సైరాలాంటి సినిమాలు ఇంకా రావాలి

**- టి. సుబ్బరామిరెడ్డి**

''సైరా నరసింహారెడ్డి'లాంటి కథను ఎంచుకోవడమే పెద్ద సాహసం. ఇలాంటి సినిమాలు ఇంకా ఎన్నో రావాలి'' అన్నారు 'కళాబంధు', నిర్మాత టి. సుబ్బిరామి రెడ్డి. చిరంజీవి హీరోగా సురేందర్ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'సైరా నరసింహారెడ్డి'. రామ్ చరణ్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 2న విడుదలైంది. చిత్రబృందాన్ని టి. సుబ్బిరామి రెడ్డి సన్మానించి, మాట్లాడుతూ–''దాదాపు ఇరవై ఏళ్ల క్రితం చిరంజీవితో నేను 'స్టేట్‌రౌడీ' సినిమా నిర్మించాను. ఈ సినిమాను హిందీలో డబ్ చేస్తే సూపర్‌హిట్ సాధించింది. చరణ్‌లాంటి కుర్రాడు ఇంత పెద్ద సినిమా నిర్మించాడంటే ఆశ్చర్యంగా ఉంది'' అన్నారు. చిరంజీవి మాట్లాడుతూ– ''సైరా' సినిమా విజయం సాధిస్తుందని ధీమాగా చెప్పేవారు సుబ్బిరామిరెడ్డి. ఆయన కళాహృదయానికి చేతులెత్తి నమస్కరిస్తున్నా'' అన్నారు. ''సుబ్బిరామిరెడ్డిగారి ఫంక్షన్ లేకపోతే ఆ ఏడాది మాకు ఏదో వెలితిగా ఉంటుంది'' అన్నారు రామ్‌చరణ్. ''ఎక్కడ మంచి సినిమా ఉన్నా ఆ యూనిట్‌ని గౌరవించడం సుబ్బిరామిరెడ్డిగారి గొప్పతనం'' అన్నారు నిర్మాత అల్లు అరవింద్. ''తెలుగు చలన చిత్రపరిశ్రమకు అంతర్జాతీయంగా పేరు తెచ్చిన గొప్ప సినిమా 'సైరా'' అన్నారు నటుడు మురళీమోహన్. ''తెలుగువారందరూ గర్వపడేలా చేసిన చిరంజీవిగారు నిజంగా గ్రేట్'' అన్నారు నటుడు రాజశేఖర్. ''చిరంజీవిగారి కెరీర్‌లో ఇదొక మైలురాయి సినిమా'' అన్నారు నిర్మాత 'దిల్' రాజు. సురేందర్‌రెడ్డి, నటి తమన్నా, కెమెరామన్ రత్నవేలు, రచయితలు పరుచూరి వెంకటేశ్వరరావు, సాయి మాధవ్ బుర్రా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నటులు కృష్ణంరాజు, వెంకటేష్, దర్శకులు కోదండరామిరెడ్డి, క్రిష్, సుకుమార్, మెహర్ రమేష్, నిర్మాతలు అశ్వనీదత్, డి.సురేష్ బాబు, బోనీ కపూర్, కేఎస్ రామారావులతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## పంచ్ పడుద్ది

ఈ ఏడాది 'ఎఫ్ 2, గద్దలకొండ గణేష్' చిత్రాలతో సూపర్ హిట్స్ అందుకున్న వరుణ్ తేజ్ కొత్త చిత్రానికి గురువారం కొబ్బరికాయ కొట్టారు. ఈ సినిమాకి కిరణ్ కొర్రపాటి దర్శకత్వం వహిస్తున్నారు. నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో రెనసాన్స్ ఫిలింస్, బ్లూ వాటర్ క్రియేటివ్ పతాకాలపై సిద్ధు ముద్ద, అల్లు వెంకటేశ్ నిర్మిస్తున్న ఈ సినిమా హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి చిరంజీవి సతీమణి కొణిదెల సురేఖ కెమెరా స్విచ్ఛాన్ చేయగా, నటుడు నాగబాబు క్లాప్ ఇచ్చారు. అల్లు అరవింద్ గౌరవ దర్శకత్వం వహించారు. అల్లు అరవింద్, అల్లు బాబీ, సిద్ధు ముద్ద కలిసి వరుణ్ తేజ్, కిరణ్ కొర్రపాటిలకు స్క్రిప్ట్‌ను అందించారు. కిరణ్ కొర్రపాటి మాట్లాడుతూ– ''బాక్సింగ్ నేపథ్యంలో సాగే చిత్రమిది. వరుణ్‌గారు కథ వినగానే ఈ సినిమా చేయడానికి ఒప్పుకున్నారు. ఈ మూవీ కోసం అమెరికాకు వెళ్లి ప్రత్యేక శిక్షణ తీసుకుని చాలా మేకోవర్ అయ్యారు. డిసెంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే తెలియజేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: జార్జ్ సి.విలియమ్స్, సంగీతం: తమన్.ఎస్.



● కిరణ్ కొర్రపాటి, అల్లు అరవింద్, వరుణ్ తేజ్, సిద్ధు ముద్ద, అల్లు వెంకటేశ్

# ఆర్డీఎక్స్ లవ్ హిట్ కావాలి

**- వినాయక్**



● తేజస్ కంచెర్ల, వీవీ వినాయక్, పాయల్ రాజ్‌పుత్, శంకర్ భాను, సి. కల్యాణ్

''ఆర్.నారాయణమూర్తిగారికి నేను కనిపించినప్పుడల్లా 'నువ్వు హీరోగా చెయ్యి బాసూ' అనేవారు. నేను కూడా మొహమాటానికి చేస్తానని చెప్పేవాణ్ణి. నిజంగా తథాస్తు దేవతలు ఉన్నారేమో. హీరోగా నా సినిమా ప్రారంభమైంది. నారాయణమూర్తిగారికి థ్యాంక్స్. 'ఆర్డీఎక్స్ లవ్' సినిమా పోస్టర్స్ చూస్తుంటనే చాలా కొత్తగా ఉంది. ఈ సినిమాని 'ఆర్ఎక్స్ 100' అంత హిట్ చేయాలి'' అన్నారు వీవీ వినాయక్. ''ఆర్ఎక్స్ 100' ఫేమ్ పాయల్ రాజ్‌పుత్, తేజస్ కంచర్ల జంటగా శంకర్ భాను దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఆర్డీఎక్స్ లవ్'. రామ్ మునీష్ సమర్పణలో సి.కల్యాణ్ నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో పాయల్ రాజ్‌పుత్ మాట్లాడుతూ– ''ఆర్ఎక్స్ 100' లాంటి సక్సెస్ సాధించడానికి నాకు ఆరేళ్లు పట్టింది. ఆ కష్టమే నన్ను టాప్ టెన్ హీరోయిన్స్‌లో ఒకర్ని చేసింది. నా కెరీర్‌లో 'ఆర్డీఎక్స్ లవ్' ఓ మైలురాయి అవుతుంది'' అన్నారు. ''ఈ సినిమా పుట్టడానికి కారణం సత్యనారాయణ, ప్రవీణ్‌లే. ముందుగా ఈ సినిమాకి 'ట్రిపుల్ ఎక్స్ లవ్' అనే టైటిల్ అనుకున్నాను. పాయల్ చాలా గొప్పగా నటించింది'' అన్నారు సి.కల్యాణ్. ''సినిమా ఔట్‌పుట్ చూసిన తర్వాత దీన్ని నేనే డైరెక్ట్ చేశానా? అనిపించింది. అంత అద్భుతంగా ఈ చిత్రం రావడానికి కారణం సి.కల్యాణ్‌గారు'' అన్నారు శంకర్ భాను. తేజస్ కంచర్ల, నటుడు డా.వి.కె.నరేశ్, నటి తులసి, సినిమాటోగ్రాఫర్ రామ్ ప్రసాద్, ఆర్ట్ డైరెక్టర్ చిన్నా, పాటల రచయిత భాస్కరభట్ల తదితరులు పాల్గొన్నారు.

## బ్యూటిఫుల్



● నైనా

రామ్‌గోపాల్ వర్మ నుంచి వస్తున్న కొత్త చిత్రం 'బ్యూటిఫుల్'. ఆయన గతంలో తీసిన ఐకానిక్ మూవీ 'రంగీలా' కు ఇది ట్రిబ్యూట్. నైనా, సూరి జంటగా అగస్త్య మంజు దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కింది. ఇదివరకూ 'లక్ష్మీస్ ఎన్టీఆర్' చిత్రాన్ని వర్మతో కలసి దర్శకత్వం వహించారు అగస్త్య మంజు. ప్రస్తుతం 'బ్యూటిఫుల్' చిత్రం రామ్‌గోపాల్ వర్మ టైగర్ ప్రొడక్షన్‌పై నిర్మాణం జరుపుకుంది. టి. అంజయ్య సమర్పణలో టి. నరేశ్‌కుమార్, టి. శ్రీధర్ నిర్మించిన ఈ సినిమా ట్రైలర్‌ని బుధవారం విడుదల చేశారు. ''మా ట్రైలర్‌కు విశేష స్పందన లభిస్తోంది.. అందరూ వెరీ బ్యూటిఫుల్ అంటున్నారు' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం:రవి శంకర్, సాహిత్యం: సిరా శ్రీ.

## 22ఏళ్ల తర్వాత...



● ప్రకాశ్ రాజ్

మణిరత్నం దర్శకత్వంలో వచ్చిన 'ఇరువర్' (తెలుగులో ఇద్దరు) సినిమాలో కరుణానిధి పాత్రలో కనిపించారు నటుడు ప్రకాశ్ రాజ్. 22 ఏళ్ల తర్వాత మళ్లీ ఆయన కరుణానిధి పాత్రలో కనిపించనున్నారని సమాచారం. జయలలిత జీవితం ఆధారంగా ఏఎల్ విజయ్ దర్శకత్వంలో కంగనా రనౌత్ టైటిల్ రోల్ చేస్తున్న చిత్రం 'తలైవి'. ఈ సినిమాలో కరుణానిధి పాత్రలో ప్రకాశ్‌రాజ్ నటించనున్నారట. యంజీఆర్ పాత్రలో అరవిందస్వామి కనిపించనున్నారు. జయలలిత రాజకీయ ప్రస్థానంలో కరుణానిధి పాత్ర కీలకమైనది. దీపావళి తర్వాత రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ కానున్న ఈ సినిమాను శైలేష్ ఆర్. సింగ్, విష్ణు ఇందూరి నిర్మించనున్నారు.

## ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదు



● ఓబుల్ సుబారెడ్డి, సుకుమార్, శ్రీనాథ్ మాగంటి, కుమార్

''స్టూడెంట్ ఆఫ్ ద ఇయర్' పోస్టర్, ట్రైలర్ బాగున్నాయి. '1 నేనొక్కడినే, 100%లవ్' చిత్రాలకు కథ అందించిన హరి ప్రసాద్ ఈ సినిమాకు స్టోరీ అందించారంటే కథ ఎలా ఉంటుందో తెలుస్తోంది'' అన్నారు డైరెక్టర్ సుకుమార్. సంజయ్ ఇదామ, శ్రీనాథ్ మాగంటి, అహల్య సురేష్, ప్రియ ముఖ్య తారలుగా కరుణ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'స్టూడెంట్ ఆఫ్ ద ఇయర్'. రాహుల్ మూవీ మేకర్స్ పతాకంపై బి.ఓబుల్ సుబ్బారెడ్డి నిర్మించిన ఈ సినిమా ట్రైలర్‌ని సుకుమార్ విడుదల చేశారు. బి.ఓబుల్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ– ''మంచి సందేశం ఉన్న కథతో తీశాం. డబ్బు వస్తుందా? లేదా? అనే విషయాలు పక్కన పెడితే మంచి సినిమా తీశాననే సంతృప్తి ఉంది'' అన్నారు. ''ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదని మా సినిమాలో చెప్పాం'' అన్నారు కరుణ కుమార్. సీనియర్ జర్నలిస్ట్ ప్రభు మాట్లాడారు. ఈ చిత్రానికి సంగీతం: యాజమాన్య, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎమ్.కిషోర్, కెమెరా: సునీల్ కుమార్.ఎన్.



● అమలా పాల్

## డిజిటల్ ఎంట్రీ

ఎటువంటి పాత్రలోనైనా ఒదిగిపోగలరు నటి అమలాపాల్. ఇటీవల 'ఆమె' సినిమాలో అమల ఎంత బోల్డ్‌గా నటించారో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. తాజాగా అటువంటి బోల్డ్ పాత్రలోనే మరోసారి నటిస్తున్నారట ఆమె. హిందీ ఆంథాలజీ 'లస్ట్ స్టోరీస్' తెలుగులో కూడా రూపొందనుంది. హిందీలో నిర్మించిన రోనీ స్క్రూవాలాయే తెలుగులోనూ నిర్మిస్తున్నారట. ఇందులో నాలుగు విభాగాలు ఉంటాయి. ఓ భాగంలో నటి అమలాపాల్ నటిస్తుండగా, 'ఓ బేబి' ఫేమ్ నందినీ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారని టాక్. జగపతిబాబు ఓ కీలక పాత్రధారి. ఈ ఆంథాలజీలోని మిగిలిన విభాగాలకు సందీప్‌రెడ్డి వంగా, సంకల్ప్ రెడ్డి, తరుణ్ భాస్కర్ దర్శకత్వ బాధ్యతలు చేపట్టారని సమాచారం. కాగా అమలా పాల్ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో నటిస్తుండటం ఇదే తొలి సారి కావడం విశేషం.

## ప్రేమలో కొత్త కోణం



● గరిమ, రమేష్

రమేష్ కుర్మాపు, గరిమా సింగ్ జంటగా నటిస్తున్న చిత్రం 'కైలాసపురం కింగ్స్'. కులదీప్ రాజన్ దర్శకత్వం వహిస్తున్నారు. క్రౌండ్ ఫండింగ్‌తో తెరకెక్కుతోన్న ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. రాజ్ కందుకూరి మాట్లాడుతూ–''ఈ సినిమా చూశాను. వైజాగ్ నేపథ్యంలో జరిగే మాస్ ఎంటర్‌టైనింగ్ చిత్రమిది'' అన్నారు. ''మాస్ ప్రేక్షకులకు ఈ సినిమా బాగా నచ్చుతుంది'' అన్నారు కులదీప్. ''పక్కా మాస్ ఎంటర్‌టైనర్ ఇది'' అన్నారు రమేష్. ''ప్రేమలోని కొత్త కోణాన్ని దర్శకుడు చక్కగా ఆవిష్కరించారు'' అన్నారు గరిమా సింగ్. ''ఈ సినిమాతో రమేష్‌కి ఇంకా మంచి పేరు వస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు సందీప్. నిర్మాతలు రిజ్వాన్, తేజ్ వైజాగ్ పాల్గొన్నారు.

## విద్యార్థుల సమస్యలపై పోరాటం

ఉస్మానియా యూనివర్సిటీ స్టూడెంట్ లీడర్ జార్జిరెడ్డి కథను 'జార్జిరెడ్డి' పేరుతో వెండితెరపైకి తీసుకొస్తున్న సంగతి తెలిసిందే. 'వంగవీటి' ఫేమ్ సందీప్ మాధవ్ టైటిల్ రోల్ చేస్తున్నారు. జీవన్ రెడ్డి దర్శకత్వంలో అప్పిరెడ్డి నిర్మించారు. సత్యదేవ్, మనోజ్ నందన్, చైతన్య కృష్ణ, వినయ్ వర్మ కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్ర థియేట్రికల్ రైట్స్‌ను అభిషేక్ పిక్చర్స్ బ్యానర్ అధినేత అభిషేక్ నామా సొంతం చేసుకున్నారు. ఈ ఏడాది 'ఇస్మార్ట్ శంకర్, రాక్షసుడు' సినిమాలను అభిషేక్ పిక్చర్స్ డిస్ట్రిబ్యూట్ చేసింది. ''జార్జిరెడ్డి' ట్రైలర్‌కు మంచి స్పందన వస్తోంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: సురేశ్ బొబ్బిలి, కెమెరా: సుధాకర్ యెక్కంటి.



● సందీప్

## ప్రేమంటే ప్రమాదం



● సాయిశ్రీవి

రవిచంద్ర, యుగా యుగేష్, సాయిశ్రీవి ముఖ్య పాత్రల్లో రాజ్‌కింగ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఇష్క్ ఈజ్ రిస్క్'. ఎస్.చంద్రశేఖర్ నిర్మించిన ఈ సినిమా పాటలను విడుదల చేశారు. నిర్మాత చంద్రశేఖర్ మాట్లాడుతూ– ''మా టీమ్ అంతా కష్టపడ్డాం అని అందరూ అంటున్నారు. ఎవరెంత కష్టపడ్డామన్నది సినిమా చూసి ప్రేక్షకులే నిర్ణయించాలి'' అన్నారు. ''ప్రతిభ ఉన్న దర్శకుడికి సరైన నిర్మాత కుదిరితే మంచి సినిమా వస్తుంది. అలా కుదిరిన సినిమాయే 'ఇష్క్ ఈజ్ రిస్క్'' అన్నారు సీనియర్ దర్శకుడు సాగర్. ''నాకు ఈ అవకాశం ఇచ్చిన దర్శక–నిర్మాతలకు ధన్యవాదాలు'' అన్నారు రవిచంద్ర. ''హాస్యానికి పెద్ద పీట వేసిన చిత్రమిది. అందరికీ నచ్చుతుందనుకుంటున్నా'' అన్నారు దర్శకుడు రాజ్‌కింగ్.

## డిష్యుం డిష్యుం



● టైగర్ ష్రాఫ్

బాలీవుడ్‌లో యాక్షన్ హీరోగా టైగర్ ష్రాఫ్‌కు మంచి పేరుంది. అందుకు తగ్గట్టే ఎప్పటికప్పుడు కొత్త కొత్త యాక్షన్ స్టంట్స్‌ను చేస్తూ ప్రేక్షకులకు కిక్ ఇస్తుంటారాయన. తాజాగా టైగర్ ష్రాఫ్ హీరోగా నటిస్తున్న 'భాగీ 3' సినిమా కోసం దాదాపు 400 కార్లు ఉండే ఓ జంక్‌యార్డ్‌లో విలన్స్‌ను రఫ్ఫాడిస్తున్నారట టైగర్. ముంబైలో జరుగుతున్న ఈ యాక్షన్ సీన్ సినిమాకు హైలైట్‌గా ఉంటుందట. ఈ షూటింగ్ సెట్‌ను రెడీ చేయడానికి టీమ్ 15 రోజులు కష్టపడ్డారు. అహ్మద్‌ఖాన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో శ్రద్ధాకపూర్ కథానాయికగా నటిస్తున్నారు. టైగర్ ష్రాఫ్ అన్న పాత్రలో పోలీసాఫీసర్‌గా రితేష్ దేశ్‌ముఖ్ నటిస్తున్నారు. ముంబై షెడ్యూల్ తర్వాత 'భాగీ 3' బృందం నవంబరులో సెర్బియా వెళ్లనుంది. ఈ సినిమాను వచ్చే ఏడాది మార్చిలో విడుదల చేయనున్నారు.



నైజాం : ఏషియన్ ఫిలింస్, వైజాగ్ : మోహిని ఫిలింస్
మిగతా ఏరియాలకు సంప్రదించండి : 9620000197/9553922940

ఫ్యాషన్

# సేమ్ టు సేమ్

**ఇంట్లో పెద్దవాళ్లు కొత్త డ్రస్ వేస్తే వారికి మాత్రమే కళ. పిల్లలు వేస్తే ఇంటికే కళ. అన్నా చెల్లెలు, అక్కా తమ్ముడు ఉన్నప్పుడు ఒకే కాంబినేషన్‌లో డ్రస్ డిజైన్ చేసుకోవచ్చు. సేమ్ టు సేమ్‌గా వారు తిరుగుతూ ఉంటే సంబర పడవచ్చు. మురిసిపోవచ్చు. పండగలకు, పార్టీలకు ట్రై చేయండి.**





**పార్టీకి తగిన డ్రెస్..** పది పదిహేనేళ్ల క్రితంతో ఇప్పటి పిల్లలను పోల్చలేం. మారుతున్న పార్టీ కల్చర్ పిల్లలను కూడా అందంగా తీర్చేలా ఫ్యాషన్ పరిశ్రమ ఆసక్తి చూపుతుంది. పిల్లలకు అనగానే బర్త్ డే పార్టీలు గుర్తుకు వస్తాయి. అయితే, ఇప్పుడు పిల్లలకు కూడా థీమ్ పార్టీలు, ఫన్‌జోన్స్ పెరిగాయి. సంప్రదాయ వేడుకలకు మాత్రమే కాకుండా సందర్భానుసారం పిల్లలకు సూటయ్యే డిజైనర్ వేర్స్ పట్ల ప్రాముఖ్యం పెరిగింది. పిల్లలు కూడా వాళ్లకు నప్పే డ్రెస్సులు ఎంపిక చేసుకుంటున్నారు. బాగా తయారవడం పట్ల ఆసక్తి చూపుతున్నారు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని డిజైన్ చేసి డ్రెస్సులివి.



**మంగారెడ్డి**
ఫ్యాషన్ డిజైనర్
mrstitchingsolutions@gmail.com

పండగల సీజన్ కాబట్టి కలర్‌ఫుల్‌గా ఉండే డ్రెస్సులు వేసుకుంటే పిల్లలు మరింత అందంగా కనిపిస్తారు. గోల్డ్ షిమ్మరీ ఫ్యాబ్రిక్ లెహెంగాకి ఎరుపు రంగు బ్రొకేడ్‌ను పెద్ద అంచుగా వేశారు. టాప్ నెక్‌కి ఎరుపు రంగులో సన్నగా థ్రెడ్ వర్క్, మిర్రర్ వర్క్ చేశారు. లెహంగా అంచు పోల్కా డాట్స్‌లా ఉంది కాబట్టి లెహెంగా టస్సెల్స్ కూడా అలాగే డిజైన్ చేశారు. దీంతో పండగ మరింత కళగా మారిపోతుంది.
అబ్బాయికి బంధ్‌గల కుర్తా దానికి చైనీస్ కాలర్ నెక్, స్టోన్ వర్క్ ఉన్న బటన్స్ వాడారు. హెవీగా లేకుండా బ్రైట్‌గా ఉండేలా డిజైన్ చేశారు. ఈ కాంబినేషన్ ప్లెయిన్‌గా ఉన్నా వేడుకలో బ్రైట్‌గా వెలిగిపోతుంది.



ప్రింటెడ్ షెర్వానీ అమ్మాయిలకే కాదు అబ్బాయిలకూ బాగా నప్పుతుంది. ఏ వేడుకకైనా ధరించవచ్చు. ముఖ్యంగా యానిమల్స్, బర్డ్స్, ఫ్లవర్స్, తీగలతో ఉన్న ప్రింట్లు మరింత అందంగా ఉంటాయి. ప్రింటెడ్ సిల్క్ ఫ్యాబ్రిక్‌తో టాప్‌ను డిజైన్ చేసి, దీనికి లినెన్ కుర్తా, ట్రౌజర్ వేయాలి. వైట్ స్టోన్స్‌తో కుర్తా బటన్స్ సెట్ చేయాలి. అమ్మాయికి లినెన్ టాప్, ట్రౌజర్‌కి ప్రింటెడ్ ఫ్యాబ్రిక్‌తో ఖఫ్తాన్ డిజైన్ చేయాలి.







పిల్లల డ్రెస్సులకు ఎక్కువ ఎంబ్రాయిడరీ ఉంటే వాళ్లు చిరాకు పడతారు. అలాగని రిచ్‌నెస్ ఏ మాత్రం తగ్గకూడదు. అందుకని సెమీ సిల్క్ ఫ్యాబ్రిక్ మీద థ్రెడ్, జరీతో మిషన్ ఎంబ్రాయిడరీ చేసి ఈ లెహంగాను డిజైన్ చేశారు. హాఫ్ వైట్ గోల్డ్ పింక్‌లో లెహంగా ఉంది కాబట్టి మల్టీకలర్ షిఫాన్ క్లాత్‌కి లేయర్స్ వచ్చేలా టాప్‌ని డిజైన్ చేశారు. థ్రెడ్ ఎంబ్రాయిడరీ కాబట్టి బరువు ఉండదు. దీని వల్ల పిల్లలకు సౌకర్యంగా ఉంటుంది.
ఈ లెహంగాను పోలిన కోటును అబ్బాయికి డిజైన్ చేశారు. ప్లెయిన్ రా సిల్క్ కుర్తా, శాటిన్ పటియాల వాడారు. ఏ వేడుకకైనా ఇలా ఇద్దరూ ఒకే తరహా డ్రెస్ వేసుకుంటే చూడ్డానికి ముచ్చటగా ఉంటుంది.





బ్లూ కలర్ సిల్క్ ప్రింటెడ్ క్లాత్ కింద పల్చటి స్పాంజ్ మెటీరియల్.. దానికింద లైనింగ్ క్లాత్ వేసి, చెక్స్ వచ్చేలా కుట్టాలి. దీనిని క్విల్ట్ అంటారు. ఈ మెటీరియల్‌తో పాపకు టాప్, వెయిస్ట్ కోట్ డిజైన్ చేశారు, దీనికి కాంబినేషన్‌గా బాబుకు షార్ట్ పటియాలా, కుర్తా, పాపకు స్కర్ట్ డిజైన్ చేశారు. త్రీ లేయర్స్‌గా డిజైన్ చేసిన స్కర్ట్‌కి షేడ్స్ ఎక్కువ ఉన్న సెల్ఫ్ మోటిఫ్స్ ఫ్యాబ్రిక్‌ను అంచుగా జత చేశారు.



ఈ డ్రెస్ కాంబినేషన్ పండగల కోసం ప్రత్యేకంగా డిజైన్ చేసింది. అబ్బాయికి.. గోల్డ్ టిష్యూ ఫ్యాబ్రిక్ పైన లేత రంగు గులాబీలను మిషన్ ఎంబ్రాయిడరీ చేసి, పొట్లి బటన్స్ చేశారు. దీనికి గోల్డ్ కలర్ చుడీ ఇచ్చారు. అమ్మాయికి హాఫ్‌వైట్ చందేరీ ఫ్యాబ్రిక్ పైన గోల్డ్ కలర్ జరీ, సీక్వెన్స్‌తో మిషన్ ఎంబ్రాయిడరీ చేసి ఆలోవర్ ఫ్యాబ్రిక్‌తో లెహంగా అండ్ క్రాప్ టాప్ కుట్టి, దాని పైన నెక్‌లైన్‌ని హైలైట్ చేయడం కోసం హ్యాండ్ ఎంబ్రాయిడరీతో సీక్వెన్స్, జరీతో నెక్‌లైన్ ఎంబ్రాయిడరీ చేశారు. ఫ్రిల్స్ ఇప్పుడు ఫ్యాషన్‌లో ముందున్నాయి కాబట్టి కుచ్చులతో గోల్డ్ కలర్ దుపట్టాను డిజైన్ చేశారు.

నిర్వహణ:
**నిర్మలారెడ్డి**

## స్లీప్ కౌన్సెలింగ్స్

### మీటింగ్స్‌లోనూ నాకు తెలియకుండానే నిద్రలోకి...

**నా వయసు 33 ఏళ్లు. ఒక మంచి కార్పొరేట్ సంస్థలో ఉద్యోగిని. నా నిద్రపై నాకు ఎలాంటి నియంత్రణా ఉండటం లేదు. మీటింగ్స్‌లో పాల్గొంటున్నప్పుడూ, తింటున్నప్పుడు కూడా నాకు తెలియకుండానే నిద్రలోకి జారిపోతున్నాను. దీని వల్ల నాకు చాలా ఇబ్బందులు వస్తున్నాయి. నా సమస్యకు పరిష్కారం చూపండి.**
**– డి. రవికుమార్, హైదరాబాద్**

మీరు చెబుతున్న దాన్ని బట్టి మీరు నార్కొలెప్సీ అనే నిద్ర సంబంధమైన రుగ్మతతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. నార్కొలెప్సీ అనే సమస్యలో నిద్ర, మెలకువ రావడం... ఈ రెండూ ప్రభావితమవుతాయి. ఇలాంటి సమస్య ఉన్నవారు పగటివేళ కూడా నిద్రలోకి జారిపోతుంటారు. ఏ పని చేస్తున్నా ఆ సమయంలో తమకు తెలియకుండానే నిద్రలోకి వెళ్లిపోతుంటారు.
సాధారణంగా నిద్రలో దశలు కొన్ని సైకిల్స్‌లో నడుస్తుంటాయి. అంటే ప్రారంభ దశ తర్వాత గాఢ నిద్ర దశ, ఆ తర్వాత కనుపాపలు వేగంగా కలిదే దశ... ఇలాగ. కనుపాపలు వేగంగా కలిదే దశను ర్యాపిడ్ ఐ మూవ్‌మెంట్ (ఆర్‌ఈఎమ్) నిద్ర దశగా పేర్కొంటారు. నార్కొలెప్సీతో బాధపడేవారిలో నిద్రలోకి జారుకున్న వెంటనే ఆర్‌ఈఎమ్ నిద్ర దశ వేగంగా వచ్చేస్తుంది. ఈ ఆర్‌ఈఎమ్ దశలోనే మనకు కలలు వస్తుంటాయి. ఈ దశలో కనుపాపలు, ఊపిరితిత్తులను పనిచేయించే డయాఫ్రమ్ తప్ప మిగతా అన్ని కండరాలూ పూర్తిగా అచేతన స్థితిలో ఉంటాయి.
నార్కొలెప్సీ సాధారణంగా 15 నుంచి 25 ఏళ్ల వయసరులో మొదలవుతుంది. అయితే అది ఏ వయసువారిలోనైనా కనిపించే అవకాశం ఉంది. నార్కొలెప్సీ ఎందుకు వస్తుందనే అంశం ఇంకా తెలియదు. అయితే ఇది జన్యువులతో ముడిపడి ఉన్నందున చాలామందిలో నార్కొలెప్సీతో బాధపడేవారి పిల్లల్లో ది కనిపించడాన్ని పరిశోధకులు గమనించారు. ఇక మరికొందరు శాస్త్రవేత్తలు పేర్కొన్నదాని ప్రకారం మెదడులోని హైపోక్రెటిన్ అనే రసాయన లోపం వల్ల ఈ సమస్య రావచ్చు. ఈ సమస్య ఉన్నవారిలో ఆర్‌ఈఎమ్ దశకు సంబంధించిన సైకిల్‌ను కొనసాగించే మెదడులో పాలు ఉన్నట్లుగా శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ లోపాల వల్లనే మెలకువగా ఉండగానే అకస్మాత్తుగా నిద్రలోకి జారుకునే లక్షణాలు కనిపిస్తాయని వారి పరిశోధనల్లో తేలింది. అయితే నాడీవ్యవస్థకు చెందిన ఒకటి కంటే ఎక్కువ అంశాలు నార్కొలెప్సీని కలగజేస్తాయని అధ్యయనవేత్తలు పేర్కొంటున్నారు. నార్కొలెప్సీ వచ్చినప్పుడు మనం చేతనావస్థలో ఉపయోగించే కండరాలు అకస్మాత్తుగా అచేతనం అయిపోతాయి. మాటకూడా ముద్దముద్దగా వస్తుంది. బాధితులు కొన్ని రకాల భ్రాంతులకూ గురికావచ్చు. దీనికి పూర్తిగా చికిత్స లేకపోయినా కొన్ని యాంటీడిప్రసెంట్స్, యాంఫిటమైన్ మందులతో దీనికి చికిత్స చేయవచ్చు.



### ఈ వయసులోనే రాత్రంతా నిద్ర ఉండటం లేదు

**మా అబ్బాయి వయసు 13 ఏళ్లు. ఏడో తరగతి చదువుతున్నాడు. మేం ఎంతగా నిద్రపుచ్చడానికి ప్రయత్నించినా రాత్రివేళ త్వరగా పడుకోవడం లేదు. ఒక్కోసారి ఒంటిగంట, రెండు గంటల వరకు మొబైల్‌లో గేమ్స్ ఆడుతూ ఉంటున్నాడు. లైట్లు ఆర్పేసినా వాడు నిద్రపోవడం లేదు. అదేమిటంటే నిద్రపట్టడం లేదని అంటున్నాడు. ఇలా నిద్రపోకపోవడం వల్ల వాడికి ఏదైనా నష్టమా? దయచేసి చెప్పండి.**
**– ఆర్. నవీన, గుంటూరు**

చిన్నపిల్లలకు నిద్ర చాలా అవసరం. పిల్లలు నిద్రలేమితో బాధపడుతుంటే అది భవిష్యత్తులో వారి ఆరోగ్యంపై తీవ్రమైన దుష్ప్రభావం చూపే అవకాశాలుంటాయి. ఈ వయసులో నిద్ర వల్ల వాళ్ల జ్ఞాపకశక్తి మరింత ఇనుమడిస్తుంది. నిద్రలో మన మెదడులో కొన్ని తరంగాలు లయబద్ధంగా కదులుతూ ఉంటాయి. వాటినే 'షార్ట్ వేవ్ రిపుల్స్' అంటారు. మనం ఏదైనా విషయాన్ని గుర్తుపెట్టుకున్నప్పుడు అది మరింతగా గుర్తుండిపోవడానికి కారణం ఈ తరంగాలే. 2009లో అమెరికన్, ఫ్రెంచ్ శాస్త్రజ్ఞులు నిర్వహించిన ఒక పరిశోధన ప్రకారం మన జ్ఞాపకాలు మన మెదడులోని హిప్పోక్యాంపస్ నుంచి మరో ప్రాంతం అయిన నియోకార్టెక్స్‌కు బదిలీ అయి... అక్కడ దీర్ఘకాలపు జ్ఞాపకాలుగా నిల్వ ఉంటాయి. మన మాటలో చెప్పాలంటే మన సిస్టమ్ (కంప్యూటర్)లో నిల్వ ఉంచుకోడానికి స్థలం సరిపోదని, ఏదైనా హార్డ్ డిస్క్‌లోకి డాటాను ట్రాన్స్‌ఫర్ చేసుకుంటాం కదా. అలాగన్నమాట. ఇక్కడ షార్ట్ టర్మ్ మెమరీగా ఉన్న జ్ఞాపకాలు... అక్కడ లాంగ్ టర్మ్ మెమరీస్‌గా మారి శాశ్వతంగా ఉంటాయి. అందుకు కారణమైన 'షార్ప్ వేవ్ రిపుల్స్' అన్నీ గాఢనిద్రలోనే సాధ్యమవుతాయి. అందుకే పిల్లలు చదివింది జ్ఞాపకం ఉండాలంటే వాళ్లకు కంటినిండా నిద్ర ఉండాలి. ఒకవేళ పిల్లల్లో తగినంత నిద్రలేకపోతే వారు భవిష్యత్తులో మానసిక సమస్యలకు లోనయ్యే ప్రమాదం ఉంది. డిప్రెషన్, యాంగ్జైటీ వంటి సమస్యలు వారిని చుట్టుముట్టే అవకాశం ఉంది. అందుకే నిద్రకు ముందు టీవీలో ఉద్వేగపరమైన సన్నివేశాలున్న సినిమాలు చూడనివ్వకండి. అలాగే మొబైల్స్, ల్యాప్‌టాప్‌ల వంటివి బ్లూ–లైట్‌ను వెదజల్లుతాయి. ఈ బ్లూ–లైట్ మెదడును ఉత్తేజితం చేసి, నిద్రపట్టకుండా చేస్తుంది. అందుకే నిద్రపుచ్చడానికి కనీసం మూడు గంటల ముందు నుంచి పిల్లలను ఈ ఉపకరణాలకు దూరంగా ఉంచండి. ఇక కాఫీ, కూల్‌డ్రింక్స్ వంటి కెఫిన్ ఉండే డ్రింక్స్ తాగనివ్వకపోవడం వల్ల మంచి నిద్రపడుతుంది. నిద్ర పట్టేలా చేసేందుకు రాత్రి మీ బాబుకు గోరువెచ్చని పాలు తాగించడం మంచిది. ఇందులో నిద్రను ప్రేరేపించే ట్రిప్టోఫాన్ అనే అమైనో యాసిడ్ ఉన్నందున అది నిద్రకు పురిగొల్పుతుంది. ఇవన్నీ చేశాక కూడా పిల్లలు నిద్రకు ఉపక్రమించడం లేదంటే ఒకసారి స్లీప్ స్పెషలిస్ట్‌ను కలవండి.

### నిద్రలో కాళ్లు ఎందుకలా కదులుతున్నాయి?

**మా అమ్మగారి వయసు వయసు 49 ఏళ్లు. ఆమె కొన్నేళ్లుగా డయాబెటిస్‌తో బాధపడుతోంది. ఈ మధ్య కాలంలో నిద్రలో ఆమె తన కాళ్లను చాలా వేగంగా కదిలిస్తూ ఉండటాన్ని మేం గమనించాం. ఎందుకలా జరుగుతోంది? దయచేసి వివరంగా చెప్పండి.**
**– ఎమ్. సుగుణాకర్‌రావు, చీరాల**

నిద్రలో ఇలా కుదుపుతున్నట్లుగా కాళ్లు వేగంగా కదిలించడాన్ని 'పీరియాడిక్ లింబ్ మూవ్‌మెంట్ డిజార్డర్ (పీఎల్‌ఎమ్‌డీ) అంటారు. మనం నిద్రపోతున్న సమయంలో మన ఊపిరితిత్తులు, డయాఫ్రమ్ కదలిక తప్ప ఒంట్లో మరే కదలికా సాధారణంగా కనిపించదు. కానీ పీఎల్‌ఎమ్‌డీ నిద్రలో కదలికలు ఉండేలా చేస్తుంది. ఇక్కడ 'పీరియాడిక్' అనే పదం కదలికలు ఎంత ఫ్రీక్వెన్సీతో వస్తున్నాయనేందుకు ఉపయోగిస్తారు. ఇవి క్రమబద్ధంగా ప్రతి 20 – 40 సెకండ్ల పాటు వస్తుంటాయి. పీఎల్‌ఎమ్‌డీ అనేది నిద్రకు సంబంధించిన వ్యాధి. దీనితో బాధపడేవారు రాత్రివేళ నిద్ర తక్కువ కావడం వల్ల పగలు మగతగా ఉంటారు. పీఎల్‌ఎమ్‌డీ అనేది ఏ వయసు వారిలోనైనా రావచ్చు. అయితే సాధారణంగా మధ్యవయస్కుల్లో ఇది ఎక్కువ. పీఎల్‌ఎమ్‌డీలో ప్రైమరీ, సెకండరీ అని రెండు రకాలున్నాయి. సెకండరీ పీఎల్‌ఎమ్‌డీ అనేది అంతర్గతంగా ఇతర వ్యాధులు ఉన్నవారిలో కనిపిస్తుంది. లేదా కొందరిలో దీనికి కారణం కూడా తెలియదు. మెదడు నుంచి కాళ్లు, చేతులకు వెళ్లే నరాల్లో సమస్యల వల్ల ఇది వస్తుందని తెలుసుకానీ, ఆ సమస్య లేమిటో ఇంకా పరిశోధనల్లో వెల్లడికాలేదు. సెకండరీ పీఎల్‌ఎమ్‌డీకి చాలా కారణాలు ఉన్నాయి. అవి... ₹ డయాబెటిస్ ₹ ఐరన్ లోపం ₹ వెన్నెముకలో కణుతులు ₹ వెన్నెముక దెబ్బతినడం ₹ స్లీప్ ఆప్నియా (గురక సమస్య) ₹ నార్కోలెప్సీ (క్రమమైన వేళల్లో నిద్రపట్టడం, నిద్రలేవడం జరగకపోవడం) ₹ యురేమియా (రక్తంలో యురియా, నైట్రోజన్ సంబంధిత వ్యర్థపదార్థాల పాళ్లు పెరగడం), రక్తహీనత మొదలైనవి.
పీఎల్‌ఎమ్‌డీతో బాధపడే చాలామందిలో కాళ్ల కదలికలు లేకుండా నిద్రపట్టకపోవడం, దాంతో పగటినిద్ర ఎక్కువగా ఉంటాయి. కొందరిలో ఒక కాలు, లేదా మరికొందరిలో రెండుకాళ్లూ కదులుతూ ఉండవచ్చు. దీని నిర్ధారణకు ప్రత్యేకంగా పరీక్షలేవీ లేకపోయినా, రక్తహీనత వంటి వాటి ద్వారా కారణాన్ని కొంతవరకు ఊహించవచ్చు. ఈ సమస్య ఉన్నవారికి బెంజోడయజిపైన్స్, క్లోనోజెపామ్, డోమమినెర్జిక్ ఏజెంట్స్, యాంటీకన్వల్జెంట్ ఏజెంట్స్, గాబా ఆగోనిస్స్ వంటి మందులతో చికిత్స చేయవచ్చు.

**డాక్టర్ రమణ ప్రసాద్**
కన్సల్టెంట్ స్లీప్ స్పెషలిస్ట్ అండ్ పల్మునాలజిస్ట్,
కిమ్స్ హాస్పిటల్స్,
సికింద్రాబాద్



ఫ్యామిలీ డాక్టర్

ఆభరణం

## చెవులకు మట్టి పూలు




**మ**నకు టెర్రకోట ఆభరణాల అందం పరిచయమే. ఇవి పాలిమర్ క్లేతో తయారయిన ఆభరణాలు. మిషన్ పై తయారైన పాలిమర్ క్లేను రకరకాల బొమ్మల తయారీలో వాడుతారు. ఇది మార్కెట్లో లభిస్తుంది. ఈ పాలిమర్ క్లేతో నచ్చిన మోడల్స్‌తో చెవి జూకాలు తయారుచేసుకోవచ్చు.
- ఏ మోడల్ ఆభరణం తయారుచేసుకోవాలో ముందే కలర్ కాంబినేషన్స్ చూసుకోవాలి
- చెవికి తగిలించే జూకా హుక్స్‌ను సిద్ధంగా ఉంచుకోవాలి
- ఎంపిక చేసుకున్న రంగు పాలిమర్ క్లేను తగిన పరిమాణంలో కట్ చేసుకోవాలి
- కట్ చేసిన క్లే ను జూకాల షేప్ తయారుచేసుకోవాలి. వాటికి హుక్స్ జత చేయాలి
- ఆ జూకాకి కాంట్రాస్ట్ కలర్ క్లేను సన్నని రేకులుగా కట్ చేసి, చిన్నా పెద్ద పువ్వులను డిజైన్ వచ్చేలా అతికించాలి
- ఆ పూల మధ్యలోనూ, జూకాల చుట్టూ చిన్న చిన్న పూసలు అతికించుకోవచ్చు
- జూకాలను ఇంకా సింగారించాలంటే బంగారు రంగు రింగ్స్‌ను జత చేస్తూ రంగు రంగు పూసలను వేలాడదీయవచ్చు. ఈ జూకాలు క్యాజువల్, పార్టీ వేర్ డ్రెస్సులకు మరింత అందాన్ని తెచ్చిపెడతాయి.



# స్క్రీన్ టెస్ట్



**18** 'నేను పెళ్లికి రెడీ' చిత్రంలో సంఘవి, లయ, అనితా హీరోయిన్లుగా నటించారు. వెంకీ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో హీరో ఎవరో తెలుసా?
ఎ) శ్రీకాంత్ బి) జగపతిబాబు
సి) జె.డి. చక్రవర్తి డి) శివబాలాజీ



**1** గతేడాది సంచలన విజయం సాధించిన చిత్రం 'మహానటి'. ఈ చిత్రంలో సావిత్రి పాత్రలో కీర్తీ సురేశ్ నటిస్తే సమంత రిపోర్టర్‌గా నటించారు. వీరు కాకుండా మరో హీరోయిన్ కూడా ఈ చిత్రంలో నటించారు. ఆమె ఎవరు?
ఎ) లక్ష్మీ మీనన్ బి) నివేదా థామస్
సి) మాళవికా నాయర్ డి) పార్వతీ మీనన్

**2** చిరంజీవి హీరోగా నటించిన చిత్రం 'అల్లుడా మజాకా'. ఆ చిత్రంలో రంభ, రమ్యకృష్ణ కథానాయికలు. చిరంజీవి చెల్లెలు పాత్రలో మరో హీరోయిన్ నటించారు. ఆమె పేరేంటి?
ఎ) అంకిత బి) ఊహ సి) మధుశాలిని డి) అమల

**3** 'హలోబ్రదర్' సినిమాలో సూపర్‌హిట్ సాంగ్ 'కన్నెపెట్టరో.. కన్ను కొట్టరో..'లో రంభ, ఇంద్రజతో పాటు మరో అందాల తారతో కలిసి స్టెప్పులేశారు నాగార్జున. ఆ హీరోయిన్ ఎవరు?
ఎ) సౌందర్య బి) రోజా సి) నగ్మా డి) ఆమని

**4** నాగచైతన్య తెలుగులో రీమేక్ చేసిన చిత్రం 'ప్రేమమ్'. ఆ చిత్రంలో ముగ్గురు హీరోయిన్లు నటించారు. తెలుగులో శ్రుతీహాసన్ చేసిన పాత్రను మలయాళంలో సాయిపల్లవి చేశారు. ఈ చిత్ర మలయాళ దర్శకుడు అల్ఫోన్సో పుతిరిన్. తెలుగు దర్శకుడెవరో కనుక్కోండి?



ఎ) ఐ.వి. ఆనంద్
బి) సుధీర్ వర్మ
సి) చందు మొండేటి
డి) చంద్రశేఖర్ ఏలేటి

**5** బాలకృష్ణ తన తండ్రి యన్టీఆర్ బయోపిక్ 'కథానాయకుడు'లో నటించారు. ఆ చిత్రంలో పలువురు కథానాయికలు నటించారు. సావిత్రి పాత్రలో నటించిన నటి ఎవరో తెలుసా?
ఎ) శ్రియ బి) రాధికా ఆప్టే సి) నిత్యామీనన్ డి) త్రిష

**6** ఎ.కోదండరామిరెడ్డి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'అల్లరి అల్లుడు'. ఆ చిత్రంలో మీనా, నగ్మా నాగార్జున సరసన నటిస్తే అత్త పాత్రలో మరో హీరోయిన్ నటించారు. అత్త పాత్రలకు ఫేమస్ అయిన ఆ నటి ఎవరు?
ఎ) జయచిత్ర బి) జయప్రద
సి) శారద డి) వాణిశ్రీ

**7** 'యమదొంగ' చిత్రంలో మమతా మోహన్‌దాస్, ప్రియమణిలు హీరోయిన్లు. వీరితో పాటు ఈ సినిమాలో హీరోయిన్ రంభ కూడా ఉన్నారు. ఓ పాటలో రంభ వేసుకున్న డ్రెస్‌ను యన్టీఆర్, అలీ ఆమె దగ్గర నుంచి కొట్టేస్తే వాళ్లకు పదిలక్షలు ఇస్తానంటాడు ఓ నటుడు. ఆయనెవరో తెలుసా?
ఎ) కృష్ణభగవాన్ బి) యం.యస్. నారాయణ
సి) బ్రహ్మానందం డి) ఏవీయస్

**8** త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'అత్తారింటికి దారేది' చిత్రంలో సమంత, ప్రణీతలు పవన్ కల్యాణ్‌కి మరదళ్లుగా నటించారు. ఆయన అత్త పాత్ర చేసిన నదియా 'బజారు రౌడి' చిత్రం ద్వారా తెలుగులోకి హీరోయిన్‌గా పరిచయం అయ్యారు. ఆ సినిమాలో హీరో ఎవరో తెలుసా?
ఎ) రమేశ్‌బాబు బి) మాదాల రవి
సి) రాజేంద్రప్రసాద్ డి) నరేశ్



**9** త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వం వహించిన చిత్రం 'సన్నాఫ్ సత్యమూర్తి'. ఆ చిత్రంలో ముగ్గురు ప్రముఖ హీరోయిన్లు నటించారు. వారిలో ఒకరు షుగర్ పేషెంట్‌గా నటించారు. ఎవరామె?
ఎ) అదాశర్మ బి) ప్రణీత
సి) సమంత డి) నిత్యామీనన్

**10** కొరటాల శివ దర్శకత్వంలో యన్టీఆర్ హీరోగా తెరకెక్కిన చిత్రం 'జనతా గ్యారేజ్'. ఈ చిత్రంలో సమంత, నిత్యామీనన్ హీరోయిన్లుగా నటించగా కాజల్ అగర్వాల్ 'పక్కా లోకల్..' అనే సూపర్‌హిట్ సాంగ్‌లో మెరిశారు. ఆ పాట రచయితెవరు?
ఎ) శ్రీమణి బి) రామజోగయ్య శాస్త్రి
సి) అనంత శ్రీరామ్ డి) సుద్దాల అశోక్‌తేజ

**12** మహేశ్‌బాబు హీరోగా శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో రెండు చిత్రాలు వచ్చాయి. వాటిలో మొదటిది 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు'. ఆ చిత్రంలో సమంత, అంజలి హీరోయిన్లుగా నటించారు. అందులో సమంత చెల్లెలి పాత్రలో నటించిన నటి ఆ తర్వాత 'ఐస్‌క్రీం' సినిమాతో హీరోయిన్‌గా ఫేమస్ అయ్యారు. ఆమె పేరేంటో తెలుసా?
ఎ) తేజస్విని మడివాడ బి) పూజిత పొన్నాడ
సి) ధన్యా బాలకృష్ణ డి) ఇషా రెబ్బా

**13** కృష్ణ హీరోగా నటించిన 'కురుక్షేత్రం' చిత్రంలో కుంతీదేవి పాత్రలో అంజలీదేవి, సుభద్రగా విజయనిర్మల, ఉత్తరగా జయప్రద నటించారు. ఆ చిత్రంలో ద్రౌపది పాత్రధారి ఎవరో తెలుసా?
ఎ) 'షావుకారు' జానకి
బి) జమున
సి) సావిత్రి
డి) కృష్ణకుమారి

**14** 'మన్మథుడు' చిత్రం 17 ఏళ్ల తర్వాత 'మన్మథుడు-2'గా తెరకెక్కింది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా రకుల్‌ప్రీత్ సింగ్ నటించారు. మరో ఇద్దరు హీరోయిన్లు సమంత, కీర్తీ సురేశ్ అతిథి పాత్రలు చేశారు. ఈ ముగ్గురూ కాకుండా ఆ చిత్రంలో నటించిన పాత తరం ప్రముఖ నటి ఎవరు?



ఎ) కాంచన
బి) రాజశ్రీ
సి) రాజసులోచన
డి) లక్ష్మీ

**15** 'భారతీయుడు' చిత్రంలో సుకన్య, మనీషా కొయిరాల, ఊర్మిళ నటించారు. ఆ సినిమా ఎంత పెద్ద విజయం సాధించిందో అందరికీ తెలిసిందే. ఆ చిత్ర నిర్మాతెవరో తెలుసా?
ఎ) కల్లైపులి యస్.థాను
బి) ఏ.యం. రత్నం
సి) దొర స్వామి రాజు
డి) డి. రామా నాయుడు

**16** బాలకృష్ణ హీరోగా బి. గోపాల్ దర్శకత్వంలో వచ్చిన సూపర్‌హిట్ చిత్రం 'సమర సింహారెడ్డి'. ఈ చిత్రంలో సిమ్రాన్, అంజలా జవేరిలతో పాటు మరో హీరోయిన్ నటించారు. ఆమె ఎవరు?
ఎ) ఆమని బి) అంకిత
సి) ఇంద్రజ డి) సంఘవి

**17** ఈవీవీ సత్యనారాయణ దర్శకత్వంలో జగపతిబాబు హీరోగా నటించిన చిత్రం 'చిలక్కొట్టుడు'. ఆ చిత్రంలో ఐదుగురు ప్రముఖ హీరోయిన్లు నటించారు. వారిలో బాంబేపాప పాత్రలో నటించిన నటి ఎవరో గుర్తుందా?
ఎ) నగ్మా
బి) సిమ్రాన్
సి) రమ్యకృష్ణ
డి) మీనా

**19** రవితేజ హీరోగా నటిస్తోన్న 'డిస్కోరాజా' చిత్రంలో నభానటేశ్, పాయల్ రాజ్‌పుత్, తాన్యా హోప్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీత దర్శకుడెవరో తెలుసా?
ఎ) దేవీశ్రీ ప్రసాద్ బి) ఎస్.ఎస్. తమన్
సి) జిబ్రాన్ డి) గోపీసుందర్

**20** బోయపాటి శ్రీను దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా నటించిన 'సరైనోడు' చిత్రంలో రకుల్‌ప్రీత్, క్యాథరిన్ హీరోయిన్లు. ఆ చిత్రంలో స్పెషల్ సాంగ్‌లో నటించిన హీరోయిన్ ఎవరో?
ఎ) శ్రుతీహాసన్ బి) అంజలి
సి) నయనతార డి) రెజీనా

నిర్వహణ:
శివ మల్లాల





**11** 'బాహుబలి' సినిమాలో రమ్యకృష్ణ, అనుష్కలతో పాటు మరో ప్రముఖ హీరోయిన్ నటించారు. ఆమె పేరేంటో తెలుసా?
ఎ) రకుల్‌ప్రీత్ సింగ్
బి) రాశీ ఖన్నా
సి) సాయి పల్లవి
డి) తమన్నా

మీరు 6 సమాధానాల కంటే తక్కువ చెబితే... మీకు సినిమా అంటే ఇష్టం
10 సమాధానాల వరకూ చెప్పగలిగితే... మీకు సినిమా అంటే ఇంట్రెస్ట్
15 సమాధానాల వరకూ చెప్పగలిగితే... మీకు సినిమా అంటే పిచ్చి
20 సమాధానాలూ చెప్పగలిగితే... ఇంకోసారి ఈ క్విజ్ చదవకండి!

సమాధానాలు: 1. (సి) 2. (బి) 3. (డి) 4. (సి) 5. (సి) 6. (డి) 7. (బి) 8. (ఎ) 9. (సి) 10. (బి) 11. (డి) 12. (ఎ) 13. (బి) 14. (డి) 15. (బి) 16. (డి) 17. (సి) 18. (ఎ) 19. (బి) 20. (బి)

# సంజూభాయ్ సర్‌ప్రైజ్



● సునీల్ శెట్టి, మంచు విష్ణు, సంజయ్ దత్

విష్ణు మంచు హీరోగా తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో తెరకెక్కుతోన్న తాజా చిత్రం 'కాల్‌సెంటర్'. కాజల్ అగర్వాల్, రుహానీ సింగ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. సునీల్ శెట్టి కీలక పాత్రలో కనిపించనున్నారు. జెఫ్రీ గీ చిన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో ఫుల్ స్పీడ్‌గా జరుగుతోంది. 'కాల్ సెంటర్' షూటింగ్ లొకేషన్‌కు బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్ సర్‌ప్రైజ్ ఎంట్రీ ఇచ్చారు. ఆ సందర్భంలో తీసిన ఫొటో ఇది. కాగా ఈ సినిమాలో సంజయ్ దత్ కూడా ఓ అతిథి పాత్రలో నటిస్తారని సమాచారం.

# భయపెట్టే వసంతకాలం

నయనతార లీడ్ రోల్‌లో నటించిన ఓ తమిళ సినిమాని 'వసంత కాలం' పేరుతో తెలుగులో అనువదిస్తున్నారు. చక్రి తోలేటి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో భూమిక, ప్రతాప్ పోతన్, రోహిణి హట్టంగడ్ ముఖ్య పాత్రల్లో నటించారు. సస్పెన్స్, హారర్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రాన్ని నిర్మాత దామెర వి.ఎస్.ఎన్. శ్రీనివాస్ తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ– ''గతంలో 'ఏకవీర, వేటాడు వెంటాడు' వంటి చిత్రాలను తెలుగులో విడుదల చేశాం. 'వసంత కాలం' డబ్బింగ్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. నవంబర్‌లో మూవీ రిలీజ్‌కి ప్లాన్ చేస్తున్నాం. తెలుగులోనూ ఈ సినిమా ఘన విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు.



● నయనతార

# మూడు సింహాలు



● రణ్‌వీర్ సింగ్, అక్షయ్ కుమార్, అజయ్ దేవగణ్

'కనిపించే మూడు సింహాలు నీతికీ, న్యాయానికి, ధర్మానికి ప్రతీకలైతే కనిపించని నాలుగో సింహమేరా పోలీస్' అంటూ 'పోలీస్ స్టోరీ' చిత్రంలో సాయికుమార్ చెప్పిన పవర్‌ఫుల్ డైలాగ్ ప్రేక్షకులకు ఎప్పటికీ గుర్తుంటుంది. అలాంటి పవర్‌ఫుల్ పోలీస్ పాత్రలతో కమర్షియల్ ఎంటర్‌టైనర్ సినిమాలు తెరకెక్కిస్తుంటారు బాలీవుడ్ డైరెక్టర్ రోహిత్ శెట్టి. గతంలో ఆయన దర్శకత్వంలో వచ్చిన సింగం (అజయ్ దేవగణ్), సింబ (రణ్‌వీర్ సింగ్) సినిమాలు బాక్సాఫీస్ దగ్గర స్ట్రిక్ట్ డ్యూటీ చేశాయి. ఇప్పుడు అక్షయ్‌కుమార్‌ను 'సూర్యవన్షీ' అనే సినిమాతో సూపర్ పోలీస్‌గా మార్చారు రోహిత్. అంతేకాదు.. సంఘ విద్రోహక శక్తులను మట్టి కరిపించడానికి ఈ మూడు సింహాలను ఒకే ఫ్రేమ్‌లోకి తీసుకొచ్చారాయన. 'సూర్యవన్షీ' సినిమా క్లైమాక్స్‌లో అక్షయ్, అజయ్, రణ్‌వీర్ కలిసి పోరాడనున్నారు. వచ్చే ఏడాది మార్చి 27న ఈ సినిమా విడుదల కానుంది.







సాక్షి స్పోర్ట్స్
శుక్రవారం
11-10-2019



మయాంక్

**తొలి సెషన్**
ఓవర్లు: 25, పరుగులు: 77, వికెట్లు: 1

**రెండో సెషన్**
ఓవర్లు: 28, పరుగులు: 91, వికెట్లు: 1

**మూడో సెషన్**
ఓవర్లు: 32.1,
పరుగులు: 105, వికెట్లు: 1

## పుణేలో

# మరో అంకం మొదలు

భారత్ టాస్ గెలవడం...ముందుగా బ్యాటింగ్...మూడుకు పైగా రన్‌రేట్‌తో పరుగులు...ఒక బ్యాట్స్‌మన్ శతకం...మరో ఇద్దరు ఆటగాళ్ల అర్ధ శతకాలు...తొలి రోజు శుభారంభం...సొంతగడ్డపై ఎన్నో ఏళ్లుగా టెస్టుల్లో సాధారణంగా కనిపించే ఈ దృశ్యం పుణేలోనూ పునరావృతమైంది. దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్ చేజిక్కించుకునే లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా రెండో టెస్టును కూడా తమదైన శైలిలో మొదలు పెట్టింది. మయాంక్ వరుసగా రెండో శతకంతో మెరవగా...కోహ్లి, పుజారా కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. వైజాగ్ టెస్టు హీరో రోహిత్ విఫలమైనా, భారత్‌కు ఎలాంటి సమస్య ఎదురు కాలేదు. ఆరంభంలో తమకు కాస్త అనుకూలించిన పిచ్‌పై దక్షిణాఫ్రికా పేసర్లు ప్రభావం చూపగలిగారు. అయితే ఫీల్డింగ్ వైఫల్యాలతో పాటు కొన్ని సార్లు అదృష్టం కూడా కలిసి రాకపోవడంతో తమకు దక్కిన మంచి అవకాశాలను ఆ జట్టు వృథా చేసుకుంది.

**గ**త మ్యాచ్‌లో డబుల్ సెంచరీతో సత్తా చాటిన మయాంక్ అగర్వాల్ అదే ఫామ్‌ను కొనసాగించాడు. దక్షిణాఫ్రికా బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్న అతను మరో శతకంతో ఆకట్టుకున్నాడు. 5 పరుగుల వద్ద ఎల్బీ కోసం సఫారీలు రివ్యూ కోరినా... అదృష్టవశాత్తూ అంపైర్ కాల్‌తో బతికిపోయిన భారత ఓపెనర్ ఆ తర్వాత కొన్ని చక్కటి షాట్లు ఆడాడు. నోర్జే వేసిన బంతి హెల్మెట్‌కు బలంగా తగిలి బౌండరీకి వెళ్లటంతో కొంత కంగారు పడ్డా...148 కిలోమీటర్ల వేగంతో వచ్చిన తర్వాతి బంతినే ఫోర్‌గా మలచి మయాంక్ బలంగా నిలబడటం విశేషం. ఆ తర్వాత నోర్జే మరో ఓవర్లో మయాంక్ మూడు ఫోర్లతో చెలరేగాడు. మహరాజ్ ఓవర్లోనూ వరుసగా రెండు ఫోర్లు కొట్టిన అతను ఈ క్రమంలో 112 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత కూడా మయాంక్ ధాటి కొనసాగింది. రెండు సెషన్లలోనూ అతడిని అడ్డుకోవడంలో సఫారీలు విఫలమయ్యారు. విరామం తర్వాత మహరాజ్ ఓవర్లో మయాంక్ నేరుగా కొట్టిన రెండు వరుస సిక్సర్లు అతని ఇన్నింగ్స్‌లో హైలైట్‌గా నిలిచాయి. దీంతో 99కు చేరుకున్న అతను... ఫిలాండర్ బౌలింగ్‌లో థర్డ్‌మ్యాన్ దిశగా కొట్టిన ఫోర్‌తో శతకం పూర్తి చేసుకున్నాడు. చివరకు రబడ బౌలింగ్‌లో స్లిప్‌లో ప్లెసిస్ చక్కటి క్యాచ్ పట్టడంతో అగర్వాల్ ఇన్నింగ్స్ ముగిసింది.



### రాణించిన పుజారా

**త**నదైన శైలిలో ఓపిగ్గా బ్యాటింగ్ చేసిన పుజారా సిరీస్‌లో వరుసగా రెండో ఇన్నింగ్స్‌లోనూ అర్ధ సెంచరీ సాధించాడు. 'సున్నా' వద్ద అతను ఇచ్చిన కష్టసాధ్యమైన క్యాచ్‌ను షార్ట్‌లెగ్‌లో బవుమా వదిలేశాడు. దీనిని పుజారా సమర్థంగా వాడుకున్నాడు. ఆరంభంలో 26 బంతులు ఆడి 6 పరుగులకే పరిమితమైన అతను మహరాజ్ ఓవర్లో వరుసగా రెండు ఫోర్లతో జోరు పెంచాడు. స్పిన్ బౌలింగ్‌లో చూడచక్కటి బౌండరీలతో అలరించిన పుజారా... ముత్తుసామి ఓవర్లో పుల్ షాట్‌తో సిక్స్ కూడా బాదాడు. మహరాజ్ ఓవర్లో కొట్టిన రెండు ఫోర్లతో 107 బంతుల్లో అతని హాఫ్ సెంచరీ పూర్తయింది. అయితే రబడ వేసిన బంతికి స్లిప్‌లో సఫారీ కెప్టెన్ పట్టిన క్యాచ్‌తో పుజారా పెవిలియన్ చేరాడు.

### రోహిత్ విఫలం

వైజాగ్ టెస్టులో రెండు ఇన్నింగ్స్‌లలోనూ సెంచరీలు బాదిన రోహిత్ ఇక్కడ కాస్త తడబడ్డాడు. ఫిలాండర్, రబడ కట్టుదిట్టమైన బౌలింగ్‌ను ఎదుర్కొనేందుకు శ్రమించిన అతను 29వ బంతికి గానీ బౌండరీ కొట్టలేకపోయాడు. ఆ వెంటనే రబడ వేసిన చక్కటి బంతిని ఆడలేక కీపర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు.


రబడ 3/48

**పుణే:** దక్షిణాఫ్రికాతో ప్రారంభమైన రెండో టెస్టులో తొలి రోజు భారత్ స్థాయికి తగ్గ బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చింది. గురువారం ఆట ముగిసే సమయానికి భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 85.1 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 273 పరుగులు చేసింది. మయాంక్ అగర్వాల్ (195 బంతుల్లో 108; 16 ఫోర్లు, 2 సిక్సర్లు) సెంచరీతో చెలరేగగా... కెప్టెన్ విరాట్ కోహ్లి (105 బంతుల్లో 63 బ్యాటింగ్; 10 ఫోర్లు), చతేశ్వర్ పుజారా (112 బంతుల్లో 58; 9 ఫోర్లు, 1 సిక్స్) కూడా రాణించారు. మయాంక్, పుజారా రెండో వికెట్‌కు 138 పరుగులు జోడించారు. సఫారీ బౌలర్లలో రబడకు 3 వికెట్లు దక్కాయి. ప్రస్తుతం క్రీజ్‌లో ఉన్న కోహ్లి, రహానే (18 బ్యాటింగ్) నాలుగో వికెట్‌కు అభేద్యంగా 75 పరుగులు జత చేశారు. వెలుతురు మందగించడంతో పూర్తి ఆట సాధ్యం కాలేదు. మరో 4.5 ఓవర్ల ముందుగానే అంపైర్లు ఆటను నిలిపివేశారు.

### స్కోరు వివరాలు

**భారత్ తొలి ఇన్నింగ్స్:** మయాంక్ (సి) డు ప్లెసిస్ (బి) రబడ 108, రోహిత్ (సి) డి కాక్ (బి) రబడ 14, పుజారా (సి) డు ప్లెసిస్ (బి) రబడ 58, కోహ్లి (బ్యాటింగ్) 63, రహానే (బ్యాటింగ్) 18, ఎక్స్‌ట్రాలు 12, **మొత్తం (85.1 ఓవర్లలో 3 వికెట్లకు) 273. వికెట్ల పతనం:** 1–25, 2–163, 3–198.

**బౌలింగ్:** ఫిలాండర్ 17–5–37–0, రబడ 18.1–2–48–3, నోర్జే 13–3–60–0, మహరాజ్ 29–8–89–0, ముత్తుసామి 6–1–22–0, ఎల్గర్ 2–0–11–0.



### విహారి స్థానంలో ఉమేశ్

**రెం**డో టెస్టులో భారత జట్టు ఒక మార్పుతో బరిలోకి దిగింది. పుణే పిచ్ పేస్‌కు అనుకూలిస్తుందని, చివర్లో రివర్స్ స్వింగ్ పని చేయవచ్చని భావిస్తున్న నేపథ్యంలో మూడో ఫాస్ట్ బౌలర్‌ను బరిలోకి దించింది. ఫలితంగా ఉమేశ్ యాదవ్‌కు తుది జట్టులో స్థానం లభించింది. జడేజా, అశ్విన్‌లతో ఎనిమిదో స్థానం వరకు బ్యాటింగ్ చేయగల సామర్థ్యం ఉండటంతో అదనపు బ్యాట్స్‌మన్ అవసరం లేదని భావించిన మేనేజ్‌మెంట్ ఆంధ్ర క్రికెటర్ హనుమ విహారిని పక్కన పెట్టింది. దక్షిణాఫ్రికా స్పిన్నర్ డేన్ పీట్ స్థానంలో పేస్ బౌలర్ ఆన్‌రిచ్ నోర్జేను ఆడించింది. నోర్జేకు ఇదే తొలి టెస్టు కావడం విశేషం.

### కోహ్లి ప్రశాంతంగా...

**వి**రాట్ క్రీజ్‌లోకి వచ్చే సమయానికి దక్షిణాఫ్రికా బౌలర్లు మంచి జోష్ మీదున్నారు. మహరాజ్ కట్టుదిట్టంగా బంతులు వేస్తుండగా, పేసర్ నోర్జే మెరుపు వేగంతో బౌలింగ్ చేస్తున్నాడు. దాంతో ఏమాత్రం పొరపాటుకు అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తగా ఆడిన కోహ్లి తొలి 73 బంతుల్లో 27 పరుగులకే పరిమితమయ్యాడు. ఆ తర్వాత బ్యాట్ ఝుళిపించిన అతను వేగంగా పరుగులు రాబట్టాడు. ఒక దశలో ఆరు బంతుల వ్యవధిలో మూడు ఫోర్లు కొట్టిన అతను... ఫిలాండర్ ఓవర్లో రెండు బౌండరీలు బాది 91 బంతుల్లోనే హాఫ్ సెంచరీ మార్క్‌ను చేరుకున్నాడు. దక్షిణాఫ్రికా రెండో కొత్త బంతి తీసుకున్నా కోహ్లిపై అది ఎలాంటి ప్రభావం చూపించలేదు.

---



## హుసామ్‌కు స్వర్ణం

**జాతీయ బాక్సింగ్ చాంపియన్‌షిప్**

**బడ్డి (హిమాచల్ ప్రదేశ్):** జాతీయ పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ బాక్సర్ మొహమ్మద్ హుసాముద్దీన్ విజేతగా నిలిచి పసిడి పతకం నెగ్గాడు. సర్వీసెస్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న హుసాముద్దీన్ 57 కేజీల విభాగం ఫైనల్లో 3–2తో సచిన్ సివాచ్ (రైల్వేస్)పై విజయం సాధించాడు. ఈ పోటీల్లో స్టార్ బాక్సర్ శివ తాపా (63 కేజీలు), పి.ఎల్.ప్రసాద్ (52 కేజీలు) కూడా బంగారు పతకాలు సాధించారు.

## మరో ఐదు సంఘాలకూ అర్హత లేదు: సీఓఏ

**న్యూఢిల్లీ:** క్రికెట్ బోర్డు పరిపాలక కమిటీ (సీఓఏ) బోర్డు ఎన్నికల్లో పాల్గొనకుండా మరో ఐదు రాష్ట్ర సంఘాలపై వేటు వేసింది. దీంతో అనర్హతకు గురైన సంఘాల సంఖ్య ఎనిమిదికి చేరింది. ఈ నెల 23న బీసీసీఐ ఎన్నికలు జరగనున్నాయి. లోధా సిఫార్సుల మేరకు నియమావళిని మార్చుకున్న సంఘాలకే ఇందులో ఓటు వేసే అవకాశముందని సీఓఏ స్పష్టం చేసింది. తాజాగా మణిపూర్, ఉత్తర్‌ప్రదేశ్, రైల్వేస్, సర్వీసెస్, అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్‌లు కూడా ఓటు వేసే అర్హత కోల్పోయాయి.

## పంకజ్ అద్వానీ పరాజయం

**ప్రపంచ బిలియర్డ్స్ చాంపియన్‌సిప్**

**మెల్‌బోర్న్:** ప్రపంచ బిలియర్డ్స్ చాంపియన్‌షిప్‌లో గురువారం సంచలనం నమోదైంది. 21 సార్లు ప్రపంచ బిలియర్డ్స్, స్నూకర్ చాంపియన్ అయిన పంకజ్ అద్వానీపై సౌరవ్ కొఠారీ (భారత్) సంచలన విజయాన్ని సాధించాడు. ప్రిక్వార్టర్ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ సౌరవ్ 1047–663తో పంకజ్‌పై గెలుపొందాడు. నేడు జరిగే క్వార్టర్స్ పోరులో కొఠారీ... రాబర్ట్ హాల్ (ఇంగ్లండ్)తో ఆడతాడు.

## మేరీకోమ్‌తో పాటు మరో ముగ్గురు...

- ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు 4 పతకాలు ఖాయం
- సెమీ ఫైనల్లో మేరీ కోమ్, మంజు రాణి, జమున బొరో, లవ్లినా బొర్గొహైన్

**మన మేరీ మరో 'ప్రపంచ' పతకంతో చరిత్ర సృష్టించింది. మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో ఆరు సార్లు ప్రపంచ చాంపియన్ అయిన స్టార్ బాక్సర్ మేరీకామ్ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. దీంతో ఆమెకు 8వ పతకం ఖాయమైంది. ఆమెతో పాటు మంజు రాణి, జమున బొరొ, లవ్లినా బొర్గొహైన్ సెమీస్ చేరి కనీసం కాంస్యానికి అర్హత సాధించారు.**

**ఉలన్ ఉడే (రష్యా):** భారత వెటరన్ బాక్సర్ మేరీకోమ్ ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో ఎనిమిదో పతకాన్ని ఖాయం చేసుకుంది. ఆరు సార్లు ప్రపంచ చాంపియన్ అయిన ఆమె 51 కేజీల విభాగంలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. దీంతో అక్కడ ఓడినా కనీసం కాంస్యమైనా దక్కుతుంది. గెలిస్తే పసిడి వేటలో పడుతుంది. మూడో సీడ్‌గా బరిలోకి దిగిన మేరీకోమ్ 51 కేజీల కేటగిరీలో 5–0తో కొలంబియాకు చెందిన వాలెన్సియా విక్టోరియాను చిత్తుగా ఓడించింది. విశేష అనుభవజ్ఞురాలైన మేరీ ముందు విక్టోరియా పంచ్‌లు నీరుగారాయి. బౌట్ ఆరంభం నుంచే ప్రత్యర్థిని తన పిడిగుద్దులతో ఉక్కిరిబిక్కిరి చేసిన ఈ మణిపూర్ వెటరన్ బాక్సర్ గెలిచేందుకు ఎంతోసేపు పట్టలేదు. క్యూబా పురుషుల బాక్సర్ ఫెలిక్స్ సవన్ ఏడు ప్రపంచ పతకాలతో ఉన్న రికార్డును మేరీ చెరిపేసింది. మేరీకోమ్ వరల్డ్ బాక్సింగ్‌లో ఇప్పటికే 6 స్వర్ణాలతో పాటు ఒక రజతం సాధించింది.

క్వార్టర్ ఫైనల్లో తలపడిన ఐదుగురు బాక్సర్లలో నలుగురు సెమీస్ చేరడంతో భారత్‌కు నాలుగు పతకాలు ఖాయమయ్యాయి. మంజు రాణి (48 కేజీలు), జమున బొరొ (54 కేజీలు), లవ్లినా బొర్గొహైన్ (69 కేజీలు) సెమీ ఫైనల్లోకి దూసుకెళ్లారు. ప్రపంచ వేదికపై రెండు సార్లు కాంస్యాలు గెలిచిన కవిత చహల్ (ప్లస్ 81 కేజీలు)కు మాత్రం నిరాశ ఎదురైంది. ఆమె క్వార్టర్స్‌లోనే ఓడిపోయింది. 48 కేజీల బౌట్‌లో మంజురాణి... టాప్ సీడ్, గత 'ప్రపంచ' చాంపియన్‌షిప్ కాంస్య విజేత కిమ్ హ్యాంగ్ మి (దక్షిణ కొరియా)కు షాకిచ్చింది. తొలిసారిగా మెగా ఈవెంట్‌లో బరిలోకి దిగిన హరియాణా బాక్సర్ మంజు 4–1తో కొరియన్‌ను ఇంటిదారి పట్టించింది. 54 కేజీల బౌట్‌లో అస్సామ్ బాక్సర్ జమున బొరొ కూడా 4–1తో ఉర్సులా గాట్‌లబ్ (జర్మనీ)పై నెగ్గింది. 69 కేజీల్లో లవ్లినా 4–1తో ఆరో సీడ్ కరొలినా కొస్జెస్కా (పోలండ్)పై గెలిచింది. మరో క్వార్టర్స్‌లో కవిత చహల్ (ప్లస్ 81 కేజీలు) 0–5తో కత్సియరినా కవలెవా (బెలారస్) చేతిలో పరాజయం చవి చూసింది.


జమున పంచ్

## టోక్యోలో 'ఇండియా హౌజ్'




**న్యూఢిల్లీ:** టోక్యో ఒలింపిక్స్‌లో పాల్గొనేందుకు వెళ్లబోయే భారత బృందం కోసం అక్కడ 'ఇండియా హౌజ్'ను నిర్మించేందుకు జిందాల్ సౌత్ వెస్ట్ (జేఎస్‌డబ్ల్యూ) గ్రూప్ సిద్ధమైంది. ఈ మేరకు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ)తో ఈ దిగ్గజ స్టీల్ కంపెనీ భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఒలింపిక్స్ ఆతిథ్య నగరాల్లో అభివృద్ధి చెందిన దేశాలు ఇలాంటి హౌజ్‌లను నిర్మించుకోవడం సహజం. కానీ భారత్ మాత్రం ఇలాంటి అధునాతన సౌకర్యాలతో హౌజ్‌ను నిర్మించుకోవడం ఇదే మొదటిసారి. క్రీడాగ్రామానికి సమీపంలో 2200 చదరపు మీటర్ల విస్తీర్ణంలో తొలిసారి భారత్ అక్కడ ఒలింపిక్ హాస్పిటాలిటీ హౌజ్‌ను నిర్మించనుంది. దీనికి సంబంధించిన 'లోగో'ను జేఎస్ డబ్ల్యూ గురువారం విడుదల చేసింది. ఈ హౌజ్‌లో భారత క్రీడాకారులకు కావాల్సిన అన్ని వసతులు ఉంటాయి. అలాగే అధికార వర్గాలకు సమాచార వేదిక, భారత్ నుంచి వెళ్లే ప్రేక్షకులు, మీడియా సిబ్బంది కోసం అవసరమైన ఏర్పాట్లన్నీ అక్కడ ఉంటాయి. అలాగే భారతీయ వంటకాలన్నీ అందుబాటులో ఉంచుతారు. దీని వల్ల ఇంటి భోజనానికి దూరమైన భావనే కలగదని ఐఓఏ వర్గాలు తెలిపాయి. ఈ హాస్పిటాలిటీ హౌజ్ స్థూలంగా భారత వర్గాలందరికీ సమాచార, సమన్వయ వేదికగా ఉపయోగపడుతుందని ఐఓఏ వర్గాలు తెలిపాయి.


తిలక్

## హైదరాబాద్ గెలుపు

### 7 పరుగులతో ఓడిన ఆంధ్ర

**ఆలూరు (బెంగళూరు):** విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్ కీలక విజయం సాధించింది. గురువారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 7 పరుగుల తేడాతో ఆంధ్రను ఓడించింది. వర్షం కారణంగా 20 ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ 7 వికెట్లు కోల్పోయి 171 పరుగులు చేసింది. ఠాకూర్ తిలక్ వర్మ (59 బంతుల్లో 83; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడాడు. అనంతరం ఆంధ్ర 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 164 పరుగులు చేసింది. రికీ భుయి (40 బంతుల్లో 58; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), ప్రశాంత్ కుమార్ (42 బంతుల్లో 57; 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) రెండో వికెట్‌కు 115 పరుగులు జోడించినా జట్టును గెలిపించడంలో విఫలమయ్యారు. మిలింద్‌కు 3 వికెట్లు దక్కాయి.

## యు ముంబా విజయం

**గ్రేటర్ నోయిడా:** తన అద్భుతమైన ట్యాక్లింగ్‌తో ప్రత్యర్థిని పట్టేసిన యు ముంబా సారథి ఫజల్ అత్రాచలి జట్టుకు విజయాన్ని అందించాడు. గురువారం జరిగిన మ్యాచ్‌లో యు ముంబా 39–33తో హరియాణా స్టీలర్స్‌పై గెలుపొందింది. ట్యాక్లింగ్‌లో మెరిసిన అత్రాచలి 8 పాయింట్లతో అదరగొట్టాడు. అతనికి రైడర్ అజింక్యా కప్రె (9 పాయింట్లు) చక్కటి సహకారం అందించాడు. హరియాణా రైడర్ వినయ్ 11 పాయింట్లతో టాప్ స్కోరర్‌గా నిలిచినా జట్టును మాత్రం గెలిపించలేకపోయాడు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో యు ముంబాతో దబంగ్ ఢిల్లీ; యూపీ యోధతో బెంగళూరు బుల్స్ తలపడతాయి.

## క్వార్టర్స్‌లో రాహుల్, లక్ష్యసేన్

- ప్రి క్వార్టర్స్‌లో ఓడిన సమీర్ వర్మ
- డచ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

**అల్మెరె (నెదర్లాండ్స్):** భారత షట్లర్లు రాహుల్ భరద్వాజ్, లక్ష్యసేన్ డచ్ ఓపెన్ టూర్ సూపర్–100 బ్యాడ్మింటన్ టోర్నీ క్వార్టర్స్‌లో ప్రవేశించారు. గురువారం జరిగిన ప్రిక్వార్టర్స్‌లో రాహుల్ భరద్వాజ్ 21–17, 24–26, 21–8తో ఆరో సీడ్ విక్టర్ సెకెండెసెన్ (డెన్మార్క్)పై, లక్ష్యసేన్ 21–13, 16–21, 21–10తో కొయెల్హో (బ్రెజిల్)పై గెలిచారు.

అయితే టాప్ సీడ్ సమీర్ వర్మకు మాత్రం చుక్కెదురైంది. అతను 18–21, 21–19, 14–21తో యుసుకె ఒనోదెర (జపాన్) చేతిలో పోరాడి ఓడాడు. నేడు జరిగే క్వార్టర్ పోరులో లక్ష్యసేన్‌తో రాహుల్ భరద్వాజ్ తలపడతాడు.

## దశ మార్చిన పేస్ దళమిదే!

- దిగ్గజ క్రికెటర్ కపిల్‌దేవ్ వ్యాఖ్య



**ముంబై:** ప్రస్తుత పేసర్లు భారత క్రికెట్ ముఖ చిత్రాన్నే మార్చారని దిగ్గజ ఆల్ రౌండర్ కపిల్ దేవ్ అన్నారు. కనీవినీ ఎరుగని సామర్థ్యం ఈ పేస్ దళానికి ఉందని కితాబిచ్చారు. 'ఇలాంటి పేస్ అటాక్‌ను గతంలో ఎప్పుడు చూడలేదు. ఇలా ఉంటుందని ఊహించలేదు కూడా! ఇదే అత్యుత్తమమని అనడంలో ఎలాంటి సందేహం లేదు. గత నాలుగైదేళ్లుగా మన ఫాస్ట్ బౌలర్లు భారత క్రికెట్ దశనే మార్చేశారు' అని కపిల్ అన్నారు. గత కొంతకాలంగా భారత జట్టు బుమ్రా, ఉమేశ్, షమీ, ఇషాంత్, దీపక్ చహర్, సైనీలతో పటిష్టంగా తయారైన సంగతి తెలిసిందే. బుమ్రా ఇప్పుడు గాయంతో జట్టుకు దూరమైనా ఆ లోటే లేకుండా షమీ ఆ బాధ్యతని సమర్థంగా మోస్తున్నాడు. దీనిపై కపిల్ మాట్లాడుతూ 'ఐసీసీ టాప్–10 బౌలర్ల జాబితాలో ఉన్నారా లేదా అనే విషయం అనవసరం... ఎంత బాగా జట్టుకు ఉపయోగపడుతున్నారన్నదే అవసరం. షమీ అసాధారణంగా బౌలింగ్ చేస్తున్నాడు. ఇంత పెద్ద సంఖ్యలో మన పేసర్లు ప్రపంచ శ్రేణి బౌలర్లుగా ఎదుగుతున్న తీరు గర్వకారణంగా ఉంది' అని అన్నారు. క్రికెట్ సలహా కమిటీ (సీఏసీ) చీఫ్ పదవికి ఇటీవలే రాజీనామా చేసిన ఆయన మాట్లాడుతూ ఇందులో ఎలాంటి పరస్పర ప్రయోజనముందో తెలియట్లేదని... ఇదేమీ శాశ్వత పదవో, జీతం తెచ్చే ఉద్యోగమో కాదన్నారు. ఒకట్రెండు సమావేశాలకు హాజరయ్యే గౌరవప్రదమైన పదవిలో ప్రయోజనాలు ఏముంటాయని ప్రశ్నించారు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
11-10-2019
WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 298 ▼ | 79 ▼ |
| 37,880 | 11,235 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలి రెండు రాత్రి 11.30గం॥లకు)

| సూచీ | | |
|---|---|---|
| నాస్‌డాక్ | 7,947 | ▲ 42 |
| డోజోన్స్ | 26,500 | ▲ 154 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,186 | ▲ 20 |
| డాక్స్ | 12,164 | ▲ 70 |
| షాంఘై | 2,948 | ▲ 23 |
| నికాయ్ | 21,552 | ▲ 96 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|
| యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 70.23 | 71.87 |
| బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 85.36 | 88.44 |
| యూరో | ఎస్‌బీఐ | 76.66 | 79.52 |
| జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 64.89 | 67.36 |
| ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 46.91 | 49.09 |
| సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 50.67 | 52.42 |
| సౌదీ రియాల్ | ఎస్‌బీఐ | 18.16 | 19.77 |
| యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.89 | 19.89 |
| చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.35 | 10.76 |

# కియా తొలి ఎక్స్‌పీరియన్స్ సెంటర్

- ‘బీట్ 360’ పేరుతో గురుగ్రామ్‌లో ఏర్పాటు
- సెప్టెంబర్ దేశీ అమ్మకాలు 7,554 యూనిట్లు



**గురుగ్రామ్:** దక్షిణ కొరియా ఆటోమొబైల్ దిగ్గజం కియా మోటార్స్.. తాజాగా తన తొలి ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించింది. ‘బీట్ 360’ పేరుతో 5,280 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ సెంటర్‌ను ఇక్కడ ఏర్పాటుచేసింది. ఈ సందర్భంగా సంస్థ ఎండీ, సీఈఓ కూక్ హ్యూన్ షిమ్ మాట్లాడుతూ.. ‘కియా భవిష్యత్ వ్యూహాలను ఈ సెంటర్ వివరిస్తుంది. భారత్‌లో నూతన ప్రామాణాలను ఏర్పాటుచేయడంలో కీలక పాత్ర పోషించనుంది. భారత్‌లో సంస్థ కార్యకలాపాలు ప్రారంభించిన దగ్గర నుంచి వినియోగదారులు మా సంస్థపైనే దృష్టి సారిస్తున్నారు. నిజమైన కియా అనుభవాన్ని అందించడానికి వీరితో అనుసంధానం కావాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇక ఈ సెంటర్ పేరులోని మొదటి పదం బీటింగ్ ఆఫ్ హార్ట్‌కు సంక్షిప్తం. సంస్థ వ్యాపార ప్రాంతాలు (జోన్స్)కు సంకేతంగా 3, ఇంద్రియాలను సూచిస్తూ 6, హద్దులు లేవని చెప్పేందుకు 0 ఎంపిక చేసి 360 అని నిర్ణయించాం. త్వరలోనే దేశంలోని మెట్రో నగరాల్లో కూడా ఇటువంటి సెంటర్లను ఏర్పాటుచేయాలని యోచిస్తున్నాం. అని వ్యాఖ్యానించారు.

**50,000 బుకింగ్స్:** సెప్టెంబర్ నెలలో కియా దేశీ అమ్మకాలు 7,554 యూనిట్లు కాగా, కారు విడుదలైన ఆగస్టు 22 నుంచి గతనెల చివరివరకు మొత్తం విక్రయాలు 13,990 యూనిట్లుగా నమోదయ్యాయి. బుకింగ్స్ 50,000 యూనిట్ల మార్కును అధిగమించాయి.

# పావు శాతం దిగొచ్చిన రుణ రేట్లు

**ఆర్‌బీఐ రేట్ల తగ్గింపుతో సానుకూలత**



**న్యూఢిల్లీ:** గత నెలలో ఆర్‌బీఐ కీలక రేట్లకు మరో విడత కోత పెట్టిన తర్వాత నుంచి సుమారు అరడజను ప్రభుత్వరంగ బ్యాంకులు (పీఎస్‌బీలు) రుణాలపై రేట్లను పావు శాతం వరకు తగ్గించాయి. దీంతో గృహ, ఆటో, ఇతర రుణాలు చౌకగా మారాయి. ఆర్‌బీఐ పాలసీ రేట్లకు అనుగుణంగానే .. రిటైల్ విభాగం, ఎంఎస్‌ఎంఈలకు ఇచ్చే రుణాలపై రేట్లను 25 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్టు, రెపో ఆధారిత రుణ రేటు నవంబర్ 1 నుంచి 8 శాతంగా ఉంటుందని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు ప్రకటించింది. బ్యాంకు ఆఫ్ ఇండియా సైతం ఓవర్‌నైట్ ఎంసీఎల్‌ఆర్‌ను 15 బేసిస్ పాయింట్లు(0.15శాతం), ఏడాది కాల ఎంసీఎల్‌ఆర్‌ను 5 బేసిస్ పాయింట్లు తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ 10 నుంచే వీటిని అమల్లోకి తీసుకొచ్చింది. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర అయితే వివిధ కాల పరిమితుల రుణాలపై రేట్లను 10 బేసిస్ పాయింట్ల వరకు తగ్గించింది. దీంతో ఏడాది కాల ఎంసీఎల్‌ఆర్ రేటు 8.40 శాతానికి దిగొచ్చింది. రెపో ఆధారిత రుణ రేటును పావు శాతం తగ్గించి 8.45 శాతం నుంచి 8.20 శాతానికి తగ్గించింది. సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా రెపో ఆధారిత రుణ రేటును పావు శాతం తగ్గిస్తున్నట్టు, అక్టోబర్ 10 నుంచే అమల్లోకి వస్తుందని ప్రకటించింది. దీంతో సెంట్రల్ బ్యాంకు గృహ రుణాలపై వడ్డీ రేటు 8 శాతానికి తగ్గగా, ఎంఎస్‌ఈ రుణ రేట్లు 8.95–9.50 శాతానికి తగ్గాయి. ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ సైతం ఏడాది కాల ఎంసీఎల్‌ఆర్ రేటును 8.4 శాతం నుంచి 8.35 శాతానికి తగ్గించింది.

**పేటీఎం పేమెంట్స్ బ్యాంకు వడ్డీ తగ్గింపు**

పేటీఎం పేమెంట్స్ బ్యాంకు (పీపీబీ) సేవింగ్స్ ఖాతాల్లోని డిపాజిట్లపై వడ్డీ రేటును అర శాతం తగ్గించి 3.5 శాతం చేసింది. నవంబర్ 9 నుంచి ఇది అమల్లోకి వస్తుందని పీపీబీ ప్రకటించింది. ఆర్‌బీఐ ఇటీవలే రెపో రేటును పావు శాతం మేర తగ్గించడం వల్లే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చినట్టు పీపీబీ సీఈవో, ఎండీ సతీష్‌కుమార్ గుప్తా తెలిపారు. 7.5 శాతం వడ్డీ రేటుతో కూడిన ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాన్ని కూడా పీపీబీ ప్రకటించింది. పీపీబీ భాగస్వామ్య బ్యాంకుల్లో డిపాజిట్ చేయడం ద్వారా ఈ వడ్డీ రేటు పొందొచ్చు.

# టీసీఎస్.. అంచనాలు మిస్

**క్యూ2లో లాభం 1.8 శాతం అప్; రూ. 8,042 కోట్లు**

**ఆదాయం 6 శాతం వృద్ధి; రూ. 38,977 కోట్లు**

**షేరుకి రూ. 40 ప్రత్యేక డివిడెండ్**



**ముంబై:** దేశీ ఐటీ సేవల దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) రెండో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు మార్కెట్ వర్గాల అంచనాలను అందుకోలేకపోయాయి. గురువారం వెల్లడించిన ఫలితాల ప్రకారం.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం క్యూ2లో కంపెనీ నికర లాభం 1.8 శాతం వృద్ధి చెంది రూ. 8,042 కోట్లకు పరిమితమైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే వ్యవధిలో నికర లాభం రూ. 7,901 కోట్లు. ఇక జూలై–సెప్టెంబర్ త్రైమాసికంలో ఆదాయం 5.8% పెరిగి రూ. 36,854 కోట్ల నుంచి రూ. 38,977 కోట్లకు చేరింది. స్థిర కరెన్సీ ప్రాతిపదికన ఆదాయ వృద్ధి 8.4%గా నమోదైంది. సాధారణంగా దేశీ ఐటీ సేవల కంపెనీలకు జూలై–సెప్టెంబర్ త్రైమాసికం మెరుగ్గా ఉండే నేపథ్యంలో టీసీఎస్ ఆదాయ వృద్ధి 9–9.5 శాతం శ్రేణిలో ఉండొచ్చని, లాభం రూ. 8,304–8,322 కోట్ల మేర ఉండగలదని మార్కెట్ వర్గాలు అంచనా వేశాయి. రూపాయి మారకం విలువ క్షీణించడం, వీసా ఖర్చులు తగ్గడం వంటి సానుకూల అంశాలు ఉన్నప్పటికీ లాభాలు.. అంచనాలకు అనుగుణంగా లేకపోవడం ఆశ్చర్యకరమని పరిశీలకులు అభిప్రాయపడ్డారు. టీసీఎస్ గతంలో ఇచ్చిన రెండంకెల స్థాయి వృద్ధికి రిస్కులు పొంచి ఉన్నాయనడానికి తాజా ఫలితాలు నిదర్శనమని, స్థిర కరెన్సీ ప్రాతిపదికన ఈ ఆర్థిక సంవత్సరంలో ఆదాయ వృద్ధి 9 శాతానికి దిగువనే ఉండొచ్చని బ్రోకరేజి సంస్థ ఎమ్‌కే గ్లోబల్ పేర్కొంది. రెండో త్రైమాసిక ఆర్థిక ఫలితాల సీజన్ టీసీఎస్‌తోనే ప్రారంభం కావడంతో.. మిగతా కంపెనీల ఫలితాలెలా ఉండబోతున్నాయన్నది ఆసక్తికరంగా మారింది.

సీక్వెన్షియల్‌గా చూస్తే లాభం 1.09 శాతం క్షీణించింది. జూన్ క్వార్టర్‌లో లాభం రూ. 8,131 కోట్లు. మరోవైపు తొలి త్రైమాసికంలో ఆదాయం రూ. 38,172 కోట్లుగా ఉండగా, రెండో త్రైమాసికంలో రూ. 38,977 కోట్లకు చేరింది.

**తగ్గిన మార్జిన్లు..**

నిర్వహణ పనితీరుకు సంబంధించి వడ్డీలు, పన్నులకు ముందు లాభాలు (ఎబిట్) వార్షిక ప్రాతిపదికన 4.2 శాతం క్షీణించి రూ. 9,361 కోట్లకు చేరగా, మార్జిను 250 బేసిస్ పాయింట్లు తగ్గింది. తొమ్మిది త్రైమాసికాల కనిష్ట స్థాయి అయిన 24 శాతానికి పరిమితమైంది. సీక్వెన్షియల్‌గా చూసినా మార్జిను 15 బేసిస్ పాయింట్లు తగ్గింది. సామర్థ్యాలను పెంచుకునే దిశగా మరింత ఇన్వెస్ట్ చేస్తుండటం మార్జిన్లపై ప్రభావం చూపినట్లు సంస్థ వెల్లడించింది. కాగా, విశ్లేషకులు ఎబిట్ రూ. 9,834 కోట్లుగాను, మార్జిను 25 శాతంగా ఉండొచ్చని అంచనా వేశారు. కంపెనీ 26–28 శాతం లక్ష్యాన్ని నిర్దేశించుకుంది.



## సవాళ్లు పొంచి ఉన్నాయ్...

ఏడాది ప్రారంభంలో మేం అంచనా వేసిన దానికన్నా ఫలితాలు తక్కువ స్థాయిలోనే ఉన్నాయి. ఆర్థిక సేవలు, రిటైల్ విభాగాల్లో ఒడిదుడుకులు తీవ్రంగా పెరిగినప్పటికీ రెండో త్రైమాసికంలో స్థిరంగా వృద్ధి నమోదు చేయగలిగాం. మధ్యకాలికంగా, దీర్ఘకాలికంగా మా సేవలకు డిమాండ్ కొనసాగుతుందని ధీమాగా ఉన్నాం. గడిచిన ఆరు త్రైమాసికాల్లోనే అత్యధిక స్థాయిలో ఉన్న క్యూ2లో ఆర్డర్ బుక్ ఇందుకు నిదర్శనం. ప్రస్తుత పరిస్థితుల్లో ఇది సవాళ్లతో కూడుకున్నట్లుగానే కనిపిస్తోంది. పెద్ద సంస్థలు, బ్యాంకులు.. ఐటీ వ్యయాల్లో కోత పెడుతుండటంతో ప్రధానమైన బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్, రిటైల్ విభాగంలో మందగమనం కొనసాగుతోంది. ఇది ఆర్థిక ఫలితాలపై గణనీయంగా ప్రతికూల ప్రభావం చూపిందని చెప్పారు. 6.4 బిలియన్ డాలర్ల ఆదాయం లభించే అవకాశాలున్న పలు డీల్స్‌ను రెండో త్రైమాసికంలో కుదుర్చుకున్నాం.

– రాజేష్ గోపీనాథన్, టీసీఎస్ సీఈవో

### ఇతర విశేషాలు..

- మొత్తం ఆదాయంలో డిజిటల్ సేవల విభాగం వాటా 33.2 శాతంగా ఉంది. గత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంతో పోలిస్తే డిజిటల్ ఆదాయం 27.9 శాతం పెరిగింది. అయితే, సీక్వెన్షియల్‌గా చూస్తే మాత్రం 40 శాతం నుంచి 28 శాతానికి తగ్గింది.
- ప్రాంతాల వారీగా యూరప్, ఇంగ్లాండ్‌లో ఆదాయాల వృద్ధి మెరుగ్గా ఉంది. కానీ అమెరికాతో పాటు భారత్, మధ్యప్రాచ్యం, ఆసియా–పసిఫిక్ ప్రాంతాలు బలహీనంగా ఉన్నాయి.
- రెండో క్వార్టర్‌లో ఉద్యోగుల సంఖ్య నికరంగా 14,097 మేర పెరిగింది. మొత్తం సిబ్బంది సంఖ్య 4,50,738కి చేరింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో 30,000 పైచిలుకు క్యాంపస్ నియామకాలు చేపట్టనుంది. అట్రిషన్ రేటు 11.6 శాతంగా ఉంది.
- ఆదాయాలు కొంత తగ్గడం, కొత్త సిబ్బందిపై భారీ వేతనాల వ్యయాలు తదితర అంశాలు మార్జిన్లపై ప్రభావం చూపినట్లు సంస్థ సీఎఫ్‌వో వి. రామకృష్ణన్ చెప్పారు. అయితే, వ్యవస్థాగతంగా సవాళ్లేమీ లేకపోవడంతో నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు. వ్యాపారపరంగా ఇప్పటికే పన్ను మినహాయింపులు ఉన్నందున కార్పొరేట్ ట్యాక్స్ తగ్గింపు వల్ల కంపెనీకి కొత్తగా ప్రయోజనాలేమీ ఉండబోవని రామకృష్ణన్ పేర్కొన్నారు.
- రూ. 1 ముఖవిలువ గల షేరు ఒక్కింటికి రూ. 5 చొప్పున రెండో విడత మధ్యంతర డివిడెండుతో పాటు రూ. 40 మేర ప్రత్యేక డివిడెండ్ చెల్లించాలని టీసీఎస్ బోర్డు నిర్ణయించింది. దీనికి రికార్డు తేదీ అక్టోబర్ 18. చెల్లింపు తేదీ అక్టోబర్ 24.

**టీసీఎస్ ఆర్థిక ఫలితాలు స్టాక్ మార్కెట్ ముగిసిన తర్వాత వెల్లడయ్యాయి. సంస్థ షేరు ఎన్‌ఎస్‌ఈలో 0.86 శాతం క్షీణించి రూ. 2,004 వద్ద క్లోజయ్యింది.**

# ఫోర్టిస్ మాజీ ప్రమోటర్ శివీందర్ అరెస్ట్!

**సోదరుడు మల్వీందర్‌పై లుక్ అవుట్**



**న్యూఢిల్లీ:** రెలిగేర్ ఫిన్‌వెస్ట్ (ఆర్‌ఎఫ్‌ఎల్)కి చెందిన రూ. 2,397 కోట్ల మేర నిధులను దుర్వినియోగం చేసిన ఆరోపణలపై ఫోర్టిస్ హెల్త్‌కేర్ మాజీ ప్రమోటర్ శివీందర్ సింగ్‌తో పాటు మరో ముగ్గురిని ఢిల్లీ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వీరిలో రెలిగేర్ ఎంటర్‌ప్రైజెస్ (ఆర్‌ఈఎల్) మాజీ చైర్మన్ సునీల్ గోధ్వానీ (58), ఆర్‌ఈఎల్.. ఆర్‌ఎఫ్‌ఎల్‌లో కీలక బాధ్యతలు నిర్వర్తించిన కవి అరోరా, అనిల్ సక్సేనా ఉన్నారు. నిధులను మళ్లించి ఇతర సంస్థల్లో ఇన్వెస్ట్ చేశారన్న ఆరోపణలపై ఢిల్లీ పోలీస్ ఆర్థిక నేరాల విభాగం వీరిని అరెస్ట్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. శివీందర్ సోదరుడు మల్వీందర్ సింగ్ పరారీలో ఉన్నారని, ఆయనపై లుక్ అవుట్ సర్క్యులర్ జారీ అయ్యిందని వివరించారు. ఆర్‌ఈఎల్‌కు ఆర్‌ఎఫ్‌ఎల్ అనుబంధ సంస్థ. 2018 ఫిబ్రవరి దాకా సింగ్ సోదరులు ఆర్‌ఈఎల్ ప్రమోటర్లుగా కొనసాగారు. వారి నిష్క్రమణ తర్వాత ఆర్‌ఈఎల్, ఆర్‌ఎఫ్‌ఎల్ బోర్డులు మారాయి.

శివీందర్ సింగ్ ప్రమోటర్‌గా ఉన్న సమయంలో తీసుకున్న రుణాలను ఇతర సంస్థల్లో ఇన్వెస్ట్ చేశారన్న ఆర్‌ఎఫ్‌ఎల్ ఫిర్యాదు మేరకు తాజా అరెస్టులు జరిగాయి. ‘ఆర్‌ఎఫ్‌ఎల్ కొత్త మేనేజ్‌మెంట్ బాధ్యతలు తీసుకున్న తర్వాత నిర్దిష్ట రుణమొత్తం.. సింగ్, ఆయన సోదరుడికి చెందిన కంపెనీల్లోకి మళ్లినట్లు గుర్తించింది. దీనిపై ఈవోడబ్ల్యూకి ఫిర్యాదు చేసింది. దానికి అనుగుణంగా ఎఫ్‌ఐఆర్ నమోదైంది‘ అని సీనియర్ పోలీస్ అధికారి ఒకరు తెలిపారు. ర్యాన్‌బాక్సీ లేబొరేటరీస్ మాజీ ప్రమోటర్లు కూడా అయిన సింగ్ సోదరులతో పాటు గోధ్వానీపైనా పలు ఆరోపణలు ఉన్నాయి. ర్యాన్‌బాక్సీ విక్రయం విషయంలో మోసాలకు పాల్పడ్డారంటూ శివీందర్, మల్వీందర్‌ల నుంచి జపాన్ ఔషధ సంస్థ దైచీ శాంక్యో రూ. 2,600 కోట్ల మేర నష్టపరిహారాన్ని రాబట్టుకునే ప్రయత్నాల్లో ఉంది.

# ఇండస్‌ఇండ్ లాభం రూ.1,401 కోట్లు

- క్యూ2లో 52 శాతం వృద్ధి
- రుణ వృద్ధి 20 శాతం
- రెట్టింపైన మొండి బకాయిలు; 2.19 శాతం...
- మందగమన ప్రభావం మరో 2 క్వార్టర్లు ఉంటుంది
- బ్యాంక్ సీఈఓ రమేశ్ సోబ్తి వెల్లడి

**న్యూఢిల్లీ:** ప్రైవేట్ రంగ ఇండస్‌ఇండ్ బ్యాంక్ నికర లాభం (కన్సాలిడేటెడ్) ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసిక కాలంలో 52 శాతం ఎగసింది. గత ఆర్థిక సంవత్సరం (2018–19) క్యూ2లో రూ.920 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం (2019–20) క్యూ2లో రూ.1,401 కోట్లకు పెరిగిందని ఇండస్‌ఇండ్ బ్యాంక్ తెలిపింది. అయితే సీక్వెన్షియల్‌గా చూస్తే, నికర లాభం స్వల్పంగా తగ్గిందని బ్యాంక్ సీఈఓ రమేశ్ సోబ్తి చెప్పారు. కేటాయింపులు పెరగడం, నికర వడ్డీ మార్జిన్ తక్కువ వృద్ధిని నమోదు చేయడం దీనికి కారణాలని వివరించారు. మొత్తం ఆదాయం రూ.6,755 కోట్ల నుంచి రూ.8,878 కోట్లకు పెరిగిందని పేర్కొన్నారు.



**నికర వడ్డీ మార్జిన్ 4.1 శాతం**

నికర వడ్డీ ఆదాయం 32 శాతం వృద్ధితో రూ.2,909 కోట్లకు పెరిగిందని రమేశ్ సోబ్తి తెలిపారు. సీక్వెన్షియల్‌గా చూస్తే, నికర వడ్డీ మార్జిన్ మెరుగుపడి 4.1 శాతానికి ఎగసిందని వివరించారు. 21 శాతం రుణ వృద్ధి సాధించామని, ఇది బహుళ సంవత్సరాల కనిష్ట స్థాయి అని, మందగమనం ప్రభావం మరో ఆరు నెలల పాటు ఉండగలదని అంచనా వేస్తున్నామన్నారు.

**ఎగబాకిన మొండిబకాయిలు...**

నికర లాభం, ఆదాయాలతో పాటు బ్యాంక్ మొండి బకాయిలు కూడా పెరిగాయి. రుణ నాణ్యత వార్షికంగా, సీక్వెన్షియల్‌గా చూసినా క్షీణించింది. గత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ క్వార్టర్‌లో 1.09 శాతంగా ఉన్న స్థూల మొండి బకాయిలు ఈ ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌లో 2.19 శాతానికి పెరిగాయని రమేశ్ సోబ్తి వెల్లడించారు. అలాగే నికర మొండి బకాయిలు 0.48 శాతం నుంచి 1.12 శాతానికి పెరిగాయని పేర్కొన్నారు. తాజా మొండి బకాయిలు ఈ క్యూ1లో రూ.725 కోట్లుగా ఉండగా, ఈ క్యూ2లో రూ.1,102 కోట్లకు పెరిగాయని తెలిపారు. దీంట్లో కంపెనీల తాజా మొండి బకాయిలు 174 శాతం, రిటైల్ రుణాలకు సంబంధించిన తాజా మొండి బకాయిలు 13 శాతం చొప్పున పెరిగాయని వివరించారు. ఇక కేటాయింపులు రూ.590 కోట్ల నుంచి 71 శాతం వృద్ధితో రూ.738 కోట్లకు చేరాయని వివరించారు. ఈ క్యూ1లో 43 శాతంగా ఉన్న ప్రొవిజన్ కవరేజ్ రేషియో ఈ క్యూ2లో 50 శాతానికి పెరిగిందని పేర్కొన్నారు.

**నికర లాభం, ఆదాయం పెరిగినా, మొండి బకాయిలు రెట్టింపై రుణనాణ్యత క్షీణించడంతో ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేరు 6.1 శాతం నష్టంతో రూ. 1,229 వద్ద ముగిసింది.**

## వృద్ధి 5.8 శాతమే: మూడీస్




**న్యూఢిల్లీ:** భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు అంచనాలను మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీస్ తగ్గించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019–2020) 5.8 శాతంగానే ఉంటుందని పేర్కొంది. ఇంతక్రితం ఈ అంచనా 6.2 శాతం. అయితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అంచనా 6.1 శాతం. మూడీస్ తాజా అంచనాలు ఆర్‌బీఐ అంచనాలకన్నా తక్కువ కావడం గమనార్హం. పెట్టుబడుల మందగమనం దీనితో వినియోగం తగ్గడం, గ్రామీణ ప్రాంతాల్లో ద్రవ్యపరమైన ఒత్తిడులు, ఉపాధి కల్పనలో వెనుకబాటు వంటి అంశాలు వృద్ధి రేటు అంచనా తాజా కోతకు కారణమని మూడీస్ పేర్కొంది. అయితే 2020–21లో జీడీపీ వృద్ధి 6.6 శాతం ఉంటుందని జీడీపీ అంచనా వేసింది.

**6.1 శాతం...: ఇండియా రేటింగ్స్**

2019–20లో వృద్ధి రేటు 6.1 శాతం ఉంటుందని ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చ్ అంచనా వేస్తోంది. బలహీన డిమాండ్ తమ తాజా అంచనాలకు కారణంగా పేర్కొంది. నిజానికి గడచిన రెండు నెలల్లో జీడీపీ అంచనాలను 7.3% నుంచి ఇండియా రేటింగ్స్ రెండుసార్లు తగ్గించింది.

# కోపరేటివ్ బ్యాంకులకు చికిత్స!

- అవసరమైతే చట్టానికి సవరణలు
- ఇందు కోసం ప్యానెల్ ఏర్పాటు
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటన



పీఎంసీ ఖాతాదారులతో చర్చిస్తున్న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

**ముంబై:** కోపరేటివ్ బ్యాంకుల మెరుగైన నిర్వహణకు అవసరమైతే చట్టంలో సవరణలు తీసుకొస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఇటీవలే ఆర్‌బీఐ ఆంక్షల పరిధిలోకి వెళ్లిన పంజాబ్ అండ్ మహారాష్ట్ర కోపరేటివ్ బ్యాంకు (పీఎంసీ బ్యాంకు) డిపాజిటర్ల ఆగ్రహాన్ని మంత్రి గురువారం ముంబై వచ్చిన సందర్భంగా స్వయంగా చవిచూశారు. దక్షిణ ముంబైలోని బీజేపీ కార్యాలయం వద్దకు పీఎంసీ బ్యాంకు డిపాజిటర్లు చేరుకుని తమ డబ్బులను పూర్తిగా తమకు ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు డిపాజిటర్లను మంత్రి లోపలకు తీసుకెళ్లి, స్వయంగా మాట్లాడి వారి ఆందోళనను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. కోపరేటివ్ బ్యాంకుల్లో పాలన మెరుగ్గా ఉండేందుకు చట్టపరంగా తీసుకోవాల్సిన చర్యలను సూచించేందుకు ఓ ప్యానెల్‌ను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి, గ్రామీణ, పట్టణాభివృద్ధి శాఖల కార్యదర్శులు, ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్‌తో ఈ ప్యానెల్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. కోపరేటివ్ బ్యాంకుల చట్టంలో లోపాలు ఉన్నాయని తాను భావించడం లేదన్నారు. కాకపోతే, భవిష్యత్తులో ఈ తరహా ఘటనలు తిరిగి చోటు చేసుకోకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవడమే ప్రభుత్వ ఉద్దేశమని, అందుకే ప్యానెల్ ఏర్పాటు అని చెప్పారు. అవసరమైతే కోపరేటివ్ బ్యాంకుల చట్టాలకు సవరణలను పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో చేపడతామని తెలిపారు.

**ప్రభుత్వ పాత్ర పరిమితమే..**

బహుళ రాష్ట్రాల్లో పనిచేసే కోపరేటివ్ బ్యాంకులను ఆర్‌బీఐ నియంత్రిస్తుందని డిపాజిటర్లకు చెప్పినట్టు మంత్రి వెల్లడించారు. ఈ విషయంలో ప్రభుత్వ పాత్ర పరిమితమేనన్నారు. కాకపోతే డిపాజిటర్ల అత్యవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని ఆర్‌బీఐ గవర్నర్‌ను కోరతానని ఆమె హామీ ఇచ్చారు. పీఎంసీ బ్యాంకులో రుణాల కుంభకోణం వెలుగు చూడడం, ఎన్‌పీఏల గణాంకాల్లో బ్యాంకు అక్రమాలకు పాల్పడడంతో ఆర్‌బీఐ ఆంక్షలను అమలు చేసిన విషయం గమనార్హం. ఒక్కో ఖాతా (సేవింగ్స్, కరెంటు, డిపాజిట్) నుంచి గరిష్టంగా రూ.10,000 మాత్రమే ఉపసంహరణకు అనుమతించింది. పీఎంసీ బ్యాంకు నిబంధనలకు విరుద్ధంగా తన మొత్తం రుణాల్లో (సుమారు రూ.9వేల కోట్లు) 70% మేర హెచ్‌డీఐఎల్ ఖాతా ఒక్కదానికే ఇవ్వడం గమనార్హం.

**వృద్ధి కోసం ప్రోత్సాహకాలు**

దేశం ఆర్థిక మందగమనం ఎదుర్కొంటోందని ప్రభుత్వం అంగీకరిస్తుందా? అన్న ప్రశ్నకు... మంత్రి నిర్మలా సీతారామన్ సూటి సమాధానం దాటవేశారు. రంగాలవారీగా అవసరమైన చర్యలపై ప్రభుత్వం దృష్టి సారించినట్టు చెప్పారు. సాయం అవసరమైన అన్ని రంగాలకు ఉపశమనం కల్పిస్తున్నట్టు ప్రకటించారు.

## సామాన్యుల సొమ్ముకు రక్షణ లేకపోవడం అన్యాయం: పరేఖ్



**ముంబై:** ఒకవైపు క్రమం తప్పకుండా రుణాలపై హక్కులు వదులుకోవడంతోపాటు కార్పొరేట్ రుణాలను మాఫీ చేస్తున్నా కానీ, మరోవైపు సామాన్యుల పొదుపు సొమ్మును రక్షించే బలమైన ఆర్థిక వ్యవస్థ లేకపోవడం దారుణమైన అన్యాయంగా వ్యాఖ్యానించారు హెచ్‌డీఎఫ్‌సీ చైర్మన్ దీపక్ పరేఖ్. పీఎంసీ బ్యాంకు సంక్షోభం ఇటీవలే వెలుగు చూసిన నేపథ్యంలో పరేఖ్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం నెలకొంది. రుణాల్లో అక్రమాలకు పాల్పడినట్టు తేలడంతో పీఎంసీ బ్యాంకుపై ఆర్‌బీఐ ఆంక్షలు విధించింది. ఒక్కో ఖాతా నుంచి పరిమితంగానే ఉపసంహరణకు అనుమతించింది. గురువారం ముంబైలో సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ స్టడీస్‌ను ప్రారంభించిన సందర్భంగా పరేఖ్ మాట్లాడుతూ.. ఆర్థిక సేవల రంగంలో సామాన్యుల కష్టార్జితంతో కూడిన పొదుపు సొమ్మును దుర్వినియోగం చేయడం కంటే మహా పాపం ఇంకోటి ఉండదన్నారు. ఏ ఆర్థిక వ్యవస్థకు అయినా కానీ విశ్వాసం, నమ్మకం అన్నవి వెన్నెముకగా పేర్కొన్నారు. రుణాలు పెరగాలంటే పొదుపులను ప్రోత్సహించాలని సూచించారు. జీడీపీలో పొదుపు రేటు 30% ఉందని, దశాబ్ద కాలంగా ఇది క్షీణిస్తున్నట్టు తెలుస్తోందన్నారు. ‘‘ఏ ఆర్థిక వ్యవస్థకు అయినా కానీ, ఇంటి పొదుపు ముఖ్యం. కనుక ఒక స్థాయికి మించి రుణాలు తగ్గితే కష్టమవుతుంది’’ అని పరేఖ్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మందగమనంలో మన వృద్ధి రేటు ఇప్పటికీ మెరుగ్గానే ఉందని చెప్పారు.

# ఓల్గా, హండ్కేలకు సాహితీ నోబెల్


ఓల్గా

### 2018, 2019 సంవత్సరాలకు గాను పురస్కారాలు

**స్టాక్‌హోమ్:** సాహితీ రంగంలో విశేషంగా కృషిచేసిన ఇద్దరు ప్రముఖ సాహితీవేత్తలకు ప్రతిష్టాత్మక నోబెల్ బహుమతి లభించింది. ఆస్ట్రియాకి చెందిన ప్రముఖ నవల, నాటక రచయిత పీటర్ హండ్కేకి 2019 సంవత్సరానికి గాను నోబెల్ పురస్కారం వరించింది. 2018 సంవత్సరానికి పోలండ్‌కి చెందిన ప్రముఖ పర్యావరణ వేత్త, స్త్రీవాది, మేధావి, నవలా రచయిత్రి ఓల్గా టోర్కార్క్జ్వీజ్‌కి 'ద బుక్స్ ఆఫ్ జాకోబ్' అనే నవలకు గానూ ఈ బహుమతి లభించింది. జ్ఞానపిపాసతో ఆమె చేసిన సృజనాత్మక రచనకు ఈ అత్యున్నత పురస్కారం లభించింది. అద్భుతమైన భాషా పరిజ్ఞానంతో మానవ అనుభవాల విశిష్టతను ప్రభావవంతంగా చాటి చెప్పినందుకు ఆమెకు ఈ ప్రతిష్టాత్మక నోబెల్ బహుమతి లభించింది.

**15 మంది స్త్రీలకే నోబెల్ పురస్కారం**

ఇప్పటి వరకు సాసాహితీరంగంలో కేవలం 14 మంది మహిళలనే నోబెల్ పురస్కారం వరించింది. ఈ రంగంలో నోబెల్ బహుమతి వచ్చిన మహిళల్లో ఓల్గా టోర్కార్క్జ్వీజ్ 15వ వారు. ఈమె రచనల్లో భిన్నత్వం ఉంటుంది. రెండు విభిన్న అంశాల మధ్యనున్న అంతరాన్ని ఉద్వేగపూరితంగా వర్ణిస్తారు. ఆమె నవలల్లో స్త్రీపురుషుల మధ్య, ప్రకృతికీ సంస్కృతికీ మధ్య, వివేచనకీ, అవివేకానికీ మధ్య వారి అంతరాంతరాల్లో రగులుతోన్న అంతర్మథనాన్ని అద్భుతంగా వర్ణిస్తారని నోబెల్ పురస్కారాన్ని ప్రకటించిన స్వీడిష్ అకాడమీ ప్రకటించింది. నిజానికి ఓల్గా టోర్కార్క్జ్వీజ్‌ని కొంత ఆలస్యంగా ఈ ప్రతిష్టాత్మక బహుమతికి ఎంపిక చేసినట్టు వారు వెల్లడించారు.

### చంపేస్తామన్నారు..

**జీ**వితంలో ఎన్నో చీకటి కోణాలను చూసిన 57 ఏళ్ళ పర్యావరణ వేత్త, శాఖాహారి అయిన ఓల్గా టోర్కార్క్జ్వీజ్ పోలండ్ మతతత్వ ప్రభుత్వ విధానాలనూ, చట్టాలనూ తూర్పారబట్టేందుకు వెనకాడని రాజకీయ వేత్త. సాహసోపేతమైన, నిర్భీతితో కూడిన ఆమె రచనలు పోలండ్ సమాజాన్ని కుదిపేసాయి. 'సహనశీల పోలండ్ మిథ్య' అంటూ ఆమె చేసిన రచనల కారణంగా 2015లో ఆమెను చంపేస్తామన్న బెదిరింపులు సైతం వచ్చాయి. దీంతో ప్రచురణకర్తలు ఆమెకు బాడీగార్డులను సైతం ఏర్పాటుచేశారు. సృజనాత్మకత ఉట్టిపడేలా చిత్రీకరించిన ఆమె రచనల్లోని పాత్రల కవితాత్మకత వర్ణన పాఠకులను కట్టిపడేస్తుంది. 1962, జనవరి 29న పోలండ్‌లోని వెస్టన్ టౌన్‌లో ఓల్గా జన్మించారు. యూనివర్సిటీ ఆఫ్ వార్సాలో ఆమె చదువుకున్నారు. ఆమె తండ్రి లైబ్రేరియన్ కావడంతో పుస్తకపఠనమే ప్రపంచంగా పెరిగారు. ఆమె తొలి నవల 'ద జర్నీ ఆఫ్ ద పీపుల్ ఆఫ్ ద బుక్' 1993లో ప్రచురించారు. ఓల్గా రచించిన 'ఫ్లైట్స్' నవలకు 2017లో బుకర్ ప్రైజ్ లభించింది. ఆమె రచించిన 900 పేజీల ''ద బుక్స్ ఆఫ్ జాకోబ్'' ఏడు దేశాలకూ, మూడు ప్రాంతాలకూ, ఐదు భాషల చరిత్రకు సంబంధించినది. 18వ శతాబ్దానికి చెందిన జూయిష్ అనే చిన్న తెగకు చెందిన బహుకొద్ది చరిత్ర మాత్రమే తెలిసిన ఫ్రాంకిసమ్ అనే వ్యక్తి చరిత్రను అన్వేషిస్తుంది.



### హండ్కే - వివాదాస్పద రచయిత..

**పీ**టర్ హండ్కే రచనలెంత ప్రాముఖ్యతను సాధించాయో, అంతే స్థాయిలో ఆయన వివాదాస్పదుడు కూడా. 1990లో యుగోస్లేవియా యుద్ధ సమయంలో సెర్బ్‌ల పక్షాన్ని వహించినందుకు ఆయనపై అనేక విమర్శలొచ్చాయి. మానవ హననం సాగించాడని, యుద్ధనేరానికి పాల్పడ్డాడని ఆరోపణలున్న మాజీ సెర్బ్ నేత స్లోబోదన్ మిలోసేవిక్ అంతిమయాత్రలో ఆయనకు మద్దతుగా ప్రసంగించడం కూడా పీటర్ హండ్కే వివాదాస్పదుడవడానికి మరో కారణం. 2014లో సాహిత్యరంగంలో నోబెల్ బహుమతిని నిషేధించాలని కూడా పీటర్ డిమాండ్ చేశారు. ఆయన రాసిన 'ద అవర్ వియ్ న్యూ నథింగ్ ఆఫ్ ఈచ్ అదర్' అనే సంభాషణలు లేని నాటకం చాలా ప్రసిద్ధి గాంచింది. పీటర్ హండ్కే పూర్తి స్వచ్ఛమైన జర్మన్ భాషా రచయితల్లో బతికి ఉన్న అతి కొద్దిమందిలో ఒకరు. సాహితీరంగంలో నోబెల్ పురస్కారాన్ని వ్యతిరేకిస్తూ ఆయన 'ఇది ఒక్క క్షణం ఆసక్తికీ, ఆరుపేజీల పత్రికా వార్తకీ' సంబంధించినదంటూ 2014లో అన్నారు. హండ్కే ఆస్ట్రియాలో రెండవ ప్రపంచ యుద్ధకాలంలో (1942, డిసెంబర్ 6) జర్మనీ సైనికుడికీ, స్లొవేనియాకు చెందిన మైనారిటీ తల్లికి జన్మించారు. బాల్యం యుద్ధ వాతావరణంలోగడిచింది. ఆ తరువాత ఆయన ఆస్ట్రియాలో ఆయన పెరిగి పెద్దయ్యారు. 1966లో 'ద హార్నెట్స్' అనే నవలతో సాహితీరంగంలో సంచలనం సృష్టించారు. దీంతో న్యాయవాద చదువుని మధ్యలోనే వదిలేసి సాహితీరంగం వైపు వచ్చారు.

# రైళ్ల ప్రైవేటీకరణకు కమిటీ

### 50 స్టేషన్ల అభివృద్ధి, 150 రైళ్ల ప్రైవేటీకరణకు నిర్ణయం



**న్యూఢిల్లీ:** నిర్ణీత కాలపరిమితితో దేశంలోని 150 పాసింజర్ రైళ్లను ప్రైవేటీకరించేందుకు, 50 రైల్వే స్టేషన్లను ప్రైవేటు ఆపరేటర్లకు ఇచ్చేందుకు కేంద్రం మరో అడుగువేసింది. ఈ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవల నీతిఆయోగ్ సీఈవో అమితాబ్ కాంత్ ఈ విషయమై రైల్వే బోర్డు చైర్మన్ వీకే యాదవ్‌కు ఇటీవల లేఖ రాశారు. ప్రభుత్వం ఏర్పాటుచేసే సాధికారిక యంత్రాంగం (కమిటీ) ఈ ప్రక్రియ అమలు తీరుని పర్యవేక్షిస్తుందని ఆయన ఆ లేఖలో తెలిపారు. వీకే యాదవ్, అమితాబ్‌లతోపాటు ఆర్థిక వ్యవహారాల శాఖ కార్యదర్శి, గృహ, పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శి ఉంటారు. రైల్వే బోర్డు ఇంజనీరింగ్ సభ్యుడు, ట్రాఫిక్ రైల్వే బోర్డు సభ్యుడిని కూడా ఈ సాధికారిక యంత్రాంగంలో భాగం చేయాలని అమితాబ్ కాంత్ తెలిపారు. 'ప్రపంచ స్థాయి ప్రమాణాలకు దీటుగా తొలుత కనీసం 50 రైల్వేస్టేషన్లను నవీకరించాలి. అలాగే అంతర్జాతీయస్థాయి సదుపాయాలతో, ప్రపంచస్థాయి సాంకేతిక పరిజ్ఞానంతో మొదటిదశలో 150 రైళ్లను నడపడానికి రైల్వే శాఖ ప్రైవేటు ఆపరేటర్లకు ఇప్పటికే అనుమతి ఇచ్చింది' అని అమితాబ్‌కాంత్ పేర్కొన్నారు. బిడ్డింగ్ ప్రక్రియను ఆమోదించే అధికారం ఈ కమిటీకే ఉంటుంది. 'ఆరు విమానాశ్రయాలను ప్రైవేటీకరించడంతో వచ్చిన ఫలితాలను బేరీజు వేస్తే, సాధికారిక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసేందుకు ఇదే సరైన సమయమని భావిస్తున్నాం' అని ఆయన అన్నారు.

# కర్ణాటక కాంగ్రెస్ నేతల ఇళ్లలో ఐటీ సోదా

### మాజీ డిప్యూటీ సీఎం పరమేశ్వర ఇంట్లోనూ..



**బెంగళూరు:** కర్ణాటక కాంగ్రెస్ నేత, మాజీ ఉపముఖ్యమంత్రి జి.పరమేశ్వర, ఆ పార్టీ మాజీ ఎంపీ జాలప్ప కొడుకు రాజేంద్ర ఇళ్లు, ఆఫీస్‌లలో ఆదాయపన్ను శాఖ (ఐటీ) అధికారులు గురువారం సోదాలు చేశారు. సిద్ధార్థ విద్యా సంస్థలను పరమేశ్వర కుటుంబం నిర్వహిస్తుండగా, ఆర్.ఎల్. జాలప్ప ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పేరుతో కర్ణాటకలోని కోలార్, దొడ్డబళ్లపురలో విద్యా సంస్థల్ని రాజేంద్ర నడుపుతున్నారు. ఈ మెడికల్ కాలేజీల్లో నిర్వహించిన నీట్ పరీక్షకు ఒకరికి బదులుగా మరొకరు హాజరై నీట్‌లో సీట్లు పొందేందుకు గాను విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి ముడుపులు స్వీకరించాయని ఆదాయ పన్ను శాఖ ఆరోపిస్తోంది. అందుకు సంబంధించి పన్ను ఎగవేతకు కూడా పాల్పడినట్లు ఈ విద్యాసంస్థలపై ఆరోపణలున్నాయి. పరమేశ్వరతో పాటుగా ఆయన సోదరుడు జి.శివప్రసాద్, అతని వ్యక్తిగత సహాయకుడు రమేశ్‌కు చెందిన ఇళ్లు, కార్యాలయాల్లో ఐటీ తనిఖీలు చేసింది.

# బీజేపీ ప్రతిష్ట పోకూడదనే...

### ప్రముఖులపై దేశద్రోహం కేసు వెనక్కు

**సాక్షి ప్రతినిధి, న్యూఢిల్లీ:** మూక దాడులపై నిరసనగా ప్రధాని మోదీకి బహిరంగ లేఖ రాసిన 49 మంది ప్రముఖులపై పెట్టిన రాజద్రోహం కేసును విత్‌డ్రా చేస్తున్నట్లు బిహార్ పోలీస్ శాఖ ప్రకటించింది. ఆ ప్రముఖులపై కేసు పెట్టడంపై దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తడం వల్లనే కేసును వెనక్కు తీసుకున్నట్లు తెలుస్తోంది. దేశం ఎదుర్కొంటున్న పలు సమస్యలపై రచయితలు, మేధావులు, సినీ ప్రముఖులు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి రోజుకు ఒక లేఖ రాయాలని నిర్ణయించుకోవడం ఈ కేసును ఎత్తివేయడానికి ప్రధాన కారణమని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ కేసుతో బీజేపీకి ఎలాంటి సంబంధం లేదని, కేసు వేసిన ఓఝాకి అవసరం ఉన్నా, లేకపోయినా, అనేకమందిపై కేసులు వేసిన చరిత్ర ఉందని బిహార్ డెప్యూటీ సీఎం సుశీల్ చెప్పారు. కేసు విషయంపై బీజేపీలో అంతర్గతంగా చర్చ జరిగిందని, ఈ అంశం పార్టీని దెబ్బ తీసే అవకాశముందనే అభిప్రాయానికి అందరూ వచ్చారని, అందువల్లనే కేసును విత్‌డ్రా చేసుకోవాలనే నిర్ణయం తీసుకున్నారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## క్లుప్తంగా...

### మరో పాక్ డ్రోన్

**చండీగఢ్:** పాకిస్తాన్‌కు చెందినదిగా భావిస్తున్న మరో డ్రోన్ పంజాబ్‌లో మంగళవారం కనిపించింది. పంజాబ్‌లో, భారత, పాకిస్తాన్ సరిహద్దుల్లో, ఫిరోజ్‌పూర్ దగ్గరలోని హుస్సేనీవాలా ప్రాంతంలో గగనతలంలో ఎగురుతున్న ఈ డ్రోన్‌ను స్థానికులు గుర్తించి, తమ మొబైల్స్‌లో రికార్డు చేశారు. మూడు రోజుల్లో ఈ ప్రాంతంలో ఓ డ్రోన్‌ను గుర్తించడం ఇది మూడోసారి. కాగా, పాక్ నుంచి ఆయుధాలతో డ్రోన్లు భారత భూభాగంలోకి రావడానికి సంబంధించి ఒక సమగ్ర నివేదికను కేంద్ర ఇంటెలిజెన్స్ బ్యూరో కేంద్ర హోంశాఖకు గురువారం సమర్పించింది.

### 'లలితా' దోపిడీ ప్రధాన నిందితుడి లొంగుబాటు

**సాక్షి ప్రతినిధి, చెన్నై:** తమిళనాడులో చర్చనీయాంశమైన లలిత జ్యువెలరీలో భారీ దోపిడీ కేసులో ప్రధాన నిందితుడు సురేష్ గురువారం తిరువణ్ణామలై జిల్లా సెంగం కోర్టులో లొంగిపోయాడు. ఈనెల 2న తిరుచ్చిరాపల్లి సత్రంబస్‌స్టేషన్ సమీపంలోని లలితా జ్యువెలరీ దుకాణం గోడకు కన్నంవేసి లోపలికి చొరబడిన ఇద్దరు దుండగులు దాదాపు రూ.13 కోట్ల విలువైన వజ్రాభరణాలను దొంగతనం చేయడం తెల్సిందే. ఈ కేసులో ఇప్పటికే ఇద్దరిని అరెస్ట్‌చేశారు.

### కశ్మీర్‌కు పర్యాటకులు

**శ్రీనగర్:** మంచుకొండల్లో పరిస్థితులు క్రమేణా చక్కబడుతుండడంతో రెండు నెలల అనంతరం కశ్మీర్‌లోయలోకి పర్యాటకులను తిరిగి అనుమతించారు. తీవ్రవాద కార్యకలాపాలు జరగొచ్చన్న ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారం మేరకు కశ్మీర్‌లోయలోని పర్యాటకులను తక్షణమే ఖాళీ చేయాలని ప్రభుత్వం ఆగస్ట్ 2న కోరడం తెల్సిందే.

### 'బిగ్‌బాస్-13 అశ్లీలం'

**లక్నో:** సల్మాన్‌ఖాన్ రియాలిటీ షో బిగ్‌బాస్ ప్రసారం ఇబ్బందుల్లో పడనుంది. బిగ్‌బాస్ రియాలిటీ షో-13 ప్రసారాన్ని నిలిపివేయాలంటూ బీజేపీ ఘజియాబాద్ ఎమ్మెల్యే నంద కిశోర్ గుజ్జార్ కేంద్ర సమాచార, ప్రసార మంత్రి జవదేకర్‌కి లేఖ రాశారు. బిగ్‌బాస్ కార్యక్రమం కుటుంబాలతో కలిసి చూడలేనంత అసభ్యకర దృశ్యాలతో ఉందన్నారు.

# సంయుక్త ప్రకటనలు, ఒప్పందాలు ఉండవ్



### మహాబలిపురంలో జిన్‌పింగ్, మోదీ భేటీ • నేడు భారత్‌కు రానున్న చైనా అధ్యక్షుడు • భారీ భద్రతా ఏర్పాట్లు

**న్యూఢిల్లీ/సాక్షి ప్రతినిధి, చెన్నై:** చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, భారత ప్రధాని నరేంద్రమోదీల మధ్య సమావేశానికి సన్నాహాలు పూర్తయ్యాయి. అక్టోబరు 11, 12వ తేదీల్లో చెన్నై సమీపంలోని మహాబలిపురం వేదికగా ఇరుదేశాల నేతల సమావేశం జరుగుతుందని భారత్, చైనా విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలు ప్రకటించాయి. పలు ద్వైపాక్షిక, ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై ఇరువురు నేతలు తమ ఆలోచనలను పంచుకునేందుకు ఈ సమావేశాలు వీలు కల్పిస్తాయని భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇది జిన్‌పింగ్‌ది అనధికార పర్యటన కావడంతో ఎలాంటి ద్వైపాక్షిక ఒప్పందాలు, సంయుక్త ప్రకటనలు, పత్రికా ప్రకటనలు ఉండవు. కేవలం ఇరువురు నేతల మధ్య వ్యక్తిగత సంబంధాల బలోపేతమే ఈ పర్యటన ఉద్దేశం. జిన్‌పింగ్ గడిపే 24 గంటల్లో మోదీతో కనీసం నాలుగు సార్లు సమావేశమయ్యే అవకాశాలున్నాయి. చారిత్రక ప్రాంతమైన మహాబలిపురంలో జరిగే సాంస్కృతిక ఉత్సవాలకు జిన్‌పింగ్, మోదీలు హాజరవుతారు. బంగాళాఖాతం సముద్ర అందాలను వీక్షిస్తూ చెన్నైలో రిసార్ట్‌లో ఇరువురు నేతలు అంతరంగిక చర్చలు జరుపుతారు. ఈ సందర్భంగా ప్రభుత్వం భారీ భద్రతా ఏర్పాట్లు చేసింది.

### కశ్మీర్ ద్వైపాక్షిక అంశం: చైనా

**జి**న్‌పింగ్ భారత్ పర్యటన నేపథ్యంలో కశ్మీర్ అంశంపై చైనా తన అభిప్రాయాన్ని బహిరంగ పరిచింది. ఇన్నాళ్లూ పాక్‌కు మద్దతుగా నిలిచిన చైనా ఆ దేశానికి షాక్ ఇచ్చింది. కశ్మీర్ ద్వైపాక్షిక అంశమని, ఆ రెండు దేశాలే దానిని పరిష్కరించుకోవాలని చెబుతూ పాక్‌ను అంతర్జాతీయంగా ఏకాకిని చేసింది. చైనా ప్రభుత్వ అధికార ప్రతినిధి గెంగ్ విలేకరులతో మాట్లాడుతూ అంతర్జాతీయ ఆకాంక్షలకు అనుగుణంగా భారత్, పాక్‌లు కశ్మీర్‌లు సమస్య ద్వైపాక్షిక చర్చల ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. అయితే చైనా తన మాట మీద ఎంతవరకు నిలబడుతుందన్నది ప్రశ్నార్థకమే.

### టూర్ షెడ్యూల్ ఇదీ

**మా**మల్లపురం (మహాబలిపురం) పాండవుల రథాల దగ్గర శుక్రవారం సాయంత్రం జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లో మోదీ, జిన్‌పింగ్ పాల్గొంటారు. అదే రోజు రాత్రి జిన్‌పింగ్ గౌరవార్థం సముద్ర తీర ప్రాంతంలో విందు ఉంటుంది. విందు చివర్లో ఇరుదేశాలకు చెందిన సీనియర్ అధికారులు పాలు పంచుకుంటారు.ఆ తర్వాత జిన్‌పింగ్ చెన్నైలో తను బస చేసే హోటల్‌కు వెళ్లిపోతారు.అక్టోబర్ 12 శనివారం ఉదయం 10 గంటలకు సముద్ర తీర ప్రాంతంలోని ఫైవ్‌స్టార్ రిసార్ట్‌లో మోదీ, జిన్‌పింగ్ 40 నిముషాల సేపు మాట్లాడుకుంటారు. తర్వాత ఇరువైపు దౌత్యబృందాలు అధికారిక చర్చలు జరుపుతాయి. అది పూర్తయ్యాక భోజనం సమయంలో మళ్లీ మోదీ , జిన్‌పింగ్‌లు చర్చిస్తారు.



### చర్చకు వచ్చే అంశాలు

**క**శ్మీర్ స్వయంప్రతిపత్తిని నిర్వీర్యం చేసే 370 ఆర్టికల్‌ను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడంతో భారత్, పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సమయంలోనే చైనా అధ్యక్షుడి భారత్ రాక ప్రాధాన్యతను సంతరించుకుంది. చైనాకు సరిహద్దుగా ఉన్న లద్దాఖ్‌ను కశ్మీర్ 370 అధికరణం రద్దు చేయడం ద్వారా కేంద్ర పాలిత ప్రాంతం చేయడంతో ఈ అంశం ప్రముఖంగా చర్చకు వచ్చే అవకాశం ఉంది. అరుణాచల్ ప్రదేశ్‌కు 100 కి.మీ. దూరంలో ఉన్న వాస్తవాధీన రేఖ వెంబడి భారత్ నిర్వహిస్తున్న సైనిక కసరత్తులు, ఉగ్రవాద వ్యతిరేక పోరాటం, ఆర్థిక సంబంధాలు, విదేశాంగ విధానాలు, చైనా 5జీ నెట్‌వర్క్ విధానం తదితర అంశాలపై ఇరు దేశాధినేతలు తమ మనోభావాలను పంచుకుంటారు.

# హరియాణాలో డేరా రాజకీయం




**హరియాణా అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో అన్ని ప్రధాన పార్టీలు ఆధ్యాత్మిక బాట పట్టాయి. డేరాలు, బాబాల చుట్టూ తిరుగుతూ మద్దతు కోసం పోటీ పడుతున్నాయి. హరియాణాలో ఆధ్మాత్మిక సంస్థల ప్రభావం ఓటర్లపై విపరీతంగా ఉంటుంది. తమ ఆధ్యాత్మిక గురువులు ఏ పార్టీకి ఓటు వెయ్యమని చెబితే వారికే గుడ్డిగా ఓటు వేసే అనుచరగణం అధిక సంఖ్యలోనే ఉంది. అందుకే రాజకీయాలన్నీ డేరాల చుట్టూ తిరుగుతున్నాయి.**

### డేరా సచ్చా సౌదా
గురువు: గుర్మీత్ రామ్ రహీమ్



అత్యాచారం, హత్య కేసులో దోషిగా తేలి జైల్లో ఊచలు లెక్కపెడుతున్న గుర్మీత్ రామ్ రహీమ్ ఈ సారి ఏ పార్టీకి మద్దతివ్వాలో ఇంకా నిర్ణయించుకోలేదు. ఈ డేరాలో 15 మంది సభ్యులతో కూడిన ఒక రాజకీయ వ్యవహారాల కమిటీ రాష్ట్రవ్యాప్తంగా సమావేశాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఆ సమావేశాల్లో వచ్చే ఫలితాలకనుగుణంగా ఏ పార్టీకి మద్దతివ్వాలో నిర్ణయిస్తామని కమిటీ సభ్యుడు జోగిందర్ సింగ్ చెప్పారు. డేరా సచ్చా సౌదా ప్రభావం రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో నియోజకవర్గాల్లో ఉంది.

### డేరా గౌకరణ్ ధామ్
గురువు: కపిల్ పురి



కాంగ్రెస్‌కు కపిల్‌పురి మద్దతుదారు. కాంగ్రెస్ నేత భూపీందర్ హుడాకు అనుకూలం. ఈ సారి ఎన్నికల్లో జోక్యం చేసుకోమని చెబుతున్నప్పటికీ బీజేపీకి మద్దతు ఇవ్వాలంటూ గౌకరణ్ ధామ్ డేరా తమ అనుచరగణానికి సంకేతాలు పంపుతోంది.

### సత్‌లోక్ ఆశ్రమ్స్ గురువు: రామ్‌పాల్



ఈ డేరా గురు రామ్‌పాల్ కూడా 2014 నవంబర్ నుంచే జైల్లో ఉన్నారు. అక్కడి నుంచే ఆయన రాజకీయాలను శాసిస్తున్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో రామ్‌పాల్ కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచారు. కానీ ఈ సారి ఏ పార్టీకి మద్దతివ్వాలో అన్న మీమాంసలో ఉన్నారు. ''లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల అంశాల్లో చాలా తేడా ఉంది. అక్టోబర్ 15న సర్వసభ్య సమావేశంలో చర్చించి ఏ పార్టీకి మద్దతునివ్వాలో తేల్చుకుంటాం''అని గురు రామ్‌పాల్ డేరా మీడియా ఇన్‌చార్జ్ చాంద్ రథి వెల్లడించారు. రోహ్తక్ చుట్టుపక్కలున్న అసెంబ్లీ నియోజకవర్గాల్లో గురు రామ్‌పాల్ డేరా ప్రభావం ఎక్కువగా ఉంది.

### డేరా బాబా శ్రీ బాలక్ పురి
గురువు: కరణ్ పురి



ఈ సారి ఎన్నికల్లో కరణ్ పురి డేరా ఎన్నికలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకుంది. హరియాణాలో నివసిస్తున్నా పంజాబీల్లో అధిక ప్రభావం కలిగిన ఈ డేరా తమ అనుచరులకు ఎలాంటి పిలుపు ఇవ్వడం లేదు. అయితే ఈ డేరాను బీజేపీ నాయకులు అత్యధికంగా సందర్శిస్తున్నారు.

# తేజస్ ఠాక్రేకు యువసేన బాధ్యతలు?



**సాక్షి ముంబై:** ఠాక్రే కుటుంబం నుంచి వారసులు మొదటిసారిగా ఎన్నికల బరిలోకి దిగడంతో ఈసారి ఎన్నికలకు ప్రాధాన్యం ఏర్పడింది. ఠాక్రే కుటుంబానికి చెందిన మూడోతరం యువసేన అధ్యక్షులు ఆదిత్య ఠాక్రే.. వర్లీ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీకి దిగడం తెల్సిందే. మరోవైపు. ఆదిత్య ఠాక్రే తమ్ముడు తేజస్ ఠాక్రే రాజకీయాల్లోకి అరంగేట్రం చేయనున్నట్టు వార్తలొస్తున్నాయి. ముఖ్యంగా ఆదిత్య ఠాక్రే ఎమ్మెల్యేగా విజయం సాధించిన అనంతరం ఆయన స్థానంలో యువసేన అధ్యక్షుని బాధ్యతలను తేజస్ ఠాక్రేకు అప్పగించనున్నట్టు వార్తలు గుప్పుమంటున్నాయి. సంగంనేర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో వేదికపై తేజస్ ఠాక్రే కన్పించారు.

# ఆ అభ్యర్థి ఆస్తులు 500 కోట్లు!



**సాక్షి, ముంబై:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల బరిలో ఎంతోమంది కుబేరులు నిలిచారు. అయితే వీరిలో బీజేపీ నుంచి పోటీలో నిలిచిన పరాగ్ షా రాష్ట్రంలోనే అత్యధిక సంపన్నుడుగా అగ్రస్థానంలో ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులు తమ ఆస్తుల వివరాలను వెల్లడించారు. ఈ వివరాల ప్రకారం, ముంబైలోని తూర్పు ఘాట్కోపర్ అసెంబ్లీ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి తన ఆస్తులను రూ.500 కోట్లుగా ప్రకటించారు. దీంతో ఆయన రాష్ట్రంలోనే అత్యధిక సంపన్న అభ్యర్థిగా పేరొందారు. తూర్పు ఘాట్కోపర్ నుంచి ఆరు సార్లు గెలిచిన ప్రకాష్ మెహతాకు ఈసారి టిక్కెట్ ఇవ్వలేదు. ప్రకాష్ మెహతాపై అవినీతి ఆరోపణలు రావడంతో ఆయన్ను పక్కనబెట్టిన పరాగ్‌ను బీజేపీ బరిలోకి దింపింది.










Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G, and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911, RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com